గరుడోపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ దివాకర్ల వేంకటావధాని

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2018

GARUDOPAKHYANAM
with Commentary

Commentary by
Dr. Divakarla Venkatavadhani

T.T.D. Religious Publications Series No. 1291
© All Rights Reserved

First Print : 2018

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **"మహాభారతం"** అయ్యింది.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **గరుడోపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

తిలకరేఖ

ఆదికవి, వాగమశాసనుఁడు అను సార్థక బిరుదనామాలుగల నన్నయ, తెలుగుసాహిత్య కళాక్షేత్రంలో ప్రథమ కృషీవలుడు. ఆయన నాటిన అనువాద బీజమే, మొలకగా, మ్రానుగా విస్తరించి, శాఖలతో నా నా దిక్కులాక్రమించి, ఆకాశమార్గాన్ని కప్పివేసింది. రాజరాజనరేంద్రుని అభ్యర్థన మేరకు, సంస్కృతభారతం, తెలుగుభారతంగా అనువాదం పొందటానికి ప్రథమాచార్యు డాయన.

వాక్ అనగా సరస్వతి, మాట అనే అర్థాలున్నా సరస్వతిని అనుశాసించే వాడు బ్రహ్మదేవుడే కనుక, వాగనుశాసన బిరుదం ఆయన కన్వర్థం. ఆంధ్రశబ్ద చింతామణి ఆంధ్రీకరణ విషయం ప్రక్కన బెడితే, ఆయన భారతానువాదంలో వాడిన పదాలు, సమాసాలు, తరువాత వచ్చిన కవులకు అనుసరణీయా లయ్యాయి. ఆయన ప్రయోగాలనుబట్టి లాక్షణికులు, పదసాధుతాసాధుత్వాలు నిర్ణయిస్తారు. కనుక ఆయన వాగనుశాసనుడే.

సంస్కృతభారతం, ఒక మహారణ్యం. ఒరులు ప్రవేశించటం కష్టసాధ్యం. అటువంటి భారతాన్ని చక్కని ఉద్యానవనంగా మార్చిన ఘనత నన్నయదే. అనువాదమంటే మూలంలోని ముక్కకు ముక్క, మక్కికి మక్కిగా అనువదించటం కాదనీ, అనువాదం తెలుగులో మొలచినట్లుండాలని భావించి, మహాభారతానువాదంలో ఎన్నో మార్పులు చేశాడు. ఒక స్వతంత్ర కావ్యం రచించే కవీంద్రుని వలె తన కవితా లక్షణాలను చెప్పుకొన్నాడు.

'సారమతింగవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తిలో
నారసిమేలునా, నితరులక్షర రమ్యత నాదరింప, నా
నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగుననన్ మహా
భారత సంహితారచనబంధురుడయ్యె జగద్ధితంబుగన్'.

ఇందులో ఈయన ప్రతిజ్ఞ చేసిన లక్షణాలు మూడు. మొదటిది ప్రసన్న కథాకలితార్థ యుక్తి, రెండవది అక్షర రమ్యత, మూడవది నానారుచిరార్థ సూక్తినిధిత్వం. ఈ మూడు లక్షణాలను సలక్షణంగా నిర్వర్తించాడు.

ప్రస్తుతం తి.తి.దేవస్థానం వారు, విద్యార్థులకు, సామాన్య పాఠకులకు, ఉపయోగార్థం. ప్రచురిస్తున్న ప్రణాళికలో గరుడోపాఖ్యానం తొట్టతొల్తటిది కావచ్చు. లేదా ద్వితీయం కావచ్చు. తొలుత ఉదంకోపాఖ్యానం ఉన్నది. గరుడోపాఖ్యానానికి పూర్వరంగం క్షీరసాగర మథనం. ఆ సముద్రంలో పుట్టిన ఉచ్చైశ్రవం, కథకుమూలహేతువవుతుంది గనుక, ఈ రెండింటిని కలిపి ప్రచురించటం సమంజసం, ఔచిత్యవంతం.

ముఖ్యంగా ఈ కథలో ఈ నాటి విమర్శకులందరూ గొంతులు చించుకొని అరుస్తున్న సామాజిక స్పృహ అతివేలంగా ఉంది. మానవనైజం. ఈ కథలో ప్రధానస్థానమాక్రమిస్తుంది. మానవులు స్త్రీలుగాని, పురుషులుగానీ సహజంగా స్వార్థపరులు. కద్రూవినతలు అప్పసెల్లెండ్రు. ఇద్దరూ కశ్యప ప్రజాపతి భార్యలే. ఇద్దరూ, భర్తను సంతానార్థం సేవించారు. కద్రువ అగ్నివంటి తేజస్సుగలవారు దీర్ఘశరీరాలు కలవారు ఐన కుమారులను వేయిమందిని ప్రసాదించుమని కోరింది. వినత వంతు వచ్చింది. ఆమె కూడా తనకు ఇటువంటి గుణాలు కలిగిన కుమారులను ప్రసాదించుమని అడుగవచ్చు. కాని, కద్రువకుమారుల కన్న భుజవీర్యులు, బలాధికులు కడింది వీరులు నయిన యిద్దరు కుమారులనిమ్మని కోరింది. వినత స్వార్థం, ఎంతటిదో పాఠకున కర్థమౌతుంది. అక్కకన్న తాను గొప్పదాననిపించుకోవాలని ఆమె ఆరాటం.

అప్పుడే కద్రువ మనస్సులో చెల్లెలియందు క్రోధరూపమైన యీర్ష్య కలిగింది. కాని దానిని బహిర్గతం కానీయకుండా, అవకాశం కోసం చూస్తున్నది. ఆ అవకాశం రానే వచ్చింది.

"ఏ తత్తే కథితం సర్వ మమృతం మథితం యథా, యత్ర సోऽశ్వ స్సముత్పన్నః శ్రీమా నతులవిక్రమః. యం నిశమ్య తదా కద్రూర్వినతామిద మబ్రవీత్ ఉచ్చైశ్రవాహి కిం భద్రే ప్రబ్రూహిమాంచిరమ్. వినతోవాచః శ్వేత ఏవాశ్వరాజోऽయం కిం వా త్వం మన్యసే శుభే బ్రూహి వర్ణం త్వమప్య స్య తతోऽత్ర విపణావహే. కద్రూరువాచః కృష్ణవాల మస్వీంతున్యే హయమేనం శుచిస్మితే ఏహిసార్థం మయాదీవ్యదాసీభావాయ భామిని. సౌతిరువాచ. ఏవంతే సమయం కృత్వా దాసీభావాయ వై మిథః జగ్మతుః స్వగృహానేవ శ్వోద్రక్ష్యావ ఇతిస్మహ".

మూలం చూడండి. కద్రువ తన మనస్సులోని క్రోధాన్ని ఎలా తీర్చుకొన్నదో! వినతనామె అడిగింది. ఉచ్చైశ్రవం ఏ రంగులో ఉన్నది అని. ఆమె తెల్లగా ఉన్నదని చెప్పి ఏ రంగులో ఉన్నదో నీవు చెప్పుమని అక్కనడిగింది. తోకమాత్రం నలుపు మిగిలిన శరీరమంతా నీవు చెప్పినట్లు తెలుపే. ఇందులో ఎవరోడిపోతే వారు రెండవవారికి దాసీత్వం చేయాలని పందెం పెట్టింది. అంతా కద్రూకార్యమే. వినతాప్రమేయం లేకుండానే జరుగుతుంది. రేపు చూద్దామని ఇద్దరూ ఇండ్లకు వెళ్ళిపోయారు.

నన్నయ కద్రువముందుగా వినతతో "చూడవె. అల్ల అతి ధవళం బైన అశ్వంబు నందు సంపూర్ణచంద్రునందునల్లయుంబోలె వాలపదేశంబునందు నల్లయైయున్నది యనిన విని వినతప్రనగి "నీవేకన్నులంజూచితే? యక్క! యెక్కడిది నల్ల? యీ యశ్వరాజుమూర్తి మహాపురుషకీర్తియుండబోలె అతినిర్మలంబైయొప్పుచున్నవి" అని అనువదించటం తెలుగుదనం కల్పించటం. ముందు కద్రువ వినతను రెచ్చగొట్టింది. నలుపులేని స్థానంలో నలుపును కల్పించి, వినతను రెచ్చగొట్టింది. సరే వినత ఒక చక్కని ఉపమానంతో అశ్వవర్ణాన్ని ఉపమించటం. నన్నయ వర్ణనావైదుష్యం. అప్పుడు కద్రువ పందెం వేసింది. వెంటనే పోయి చూద్దామన్నది వినత. కాని పతిపరిచర్యాకాలమయ్యిందనే మిషతో రేపువచ్చి చూద్దామని వినతను తీసికొనిపోయింది.

కథ నన్నయ ఎంత ప్రసన్నంగా చెబుతాడా? అనటానికీ సన్నివేశమొక దర్పణం. మూలంలో కద్రువ అంతగా రెచ్చగొట్టలేదు. ఇద్దరూ రేపు చూద్దామని వెళ్లిపోయాడు. కాని నన్నయ వెంటనే యింటికి వెళ్లటానికొక హేతువును ప్రదర్శించాడు. కశ్యపు డిరువురకు, పతియే గనుక తత్సేవాధర్మ మిద్దరికీ సమానమే. అందుకే వినత మారుమాటాడటానికి వీలులేని కారణంతో కద్రువ తన కార్యనిర్వహణకు పథకం వేసికొన్నది.

తా నబద్ధం చెప్పినట్లామెకు తెలుసు. కుమారులనడిగింది. ఉచ్చైశ్రవం తోకను నలుపుచేయుమని లేకపోతే తాను వినతకు దాసీత్వం చేయవలసి వస్తుందని చెప్పి వారి నా అధర్మకార్యనిర్వహణకున్ముఖులను చేయటానికి ప్రయత్నించింది.

అధర్మ మార్గంలో తన క్రోధాన్ని తీర్చుకొన్నది. ఇది యీనాటికీ మా నవసమాజంలో మనం చూస్తున్న స్వభావగుణం.

కశ్యప ప్రజాపతి యజ్ఞం నిర్వహిస్తున్నాడు. ఇంద్రుడు పెద్దపరిమాణం గల ఇధ్మములు మోసికొని వస్తున్నాడు. వాలఖిల్యులంగుష్ఠ ప్రమాణదేహులు. వారు అల్పకుశపతాశేధ్మములు తెస్తూ మోయలేక వణకుతూ వస్తున్నారు. వారిని చూచి ఎగతాళిగా నవ్వాడింద్రుడు. వాలఖిల్యులకు కోపం వచ్చింది. ఇంద్రునికన్న బలపరాక్రమాదులు గల మరియొక ఇంద్రుని సృష్టించటానికి వీర్యవంతాలైన మంత్రాలతో యజ్ఞం ప్రారంభించారు. అది దర్శించిన ఇంద్రునకు అపరిమిత భయం కలిగింది. పోయి తండ్రి కశ్యప ప్రజాపతి కాళ్లావ్రేళ్లా పడ్డాడు. ఆయన వచ్చి వాలఖిల్యాదులను ప్రార్థించి, బ్రహ్మ నియమించిన యింద్రుని స్థానంలో మరొక యింద్రుని సృజించుట బ్రహ్మదేవునే అవమానించుటగా చెప్పివాని నొప్పించి, ఆ పుట్టేవాడు ఖగకులేంద్రునిగా పుట్టేటట్లు చేయుడని వారినొప్పించి యింద్రుని రక్షించాడు.

ఇది కూడా మానవస్వభావ చిత్రణమే. త్రిలోకపతి యింద్రుడు మహాబలవంతుడు. గర్వపూరితుడయ్యాడు. అల్పశరీరులను చూచి పరిహసించాడు. ఫలం తానే పరాజితుడయ్యాడు. తన స్థితిని నిల్పుకోవటానికి ఎన్నో బాధలు పడ్డాడు. కనుక నేను బలవంతుడను, ధనవంతుడను, సౌందర్యవంతుడను, ఇలా గర్వపడుట పతనహతువౌతుందనే విషయాన్ని కథలో నిక్షేపించాడు.

నన్నయ తానుగా చెప్పుకొన్న కవితాలక్షణాలను ఎంత చక్కగా ఈ కథలో ప్రదర్శించాడో చూద్దాం. ఆయన తొలి ప్రతిన ప్రసన్న కథాకలితార్థ యుక్తి. మూలం ఇతిహాసం. కాని భారతాన్ని కావ్యంగా నన్నయ అనువదిస్తున్నాడు. కావ్యంలో కథ నేరుగా జీవనదీ ప్రవాహంలా ఆటంకాలు లేకుండా సాగిపోవాలి. కథ మంచి రసభరితంగా సాగే వేళ కథను నిల్పి అతి దీర్ఘ వర్ణనలను ప్రారంభిస్తే మధురపదార్థం స్వీకరించే సమయంలో పంటి క్రింద రాయిపడినట్లు పాఠకుడు బాధపడతాడు. ఆ వర్ణనలను వదలివైచి తరువాత కథ కోసం పుటలు త్రిప్పుతాడు.

మరునా డుదయమే కద్రువినతలు ఉచ్చైశ్రవహయాన్ని దర్శించటానికి సముద్రతీరానికి వెళ్లిరు. అది ఆధారం చేసికొని మూలభారతంలో సముద్ర వర్ణన మతిదీర్ఘంగా చేయబడింది. "దదృశాతేల_ధతే తత్ర సముద్రం నిధిమేం భసాం" అని ప్రారంభించి, ఆస్తీకపర్వణి ఏకవింశతి ద్వావింశతి (21-22 అధ్యాయాలు) దీర్ఘ సముద్ర వర్ణన చేయబడింది. నన్నయ ఆ దీర్ఘ వర్ణలను పరిహరించి, కథాకథనానికి సముచితంగా రెండు పద్యాలలో సముద్ర వర్ణనము కావించి తరువాత కథలోనికి ప్రవేశించినాడు.

వినత యొక్క రెండవ అండం పగిలి సహజరీతిలో గురుత్మంతుడు జన్మించాడు. అక్కడ మూలంలో దేవతలు, నరులు నాగులు యక్షులు ఆయనను అనేక విధాల స్తుతించారు. "త్వం వా ధాతా విధాతా చ త్వం

విష్ణు స్సురసత్తమ" ఇత్యాది స్తోత్రాలతో స్తుతించిన విధానం మూలంలో అతి దీర్ఘంగా సాగింది. కావ్య లక్షణానికీ దీర్ఘ వర్ణన మధ్యభాగంలో అనౌచిత్యంగా భావించాడు నన్నయ. మొత్తం ఆ స్తోత్ర పాఠభాగమంతా తీసివేశాడు. ఒకే ఒక్క పద్యంలో గరుడుని వర్ణించి కథాభాగానికి దీప్తిని కొని వచ్చినాడు.

కం॥ దారుణ కల్పాంతమరు
త్ప్రేరిత హవ్యవహ శిఖల వెల్లిది యని బృం
దారక మునిబృందస్తుతి
బోరనఁదా నగ్ని సూక్తములతో నెసఁగెన్

అనే పద్యంతో మూలంలోని స్తోత్రభాగాన్నంతా పరిహరించినాడు.

గరుత్మంతుడు కద్రువని యోగించిన పనులన్నీ శ్రద్ధగా ఆచరిస్తున్నాడు. ఒకనాడు పాములను తన వీపుమీద ఎక్కించుకొని సూర్యమండల పర్యంతం వెళ్లాడు. సూర్యకిరణాల వేడిమికి ఆ సర్పాలన్నీ వ్రేలబడి మూర్ఛను చెంది నేలమీదపడ్డాయి. కోపంతో గురుడని నిందించింది. దేవేంద్రుని గూర్చి స్తుతించింది కద్రువ. మూల భారతంలో ఆ స్తుతి విపులంగా చేయబడింది. దేవేంద్రుడు మేఘాల నాదేశించాడు. మహాగర్జలతో మేఘాలు గగనంలో వ్యాపించాయి. "నష్టచంద్రార్క కిరణ మంబరం సముపద్యత నాదానాముత్తమో హర్షస్తదా వర్షతివాసవే" ఆ విమలజల శీతలత్వంతో సర్పాలన్నీ సేద తీరాయి.

ఈ విపుల వర్ణనను పరిహరించిన నన్నయ.

చ. నరసురసిద్ధకింపురుష నాగనభశ్చరముఖ్యులెల్ల నీ
కరుణయ వేచిమంద్రు త్రిజగంబులు నీకులిశాభిరక్షణ
స్ఫురణనచేసి సుస్థిరతఁ బొందుఁ బురందర! సర్వలోకసుం
దర! శరణంబు నాకగుము దానవసూదన! పాకశాసనా!

అనే ఒక్కపద్యంతో దేవేంద్రుని స్తుతించినట్లు మాత్రం చెప్పి కథను నడిపించినాడు.

మూలంలో విపులాతివిపులమైన వర్ణనలను కొన్ని తీసివేసి, కొన్నింటిని క్లుప్తంగా చేసి, మరికొన్ని చోట్ల తాను కల్పించిన స్వల్ప వర్ణనలతో కథను నడిపించినాడు. తరువాత సంస్కృత పురాణాలను, కావ్యాలను అనువదించిన కవులకందరకు, నన్నయమార్గమే ఆదరణీయమైంది. తిక్కన సోమయాజి అసలు, అతిదీర్ఘవర్ణనల జోలికి పోలేదు. భారతమధ్యంలో ఉన్న సనత్సుజాతీయం, భగవద్గీత, విష్ణుసహస్రనామాది ఘట్టాల జోలికి వెళ్లలేదు. కథాగమనమధ్యంలో అతిదీర్ఘ నీతిశాస్త్ర, ఆధ్యాత్మికశాస్త్ర బోధనలను ఉంచితే పాఠకుల రసానందానికి భంగం కలుగుతుంది. భగవద్గీతా శ్లోకాల నెన్నింటినో అనువదించాడు. అనువాద విధానంలో నన్నయ మార్గాన్నే అనుసరించినాడు.

రెండవ లక్షణమైన అక్షర రమ్యతను చక్కగా పాటించాడు. నా దృష్టిలో అక్షర రమ్యత అంటే, పద్యంలో ఏ భావాన్ని నిక్షిప్తం చేస్తున్నాడో, ఆ భావాన్ని శబ్ద ప్రయోగంతో ప్రదర్శించటం.

ఈ పద్యాలకు వ్యాఖ్య వ్రాసేటప్పుడు సంపా అనే గుర్తుతో కొన్ని పద్యాలకు, విశేషార్థాలను చెప్పారు. 11 వ పద్యం క్షోణీచక్రభరంబు" అనే పద్యానికి విశేషం వివరిస్తూ అక్షర రమ్యత నెలా ప్రతిపాదించినాడో ఉటంకించారు.

వివిధోత్తుంగ తరంగ ఘట్టనచలద్వేలా వనైలావలీ
లవలీలుంగలవంగసంగతలతాలాస్యంబులీక్షించుచున్
ధవళాక్షుల్ సని కాంచిరంత నెదురం దత్తీరదేశంబునం
దవదాతాంబుజఫేనపుంజనిభు నయ్యశ్వోత్తమున్ దవ్వులన్

స్త్రీలు చేసే నృత్యం లాస్యం. పురుషుల నృత్యం తాండవం. 'లతా' ఆకార స్త్రీ లింగం గనుక. లతాలాస్యములన్న నన్నయ ఆ లాస్యమెంత మనోజ్ఞమో ఆ మనోజ్ఞత్వాన్ని మృదుమధురశబ్దసమాసంతో ప్రదర్శించాడు.

ఇక మూడవది నానారుచిరార్థసూక్తినిధిత్వం. కథాగమనాన్ని బట్టి అక్కడక్కడ నన్నయ సార్వజనీనాలు, సార్వదేశికాలు, సార్వకాలికాలైన ధర్మాలను గుదిగ్రుచ్చిపోస్తూ ఉంటాడు. 'గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్', 'క్రోధమ యణిమాదులైన గుణములఁబాపున్' వంటి ధర్మాలెన్నో సందర్భానుసారంగా చెబుతుంటాడు. అవే నానా రుచిరార్థసూక్తినిధిత్వానికి ఉదాహరణలని నా భావం.

ఈ కథలోకూడా అలాగే కొన్నిచోట్ల చొప్పించాడు. వినతతో పందెం వేసిన తరువాత కద్రువ ఇంటికి పోయి తన కుమారులను చూచి

"యుల్లతెల్లని యురగోత్తము వాలంబు
నల్లసేసితిరేని నాకు దాసి
యగు మన వినత మీరట్లు సేయనినాఁడు
దానికి మఱియేన దాసి నగుదు" అని చెప్పి ఉచ్చైశ్రవం వాలాన్ని నలుపు చేయవలసిందనికోరింది. అంటే ఒక నల్లనిపాము పోయి ఆ గుఱ్ఱం తోకను పట్టుకొని వ్రేలాడుతూ ఉండవలసిందని ఆదేశించింది. ఆ మాట విని ఆమె కుమారులు "తల్లిపనిచె నని అధర్మువుసేయఁగ నగునె?" అంటారు. ఎంత తల్లి ఐనా, అధర్మాన్ని ప్రోత్సహిస్తే అది చెయ్యవచ్చునా? చేయరాదు కదా! అని తల్లినే ప్రశ్నిస్తారు. ఈ వాక్యమే తరువాత కాలంలో చిలకమర్తి వారిచేత

"అరసి చన్నిచ్చి పెంచిన అమ్మయైన
విషము పెట్టినఁగుడుచునే ప్రియసుతుండు?" అనిపించింది.

నీ బలమెంతటిదో వివరించవలసిందని ఇంద్రుడు గరుడని యడుగుతాడు. అపుడాయనతో వైనతేయుడు

"పరనిందయు నాత్మగుణో
త్కరపరికీర్తనముఁ జేయఁగా నుచితమె? స

త్పురుషులకైనను నీక
చ్చెరువుగ నా కల తెఱంగుఁ జెప్పెదఁ బ్రీతిన్" అంటాడు.

ఎంతటి వాడైనా తనను తాను పొగడుకోకూడదు. ఇతరులను నిందింపరాదు. అది ఉచితం కాదు. మన గొప్పతనాన్ని పరులు గుర్తించి ప్రశంసించాలి. అలా పొగడుకోవటం దుష్టుల లక్షణం. నా శక్తిని ఉన్నదున్నట్లు అతిశయోక్తులు, పొగడ్తలు లేకుండా వచిస్తానంటాడు.

ఈ గరుడోపాఖ్యానం తదుపరికాలంలో ఎన్నో ఇలాంటి కథలు పుట్టటానికి హేతువైందని పరిశోధకులంటారు. తల్లియైన బాలనాగమ్మను చెఱబట్టిన మాయలఫకీరును సంహరించటానికి ఆతని వద్దకు చేరుకొంటాడు. ఆమె కుమారుడు ఫకీరు ప్రాణాల నెక్కడో ఏడు సముద్రాలు దాటిన తరువాత ఒక భయంకర పర్వతగుహలో మిడతలలో నిక్షేపించి ఉంటాడు. అనేక శ్రమలతో బాలవర్ధిరాజక్కడకు చేరి ఆ మిడతలను బట్టి ఆ ఫకీరును చంపి, తల్లిదండ్రులను వాని చెఱనుండి విడిపించి స్వతంత్రతనిస్తాడు. సరిగా నీ కథ గరుడోపాఖ్యానికి ప్రతిబింబంగా విజ్ఞులు భావించారు. ఇంకా ఎన్నో కథలున్నాయి.

సామాన్య పాఠకులు, విద్యార్థులు, ఈ ఉపాఖ్యానం చదివితే తెలుగు సాహిత్య సౌందర్యం, తెలుగు కవుల ప్రతిభావ్యుత్పత్తులు, తల్లిఋణం తీర్చుకోవటానికి కుమారుని తాపత్రయం, వర్ణనావైదుష్యం, కథాచిత్రణం వంటివి అవగతమౌతాయి.

ఇందులో గరుడడు తల్లిని "పయోరుహాననా!" పద్మము వంటి ముఖము గలదానా! అని సంబోధించటం అనౌచిత్యమని కొందరు భావించారు. స్త్రీ పర్యాయపదాలలో ఏకవీ, వాచ్యార్థాన్ని స్వీకరించి ప్రయోగించాడని చెప్పలేం. 'స్త్రీ' అనే రూఢ్యర్థాన్ని (పిండితార్థాన్ని) స్వీకరించారు. పెద్దన 'కలచునే సతుల మాయల్' అన్నాడు. సతి అనగా పతివ్రత. పతివ్రతలు మాయలు చేస్తారా?

ఇక్కడ చెలులు అనవచ్చు. కాని ఆయన సతులు అన్నాడు. వానిని స్త్రీ వాచకపదాలుగానే పూర్వకవులు ప్రయోగించారు.

సామాన్య పాఠకులకు, చక్కగా అర్థం కావటానికి ఈ విధమైన ప్రక్రియ నెన్నుకొన్నందులకు, తి.తి.దే. యాజమాన్యానికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు చెప్పవలసిందే.

అందులో సాహిత్యంలో తలస్పర్శ మొనరించిన మహామహోపాధ్యాయ శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్యగారి ఆధ్వర్యంలో ఈ కార్యం జరగటం, బంగారానికి తావులద్దినట్లే. ఈ అవకాశం కల్గించిన తి.తి.దే యాజమాన్యానికి శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్యగారికి నా కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలి.

రేపల్లె — ఇట్లు

హేవళంబి-గ్రీష్మం — **మొవ్వ వృషాద్రిపతి**

గరుడోపాఖ్యానము

కద్రూవినతలు పుత్రులం గోరి పడయుట (సం. 1-14-5)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుంజెప్పె: నాదియుగంబునం గశ్యపప్రజాపతి భార్యలయిన కద్రువయు వినతయు ననువారలు పుత్త్రార్థిను లైయనేక సహస్ర వర్షంబులు కశ్యపు నారాధించినం, గశ్యపుండు ప్రసన్నుం డై 'మీకోరినవరంబు లిచ్చెద వేఁడుం' డనిన. 1

ప్రతిపదార్థం: ఆ+కథకుండు (త్రికసంధి)= రోమహర్షణు డనే సూతుడి కుమారు డయిన ఉగ్రశ్రవసుడు; శౌనక+ఆది, మహత్, మునులకున్= శౌనకుడు మొదలయిన మహామునులకు; చెప్పెన్; ఆది, యుగంబునన్= కృతయుగంలో; కశ్యప, ప్రజాపతి, భార్యలు+అయిన= కశ్యపబ్రహ్మభార్య లయిన; కద్రువయు, వినతయున్, అను, వారలు= కద్రువ, వినత అనేవారు; పుత్త్ర+అర్థినులు+ఐ= కొడుకులను కోరేవారై; అనేక, సహస్ర, వర్షంబులు= పెక్కువేలఏండ్లు; కశ్యపున్, ఆరాధించినన్= కశ్యపుడిని సేవించగా; కశ్యపుండు; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహం కలవాడై; మీ, కోరినవరంబులు= మీరు కోరినవరాలను (కర్మపదప్రథమకు షష్ఠి); ఇచ్చెదన్= ఇస్తాను; వేఁడుండు= కోరుకొనండి; అనినన్= అని అనగా.

తాత్పర్యం: కథకుడైన ఉగ్రశ్రవసుడు శౌనకుడు మొదలయినమహామునులకు ఇట్లా చెప్పాడు: కృతయుగంలో కశ్యపబ్రహ్మయొక్క భార్య లయిన కద్రువ, వినత లనేవారు కుమారులనుకోరినవారై, పెక్కువేలఏండ్లు కశ్యపుడిని సేవించగా, అతడు అనుగ్రహం కలవా డై 'మీరు కోరినవరాలను ఇస్తాను కోరుకొనండి' అని పలుకగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తరలము.

అనలతేజులు, దీర్ఘదేహులు నైనయట్టి తనూజులన్
వినుతసత్త్వులఁ గోరెఁ గద్రువ వేవురం గడువేడ్కతోఁ;
వినత గోరె సుపుత్త్రులన్ భుజవీర్యవంతుల, వారికం
టెను బలాధికు లైన వారిఁ, గడిందివీరుల, నిద్దఱన్. **2**

ప్రతిపదార్థం: కద్రువ; అనల, తేజులు= అగ్నియొక్కప్రకాశంవంటి ప్రకాశం కలవారు; దీర్ఘ, దేహులు= పొడవయినశరీరం కలవారు; ఐన, అట్టి; తనూజులన్= కుమారులను; వినుత, సత్త్వులన్= ప్రసిద్ధిపొందినబలం కలవారిని; వేవురన్= వెయ్యిమందిని; కడు, వేడ్కతోన్= మిక్కిలిఆసక్తితో; కోరెన్; వినత; భుజ, వీర్యవంతులన్= బాహువులయొక్క బలంకలవారిని; వారి కంటెను= ఆకద్రువకొడుకుల కంటె; బల+అధికులు+ఐనవారిన్= బలంలో గొప్పవారిని; కడింది, వీరులన్= ఇతరులకు జయింపశక్యం కాని అధిక వీరులను; సుపుత్త్రులన్= మంచికుమారులను; ఇద్దఱన్= ఇరువురిని; కోరెన్= కోరింది.

తాత్పర్యం: అగ్నివలె ప్రకాశించేవారున్నూ, పొడవయినదేహాలుకలవారున్నూ ప్రసిద్ధి పొందిన బలం కలవారున్నూ అయిన వెయ్యిమందికుమారులను కద్రువ మిక్కిలి సంతోషంతో కోరింది. వినత, ఆ కద్రువకుమారులకంటె బలంలో గొప్పవారున్నూ, బాహువులబలం కలవారున్నూ, అయిన ఇద్దరు మంచికుమారులను కోరింది.

విశేషం: తరల వృత్తానికి ప్రతిపాదంలోనూ న, భ, ర, స, జ, జ, గ - అనే గణాలుంటాయి. 12వ అక్షరం యతి. పాదానికి 19 అక్షరాలుంటాయి.

వ. కశ్యపప్రజాపతి తొల్లి పెద్దకాలంబు తపంబు సేసి, పుత్త్రకామేష్టిఁ జేసెఁ గావునఁ గద్రువకు వేవురుకొడుకులను, వినతకు నిద్దఱుకొడుకులను వారికోరినయట్ల యిచ్చి, గర్భంబు లిమ్ముగా రక్షింపంబనిచిన నయ్యిద్దఱును

దద్దయు సంతసిల్లి యున్నంత, గర్భంబులు గొండొకకాలంబునకు నండంబు లైన, నయ్యం డంబులు ఘృతకుండంబులం బెట్టి రక్షించుచున్నంత, నేనూఱేండ్లకుఁ గద్రూగర్భాండంబులు తరతరంబ యవిసిన నందు శేష వాసుక్యైరావత తక్షక కర్కోటక ధనంజయ కాళియ మణినాగాపూరణ పింజర కైలాపుత్త్ర వామన నీలానీల కల్మాష శబలార్య కోగ్రక కలశపోతక సురాముఖ దధిముఖ విమలపిండ కాప్త కర్కోటక శంఖవాలి శిఖ నిష్ఠానక హేమగుహ నహుష పింగళ బాహ్యాకర్ణ హస్తిపద ముద్గర పిండక కంబలాశ్వతర కాళీయక వృత్త సంవర్తక పద్మశంఖముఖ కూష్మాండక క్షేమక పిండారక కరవీర పుష్పదంష్ట్ర బిల్వక బిల్వపాండర మూషకాద శంఖశిరః పూర్ణభద్రహరిద్రకా పరాజిత జ్యోతిక శ్రీవహ కౌరవ్య ధృతరాష్ట్ర శంఖపిండ వీర్యవ ద్విరజస్సుబాహు శాలిపిండ హస్తిపిండ పిఠరక సుముఖ కౌణపాశన కుఠర కుంజర ప్రభాకర కుముద కుముదాక్ష తిత్తిరి హాలిక కర్దమ బహుమూలక కర్కరాకర్కర కుండోదర మహోదరు లాదిగాఁగల వేవురు నాగముఖ్యులు పుట్టిన. **3**

ప్రతిపదార్థం: కశ్యప ప్రజాపతి= కశ్యపబ్రహ్మ; తొల్లి= పూర్వం; పెద్దకాలంబు, తపంబు, చేసి; పుత్త్ర, కామ+ఇష్టిన్= పుత్త్ర, కామ మనే యజ్ఞాన్ని (కుమారులు కలగాలనే కోరికతో చేసే యాగాన్ని); చేసెన్; కావునన్= అట్లా యజ్ఞం చేయటంవలన; కద్రువకున్; వేవురన్, కొడుకులను= వెయ్యిమంది కుమారులను; వినతకున్, ఇద్దఱన్, కొడుకులన్; వారి, కోరిన, అట్లు+అ= వారు కోరిన విధంగానే; ఇచ్చి; గర్భంబులు= కడుపులోని పిండాలను; ఇమ్ముగాన్= ఉపాయంగా; రక్షింపన్, పనిచినన్= రక్షించటానికి నియమించగా; ఆ+ఇద్దఱును= ఆ కద్రూవినతలిద్దరును; తద్దయున్= మిక్కిలి; సంతసిల్లి, ఉన్నంతన్; గర్భంబులు= కడుపులోనిపిండాలు; కొండొక, కాలంబునకున్=

కొంతకాలానికి; అండంబులు+ఐనన్= గ్రుడ్లుగా మారగా; ఆ+అండంబులు= ఆ గ్రుడ్లు; ఘృత, కుండంబులన్= నేతికుండలలో; పెట్టి; రక్షించుచున్న, అంతన్= రక్షిస్తూఉండగా; ఏను, నూఱు+ఏండ్లకున్= అయిదువందల సంవత్సరాలకు; కద్రూ, గర్భ+అండంబులు= కద్రువయొక్క గర్భంనుండి పుట్టిన గ్రుడ్లు; తరతరంబు+అ= ఒకదానితర్వాత ఒకటిగా; అనిసినన్= పగలగా; అందున్= ఆ గ్రుడ్లలో; శేషుడు, వాసుకి, ఐరావతుడు, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు, కాళియుడు, మణినాగుడు, ఆపూరణుడు, పింజరకుడు, ఏలాపుత్త్రుడు, వామనుడు, నీలుడు, అనీలుడు, కల్మాషుడు, శబలుడు, ఆర్యకుడు, ఉగ్రకుడు, కలశపోతకుడు, సురాముఖుడు, దధిముఖుడు, విమలపిండకుడు, ఆప్తుడు, కర్కోటకుడు, శంఖుడు, వాలిశిఖుడు, నిష్ఠానకుడు, హేమగుహుడు, నహుషుడు, పింగళుడు, బాహ్యాకర్ణుడు, హస్తిపదుడు, ముద్గరుడు, పిండకుడు, కంబలుడు, అశ్వతరుడు, కాళీయకుడు, వృత్తుడు, సంవర్తకుడు, పద్మడు, శంఖముఖుడు, కూష్మాండకుడు, క్షేమకుడు, పిండారకుడు, కరవీరుడు, పుష్పదంష్ట్రుడు, బిల్వకుడు, బిల్వపాండరుడు, మూషకాదుడు, శంఖశిరుడు, పూర్ణభద్రుడు, హరిద్రకుడు, అపరాజితుడు, జ్యోతికుడు, శ్రీవహుడు, కౌరవ్యుడు, ధృతరాష్ట్రుడు, శంఖపిండుడు, వీర్యవంతుడు, విరజుడు, సుబాహువు, శాలిపిండుడు, హస్తిపిండుడు, పిఠరకుడు, సుముఖుడు, కౌణపాశనుడు, కుఠరుడు, కుంజరుడు, ప్రభాకరుడు, కుముదుడు, కుముదాక్షుడు, తిత్తిరి, హలికుడు, కర్దముడు, బహుమూలకుడు, కర్కరుడు, అకర్కరుడు కుండోదరుడు, మహోదరుడు; ఆదిగాన్, కల= మొదలుగా గల; వేవురు= వెయ్యిమంది; నాగముఖ్యులు= సర్పశ్రేష్ఠులు; పుట్టినన్= పుట్టగా.

తాత్పర్యం: పూర్వం కశ్యపబ్రహ్మ ఎక్కువకాలం తపస్సుచేసి, కుమారులను పొందగోరేవారు చేసే పుత్రకామేష్టి అనే యాగాన్ని చేశాడు. అట్లా చేయటంవలన కద్రువకు వెయ్యిమందికొడుకులను, వినతకు ఇద్దరుకొడుకులను వారు కోరినట్లుగా ఇచ్చి, గర్భాలను ఉపాయంతో కాపాడటానికి ఆజ్ఞాపించగా,

వారిద్దరూ మిక్కిలిసంతోషించారు. కొంతకాలానికి గర్భాలు అండాలుగా మారాయి. వాటిని నేతికుండలలో ఉంచి రక్షిస్తూండగా అయిదువందల సంవత్సరాలకు కద్రువగర్భంలోని అండాలు, ఒకదాని తరువాత ఒకటిగా పగిలి, శేషుడు, వాసుకి, ఐరావతుడు, తక్షకుడు మొదలయిన వెయ్యిమంది సర్పశ్రేష్ఠులు పుట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

అనూరుఁడు జనించి వినతకు శాప మిచ్చుట (సం. 1-14-14)

క. తన గర్భాండంబులరెం।
టను బ్రియనందనులు వెలువడమి, నతిలజ్జా
వనత యయి వినత పుత్త్రా।
ర్థిని యొకయండంబు విగతధృతి నవియించెన్. 4

ప్రతిపదార్థం: తన, గర్భ+అండంబుల, రెంటను= తనయొక్కకడుపునుండి పుట్టిన పిండరూపా లయిన గ్రుడ్లు రెండింటిలోను; ప్రియ, నందనులు= ప్రీతికరు లైన (కూరిమి)కొడుకులు; వెలువడమిన్= బయటపడకుండటంచేత; అతిలజ్జా+అవనత, అయి= మిక్కిలి సిగ్గుచేత క్రుంగిన దై; పుత్త్ర+అర్థిని= కొడుకులను కోరేటి; వినత; ఒక, అండంబున్= ఒక గ్రుడ్డును; విగత, ధృతిన్= పోయిన ధైర్యంతో; అవియించెన్= పగులగొట్టింది.

తాత్పర్యం: తన గర్భంనుండి పుట్టినగ్రుడ్లు రెండింటినుండి ముద్దుకుమారులు బయల్పడని కారణాన, మిక్కిలిసిగ్గుచేత క్రుంగినదై, కొడుకులను కోరే వినత ధైర్యం కోల్పోయి ఒకగ్రుడ్డును బ్రద్ద లయ్యేట్లు చేసింది.

క. దాన నపరార్ధకాయవి।
హీనుఁడు, పూర్వార్ధతనుసహితుఁ డరుణుఁ డనం
గా నుదయించె సుతుండు, మ।
హానీతియుతుండు తల్లి కప్రియ మెసఁగన్. 5

ప్రతిపదార్థం: దానన్= బ్రద్దలు చేయబడినగ్రుడ్డునుండి; అపర+అర్ధ, కాయ, విహీనుఁడు= క్రింది సగం శరీరం లేనివాడు; పూర్వ+అర్ధ, తను, సహితుఁడు= మీదిసగంశరీరంతో కూడినవాడు; అరుణుఁడు+అనంగాన్= అరుణుడనే పేరుతో; తల్లికిన్= తల్లి అయిన వినతకు; అప్రియము= అనిష్టం; ఎసఁగన్= అతిశయించగా; మహత్, నీతి, యుతుండు= గొప్పనీతితో కూడినవాడైన; సుతుండు= కుమారుడు; ఉదయించెన్= పుట్టాడు.

తాత్పర్యం: ఆగ్రుడ్డునుండి క్రిందిసగందేహం లేనివాడున్నూ, మీదిసగందేహంతో కూడినవాడున్నూ అయినకుమారుడు అరుణు డనే పేరుతో గొప్పనీతితోకూడినవాడు తల్లికి అనిష్టం అతిశయించేటట్లు పుట్టాడు.

వ. ఇట్లు వికలాంగుం డై పుట్టిన యనూరుండు వినతకు నలిగి 'నన్ను సంపూర్ణశరీరుం గానీక యండం బవియించిన యవినీతవు కావున నీవు నీసవతికి దాసివై యేనూఱేం డ్లుండు' మని శాపం బిచ్చి, 'యింక నీ రెండవయండంబు తనకుఁ దాన యవియునంతకు నుండని; మ్మిందుఁ బుట్టెడు పుత్త్రుండు మహాబలపరాక్రమ సంపన్నుండు నీ దాసీత్వంబు వాపు' నని సెప్పి సూర్యరథసూతుండయి యరిగె; వినతయు నయ్యండం బతిప్రయత్నంబున రక్షించుకొనియుండె; నంత. 6

ప్రతిపదార్థం: ఇట్లు; వికల+అంగుండు+ఐ= సంపూర్ణం కాని శరీరం కలవాడై; అనూరుండు= తొడలు లేనివాడు- ఇది అరుణుని నామాంతరం; వినతకున్, అలిగి= తల్లి అయిన వినతపై కోపించి (నన్నయనాడు ఇట్టిచోట్ల షష్ఠీవిభక్తి వాడబడుతూ ఉండేది. ఇది కారకభేదం); సంపూర్ణ, శరీరున్, కానీక= సమగ్రమయిన శరీరం కలవాడిని కానీయకుండ; అండంబు= గ్రుడ్డును; అవియించినన్= బ్రద్దలు చేయగా; అవినీతవు= నీతి లేని దానివి; కావునన్= ఆకారణంచేత; నీవు; నీసవతికిన్= నీ సవతి అయిన కద్రువకు; దాసివి+ఐ= సేవకురాలివై; ఏను, నూఱు+ఏండ్లు+ఉండుము, అని= అయిదువందలేండ్లు

ఉండు మని; శాపంబు+ఇచ్చి= శాపాన్నిచ్చి; ఇంకన్= ఇకముందు; ఈ, రెండవ, అండంబు= వినత గర్భంనుండి వెలువడిన వేరొకగ్రుడ్డు; తనకున్, తాను+అ= తనంతట అదే; అవియు, అంతకున్= బ్రద్దలయ్యేంతవరకు; ఉండన్+ఇమ్ము; ఇందున్= ఈ రెండవగ్రుడ్డునుండి; పుట్టెడు, పుత్త్రుండు= పుట్టబోయే కుమారుడు; మహత్, బల, పరాక్రమ, సంపన్నుండు= గొప్పబలంతోను, శౌర్యంతోను కూడినవాడు; నీ, దాసీత్వంబు= నీదాసితనాన్ని; పాపున్= పోగొడతాడు; అనిచెప్పి; సూర్య, రథ, సూతుండు+అయి= సూర్యునియొక్కరథానికి సారథి అయి; అరిగెన్= వెళ్ళాడు; వినతయున్= వినతకూడ; ఆ+అండంబు= ఆ రెండవగ్రుడ్డును; అతి, ప్రయత్నంబునన్= మిక్కిలి ప్రయత్నంతో; రక్షించుకొని, ఉండెన్= కాపాడుకొని ఉండింది; అంతన్= ఆపైన.

తాత్పర్యం: పూర్తిగా ఏర్పడనిశరీరంతో పుట్టిన అనూరుడు, వినతపై కోపగించుకొని 'నన్ను పూర్తిశరీరం కలవాడిని కానీయకుండ గ్రుడ్డును బ్రద్దలుచేసిన నీతి లేనిదానివి. కావున నీ సవతి అయిన కద్రువకు దాసిగా అయిదువందలసంవత్సరాలు ఉండు' మని శపించి రెండవగ్రుడ్డు తనకుతానుగా పగిలేవరకు ఉండనిమ్ము. ఈ గ్రుడ్డునుండి పుట్టబోయే కుమారుడు గొప్పబలంతోను, పరాక్రమంతోను కూడినవాడు. అతడు నీదాసితనాన్ని పోగొడతాడు' అని తెలిపి సూర్యుడికి రథసారథిగా వెళ్ళాడు. వినతకూడ మిక్కిలి జాగరూకతతో ఆగ్రుడ్డును రక్షించుకొని ఉండింది. ఆ పైన (తరువాతి పద్యంతో అన్వయం.)

దేవాసురు లమృతమును బడయఁగోరి సముద్రమును మథించుట
(సం.1-15-5)

క. అమరాసురవీరులు ము ।
న్నమల పయోరాశిఁ ద్రచ్చి, యమృతము వడయన్

సమకట్టి, సురేంద్రపురో ।

గము లై హరిహరహిరణ్యగర్భులతోడన్. 7

ప్రతిపదార్థం: అమర+అసుర, వీరులు= వీరులయిన దేవతలు, రాక్షసులు; మున్ను= పూర్వం; అమల, పయోరాశిన్= నిర్మలమయిన పాలసముద్రాన్ని; త్రచ్చి= మథించి; అమృతము+పడయన్= అమృతాన్ని పొందటానికి; సమకట్టి= సిద్ధపడి; సుర+ఇంద్ర, పురోగములు+ఐ= దేవతల రాజయిన ఇంద్రుడు ముందు కలవారై; హరి, హర, హిరణ్యగర్భులతోడన్= విష్ణువు, శివుడు, బ్రహ్మ అనేవారితో.

తాత్పర్యం: పూర్వం వీరులయిన దేవతలూ, రాక్షసులూ పాలసముద్రాన్ని మథించి అమృతాన్ని పొందటానికి పూని ఇంద్రుడిని ముందుంచుకొని విష్ణుశంకరబ్రహ్మలతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. మేరుమహామహీధరముమీఁదికి నందఱుఁ బోయి, 'యేక్రియన్
వారిధిఁ ద్రచ్చువారము? ధ్రువంబుగ దానికిఁ గవ్వ మెద్ది? యా
ధారము దాని కెద్ది?' యని తద్దయు వెన్బడియున్న, నచ్యుతాం
భోరుహగర్భులిద్దఱును బూనిరి సర్వము నిర్వహింపఁగన్. 8

ప్రతిపదార్థం: మేరు, మహత్, మహీధరము, మీఁదికిన్= మేరు అనే గొప్పపర్వతంమీదికి; అందఱున్+పోయి= దేవతలు రాక్షసులు అందరును వెళ్ళి; ఏక్రియన్= ఏవిధంగా; వారిధిన్= సముద్రాన్ని, త్రచ్చువారము= మథించగలం; ధ్రువంబుగన్= స్థిరంగా; దానికిన్= ఆకార్యానికి; కవ్వము; ఎద్ది= ఏది; దానికిన్= ఆకవ్వానికి; ఆధారము= అవలంబం; ఎద్ది= ఏది; అని; తద్దయున్= ఎక్కువగా; వెన్బడి, ఉన్నన్= చింతిస్తూ వెనకాడుతుండగా; అచ్యుత+అంభోరుహ, గర్భులు+ ఇద్దఱున్= విష్ణువు, బ్రహ్మ, ఇద్దరును; సర్వమున్= కార్యాన్నంతటిని; నిర్వహింపఁగన్= సాధించటానికి; పూనిరి= సమకట్టినారు.

తాత్పర్యం: దేవాసురు లందరూకలిసి మేరుపర్వతంమీదికి పోయి, 'ఏవిధంగా సముద్రాన్ని మథిద్దాము? మథించటానికి స్థిరమైన కవ్వం ఏది? ఆకవ్వానికి క్రింద ఆధార మేది?' అని మిక్కిలి చింతించి వెనుకాడుతుండగా బ్రహ్మవిష్ణువులిద్దరూ, ఆ మథనకార్యాన్నంతటినీ సాధించటానికి సమకట్టారు.

చ. అరుదుగ సర్వశైలములయంత తనర్పును నార్జవంబు సు
స్థిరతయు నోషధీరసవిశేషతయుం గల దుత్తమంబు మం
థరకుధరంబు గవ్వ మగు దానికి నంచును నిశ్చయించి, య
య్యిరువురుఁ బంపఁగాఁ బెఱికి యెత్తె ననంతుఁడు తద్గిరీంద్రమున్.9

ప్రతిపదార్థం: అరుదుగన్= అపూర్వంగా; సర్వ, శైలముల, అంత, తనర్పును= అన్ని పర్వతాలంత పొడవును; ఆర్జవంబు= సరళత్వాన్ని (వంకరలేనితనాన్ని); సుస్థిరతయున్= మంచి స్థిరత్వాన్ని; ఓషధీ, రస, విశేషతయున్= మూలికల యొక్క రసంయొక్క అతిశయం కలిగి ఉండటాన్ని; కలది= కలిగి ఉన్నది; ఉత్తమంబు= శ్రేష్ఠమైనది అయిన; మంథర, కుధరంబు= మంథరపర్వతం; దానికిన్= ఆమథించేకార్యానికి; కవ్వము+ అగున్; అంచును; నిశ్చయించి= నిర్ణయించి; ఆ+ఇరువురును= ఆబ్రహ్మవిష్ణువులిద్దరూ; పంపఁగాన్= ఆజ్ఞాపింపగా; అనంతుఁడు= శేషుడు; తద్, గిరి+ఇంద్రమున్= ఆపర్వతశ్రేష్ఠాన్ని; పెఱికి= పెళ్ళగించి, ఎత్తెన్= ఎత్తాడు.

తాత్పర్యం: అపూర్వంగా అన్నిపర్వతాలు కూడితే ఎంతపొడవుంటుందో అంత పొడవున్నూ, వంకరలేనిఎత్తున్నూ, మిక్కిలిస్థిరత్వాన్నీ కలిగి, మూలికల రసంయొక్క అతిశయత్వంతో కూడి శ్రేష్ఠమైనది అయిన మంథరపర్వతం, క్షీరసాగర మథనానికి కవ్వ మవుతుందని నిర్ణయించి ఆ బ్రహ్మవిష్ణువు లిరువురూ ఆజ్ఞాపించగా, శేషుడు ఆ పర్వతశ్రేష్ఠాన్ని పెళ్ళగించి పైకెత్తాడు.

వ. ఇట్లు పదునొకండువేలయోజనంబులతనర్పును, నంతియపాఁ తునుం గల మంథరనగం బనంతుం డనంత శక్తిం బెఱికి యెత్తిన,

నందఱును నప్పర్వతంబు దెచ్చి, సముద్రంబులో వైచి, దానిక్రింద నాధారం
బుగాఁ గూర్మరాజు నియమించి, యోక్త్రంబుగా వాసుకి నమర్చి. 10

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; పదునొకండు, వేల, యోజనంబుల, తనర్పును= పదకొండువేల ఆమడల(నాలుగుక్రోసులు) పొడవున్నూ; అంతియ, పాఁతునున్= పదకొండువేలయోజనాల భూమిలోపలిభాగాన్నీ; కల; మంథరనగంబు= మంథర పర్వతాన్ని; అనంతుండు= ఆదిశేషుడు; అనంత, శక్తిన్= అధికమయినశక్తితో; పెటికి= పెల్లగించి; ఎత్తినన్= ఎత్తగా; అందఱును= దేవాసురులందరూ; ఆ+పర్వతంబు+తెచ్చి= ఆమంథర పర్వతాన్ని తెచ్చి; సముద్రంబులోన్; వైచి= వేసి; దానిక్రిందన్= ఆపర్వతానికి అడుగున; ఆధారంబుగాన్= అవలంబంగా; కూర్మరాజు= ఆదికూర్మాన్ని (తాఁబేటిని); నియమించి= నియోగించి, యోక్త్రంబుగాన్= కవ్వపుత్రాడుగా; వాసుకిన్= వాసుకి అనే సర్పరాజును; అమర్చి= ఏర్పరచి.

తాత్పర్యం: ఈవిధంగా పదకొండువేలయోజనాల పొడవున్నూ, అంతే (అంటే పదకొండువేలయోజనాల) భూమిలోని భాగాన్నీ కలిగిన మంథరపర్వతాన్ని ఆదిశేషుడు అధిక మైన శక్తితో పెళ్ళగించి ఎత్తగా, దేవాసురులందరున్నూ ఆమంథరపర్వతాన్ని తెచ్చి, సముద్రంలో వేసి, దిగబడిపోకుండ దానిక్రింద ఆధారంగా ఆదికూర్మాన్ని నియోగించి, కవ్వపుత్రాడుగా వాసుకి అనే పేరున్న సర్పరాజును ఏర్పాటుచేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. క్షోణీచక్రభరంబు గ్రక్కదల దిక్కుల్ మ్రోయఁగా నార్చి, య
క్షీణోత్సాహసమేతు లై రయమునన్ గీర్వాణులుం, బూర్వగీ
ర్వాణవ్రాతము నబ్ధిఁ ద్రచ్చునెడఁ దద్వ్యాకృష్టనాగానన
శ్రేణీప్రోత్థవిషాగ్నిధూమవితతుల్ సేసెం బయోదావలిన్. 11

ప్రతిపదార్థం: క్షోణీ, చక్ర, భరంబు= భూమియొక్కభారం, క్రక్కదలన్= మిక్కిలి కదలగా; దిక్కుల్= దిక్కులు; మ్రోయఁగాన్= ప్రతిధ్వనించగా;

ఆర్చి= బొబ్బలిడి; అక్షీణ+ఉత్సాహ, సమేతులు+ఐ= అధికమయిన ఉత్సాహంతో కూడినవా రై; రయమునన్= వేగంతో, గీర్వాణులున్= దేవతలున్నూ; పూర్వగీర్వాణ, వ్రాతమున్= రాక్షసుల యొక్కసమూహమున్నూ; అబ్ధిన్= సముద్రాన్ని; త్రచ్చు+ఎడన్= మథించేటప్పుడు; తద్, వ్యాకృష్ట, నాగ+ఆనన, శ్రేణీ, ప్రోత్థ, విష+అగ్ని, ధూమ వితతుల్= వారిచేత లాగబడిన వాసుకి అనే సర్పంయొక్క ముఖాలవరుసనుండి బయల్వెడలిన విష మనే అగ్నియొక్క పొగలసముదాయాలు; పయోద+ఆవళిన్= మేఘాల పంక్తిని, చేసెన్= సమకూర్చాయి (కలిగించాయి).

తాత్పర్యం: గుండ్రని భూమి అంతయూ మిక్కిలి కదలగా, దెసలు మారుమ్రోయగా, కేకలువేస్తూ, అధిక మయిన ఉత్సాహంతో కూడినవారై, వేగంతో దేవతలున్నూ, రాక్షస సముదాయమున్నూ సముద్రాన్ని మథించేటప్పుడు వారిచే లాగబడిన వాసుకిసర్పంయొక్క ముఖాలవరుసనుండి బయల్వెడలిన విష మనే అగ్నియొక్క పొగలగుంపులు మేఘపంక్తిని కల్పించాయి.

విశేషం: ప్రయోగదక్షుడైనకవి కవితలో వాడే వర్ణాలూ, పదాలూ ఏ విధంగా రసాదివ్యంజకా లౌతాయో, అట్లాగే సమాస సంఘటనలుకూడ విభావాదులను, రసాదులను వ్యంజింప చేస్తాయి. క్షోణీచక్రము, అక్షీణోత్సాహసమేతులు, గీర్వాణులు, పూర్వగీర్వాణులు అనే సమాసాలలో మూర్ధన్యము, అనునాసికమూ అయిన ణ వర్ణపునఃపునరావృత్తి వారు చేసే నాదాన్ని ధ్వనింపచేస్తున్నది. వాసుకి ముఖంనుండి వినిర్గతమైన విషాగ్నిధూమతతులను ఈపద్యంలో మిగిలిన సమాసాలకంటె దీర్ఘమైన సమాసంగా సంఘటించటంచేత వాసుకి ధైర్యం, విషానలధూమవ్యాప్తీ అక్షరరమ్యంగా ధ్వనింపజేయబడుతున్నాయి. (సంపా.)

క. ఉరగపతితలలవల నురు।
తరజవమున నసురు లూఁది, తత్పుచ్ఛము ని

ర్జరవరు లూఁది మహామ ।
త్సరమున వడిఁ ద్రచ్చి త్రచ్చి జవమఱియున్నన్. 12

ప్రతిపదార్థం: ఉరగపతి, తలల, వలను= సర్పరా జయిన వాసుకియొక్క తలలవైపు; ఉరుతర, జవమునన్= మిక్కిలి అధిక మయిన శక్తితో(వడితో); అసురులు= రాక్షసులు; ఊఁది= పట్టుకొని; తద్, పుచ్ఛము= ఆవాసుకి యొక్కతోకను; నిర్జరవరులు= దేవతా శ్రేష్ఠులు; ఊఁది; మహత్, మత్సరమునన్= అధికమయిన చలంతో; వడిన్= వేగంతో; త్రచ్చి, త్రచ్చి= మథించి మథించి; జవము+అఱి, ఉన్నన్= శక్తి నశించి ఉండగా.

తాత్పర్యం: రాక్షసులు సర్పరాజయిన వాసుకితలలవైపును అధికమైనశక్తితో పట్టుకొని, దేవతలు దానితోకను పట్టుకొని మిక్కిలి పట్టుదలతో మథించి మథించి (మిక్కిలిగా మథించి) శక్తి తగ్గి ఉండగా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నారాయణుండు వారి క । వారితజవసత్త్వములు ధ్రువంబుగ నిచ్చెన్;
వారును దొల్లిటికంటె న । పారప్రారంభు లై రపరిమితశక్తిన్. 13

ప్రతిపదార్థం: నారాయణుండు= విష్ణువు, వారికిన్= ఆ దేవరాక్షసులకు; అవారిత, జవ, సత్త్వములు= తగ్గని వేగాన్ని, శక్తిని; ధ్రువంబుగన్= స్థిరంగా; ఇచ్చెను; వారును= ఆదేవరాక్షసులున్నూ; అపరిమితశక్తిన్= అధికమయినశక్తితో; తొల్లిటికంటెన్= మునుపటికంటె; అపార, ప్రారంభులు+ఐరి= అంతం లేని ప్రయత్నం కలవా రయ్యారు.

తాత్పర్యం: విష్ణువు, ఆ దేవరాక్షసులకు తగ్గనివేగాన్నీ, శక్తినీ స్థిరంగా ఇచ్చాడు. వారు అధికమయిన శక్తితో పూర్వంకంటె మేర లేని ప్రయత్నం గలవా రయ్యారు.

చ. ఉడుగక యొండొరుం జఱచి యొక్కబలంబున దేవదానవుల్
వడిగొని వార్ధి నిట్లు దరువం దరువన్ విష ముద్భవిల్లి నల్

గడలను విస్ఫులింగములు గప్పఁగఁ బర్విన, దానిఁ జెచ్చెరన్
మృడుఁడు గడంగి పట్టుకొని మ్రింగి గళంబున నిల్పెఁ బొల్పుగన్. 14

ప్రతిపదార్థం: ఉడుగక= మానక; ఒండు+ఒరున్= ఒకరినొకరిని; చఱచి= అరచేతకొట్టి; ఒక్కబలంబునన్= ఏకధాటిగా; దేవ, దానవుల్= దేవతలును, రాక్షసులును; వడి, కొని= వేగంవహించి; వార్ధిన్= సముద్రాన్ని; ఇట్లు= ఈవిధంగా; తరువన్, తరువన్= మథించగా, మథించగా; విషము; ఉద్భవిల్లి= పుట్టి; నల్గడలను= నాలుగుదిక్కులలోనూ; విస్ఫులింగములు= నిప్పుకణాలు; కప్పఁగన్= ఆవరించేటట్లుగా, పర్వినన్= వ్యాపించగా; దానిన్= ఆవిషాన్ని; మృడుఁడు= శివుడు; చెచ్చెరన్= శీఘ్రంగా; కడంగి= పూని; పట్టుకొని; మ్రింగి; గళంబునన్= కంఠంలోపల; పొల్పుగన్= పొందికగా; నిల్పెన్= ఉంచాడు.

తాత్పర్యం: దేవాసురులు మానక ఉత్సాహంతో ఒండొరులను చేతులతోచరచుకొంటూ ఏకధాటిగా వేగం పెంచి సముద్రాన్ని ఇట్లా మథించగా, మథించగా విషం పుట్టి నాలుగుదిక్కులా నిప్పుకణాలు ఆవరించేటట్లు వ్యాపించగా, దాన్ని వేగంతో శివుడు పూని పట్టుకొని మ్రింగి పొందికగా అందంగా ఉండేటట్లు కంఠంలోపల నిలిపాడు.

విశేషం: సముద్రమథనంవలన విషం పుట్టింది. నాలుగుదిక్కులా నిప్పురవ్వలు గుప్పింది. నిజానికి విస్ఫులింగాలు కావవి విషబిందువులు. కాని, కవి ప్రౌఢోక్తిచేత వాటిని విస్ఫులింగాలంటున్నాడు. అప్పుడది రూపకాలంకారం కావాలి. ఉపమేయాన్ని చెప్పకుండా ఉపమానాన్నే చెపుతున్నాడుకాబట్టి అతిశయోక్తి కావాలి. విషం అగ్నివలె దాహకంగా ఉన్నదని ఇక్కడి విస్ఫులింగశబ్దం స్ఫురింపజేస్తున్నది. కాబట్టి ఇక్కడ కవి ప్రౌఢోక్తిసిద్ధమైన అలంకారంవలన ఏర్పడిన వస్తుధ్వని ఉన్నది. వస్తుధ్వనిని నిర్వహించటంలో నన్నయ పాటించే పద్ధతులలో ఇది సర్వసాధారణ మైనది. దీనిని నానారుచిరార్థసూక్తిలో భాగంగా కొందరు భావిస్తారు. (సంపా.)

వ. మఱియు జ్యేష్ఠయుఁ జంద్రుండును శ్రీయును నుచ్చైశ్శ్రవంబును గౌస్తుభంబును నైరావణగజంబును నమృతపూర్ణశ్వేతకమండలు ధరుండైన ధన్వంతరియు నాదిగా ననేకంబు లుద్భవిల్లిన, నందుఁ ద్రిభువనవంద్య యయిన శ్రీదేవియు నిజప్రభాపటలపర్యుదస్త ప్రభాకరగభస్తివిస్తరం బయిన కౌస్తుభంబును నారాయణు వక్షఃస్థలంబున విలసిల్లె; నుచ్చైశ్శ్రవం బను యుగ్యంబు నైరావణగజంబును సురరాజయోగ్యంబు లయ్యెఁ; నంత నయ్యమృతంబు నసురులు చేకొనిన. 15

ప్రతిపదార్థం: మఱియున్= అదిగాక; జ్యేష్ఠయున్= జ్యేష్ఠాదేవియు; చంద్రుండును; శ్రీయునున్= లక్ష్మీదేవియు; ఉచ్చైశ్శ్రవంబును= ఆ పేరుగలగుర్రమున్నూ; కౌస్తుభంబును= కౌస్తుభమణియున్నూ; ఐరావణగజంబును= ఐరావణమనేపేరున్న ఏనుగున్నూ; అమృత, పూర్ణ, శ్వేత, కమండలు, ధరుండు+ఐన, ధన్వంతరియున్= అమృతంతో నిండిన తెల్లని కమండలాన్ని ధరించినవాడైన ధన్వంతరిఅనేపేరుగల దేవవైద్యుడున్నూ; ఆదిగాన్= మొదలుగా; అనేకంబులు= పెక్కు; ఉద్భవిల్లినన్= పుట్టగా; అందున్= వాటిలో; త్రిభువన, వంద్య, అయిన= మూడులోకాలకు నమస్కరించదగిం దైన; శ్రీదేవియున్= లక్ష్మీదేవియు; నిజ, ప్రభా, పటల, పర్యుదస్త, ప్రభాకర, గభస్తి, విస్తరంబు+ఐన= తనకాంతిసముదాయంచేత నిరసింపబడిన సూర్యునికిరణాల సముదాయం కలదైన; కౌస్తుభంబును; నారాయణ, వక్షఃస్థలంబునన్= విష్ణువుయొక్క రొమ్మున; విలసిల్లెన్= ప్రకాశించాయి; ఉచ్చైశ్శ్రవంబు+అను; యుగ్యంబు= గుర్రమున్నూ; ఐరావణ, గజంబును= ఐరావణమనేఏనుగున్నూ; సురరాజ, యోగ్యంబులు= దేవేంద్రుడికి తగినవి; అయ్యెన్; అంత, ఆ+అమృతంబున్; అసురులు= రాక్షసులు; చేకొనినన్= గ్రహించగా.

తాత్పర్యం: అదికాక, జ్యేష్ఠాదేవి, చంద్రుడు, లక్ష్మి, ఉచ్చైశ్శ్రవమనే తెల్లనిగుర్రం, కౌస్తుభమణి, అమృతంతో నిండిన తెల్లని కమండలం ధరించిన

ధన్వంతరి అనే దేవవైద్యుడు, ఐరావణ మనే తెల్లఏనుగు మొదలుగా గల పెక్కు (వ్యక్తులును, వస్తువులును, జంతువులును) పుట్టగా, వాటిలో ముల్లోకాలకూ నమస్కరింపదగిన లక్ష్మీదేవి, తనకాంతి సముదాయంచేత తిరస్కరించబడిన సూర్యుని కిరణాల సముదాయం గల కౌస్తుభమణి విష్ణునిరొమ్మున ప్రకాశించాయి (విష్ణువు వాటిని గ్రహించాడు). ఉచ్చైశ్శ్రవ మనేగుర్రం, ఐరావత మనే ఏనుగు దేవేంద్రుడికి తగిన వయ్యాయి (వాటిని ఇంద్రుడు గ్రహించాడు). అప్పుడు ఆ అమృతాన్ని రాక్షసులు గ్రహించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నారాయణుండు కృత్రిమ ।
నారీరూపమునఁ దన్మనంబుల కతి మో
హారంభకారుఁ డై, యమ ।
రారులచేఁ గ్రమ్మఱంగ నమృతము గొనియెన్. 16

ప్రతిపదార్థం: నారాయణుండు= విష్ణువు; కృత్రిమ, నారీ, రూపమునన్= మాయాకాంతా రూపంలో; తద్+మనంబులకున్= ఆరాక్షసుల మనసులకు; అతి, మోహ+ఆరంభకారుఁడు+ఐ= అధికమయిన మోహంయొక్క ఉదయం కలిగించే వాడై; అమర+అరులచేన్= దేవతలకు శత్రువు లైన రాక్షసులనుండి; క్రమ్మఱంగన్= తిరుగ; అమృతము; కొనియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: విష్ణువు మాయాకాంతారూపంతో రాక్షసుల మనస్సులకు అధిక మయిన మోహంకలిగించినవాడై వారినుండి తిరిగి అమృతాన్ని గ్రహించాడు.

వ. ఇ ట్లుపాయంబున నసురుల వంచించి యమృతంబు గొని విష్ణుదేవుండు దేవతల కిచ్చిన, నయ్యమృతంబు దేవత లుపయోగిం చుచోదేవరూపంబు దాల్చి రాహువు వేల్పులబంతి నయ్యమృతం బుపయోగించుచున్నఁ దత్సమీపంబున నున్న చంద్రాదిత్యులు వాని నెఱింగి నారాయణునకుం జెప్పిన, నయ్యమృతంబు వాని కంఠబిలంబు సొరకముందఱ. 17

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; ఉపాయంబునన్= నేర్పుతో; అసురులన్= రాక్షసులను; వంచించి= మోసగించి; అమృతంబు; కొని= గ్రహించి; విష్ణుదేవుండు; దేవతలకు+ఇచ్చినన్; ఆ+అమృతంబు= ఆ అమృతాన్ని; దేవతలు; ఉపయోగించుచోన్= త్రాగునప్పుడు; దేవ, రూపంబు= దేవతయొక్కరూపం; తాల్చి= ధరించి; రాహువు= రాక్షసులలో ఒకడు; నవగ్రహాలలో ఒకడు; వేల్పులబంతిన్= దేవతలవరుసలో; ఆ+అమృతంబు; ఉపయోగింపన్, పోయినన్= త్రాగటానికి వెళ్ళితే; తద్, సమీపంబునన్= అతని చెంత; ఉన్న= ఉండిన; చంద్ర+ఆదిత్యులు= చంద్రుడును, సూర్యుడును; వానిన్= రాహువును; ఎఱింగి= తెలిసికొని; నారాయణునకున్= విష్ణువుకు; చెప్పినన్= తెల్పగా; ఆ+అమృతంబు; వాని, కంఠబిలంబు= రాహువుయొక్క కంఠంయొక్క రంధ్రాన్ని; చొరక, ముందఱన్= ప్రవేశించటానికి ముందే.

తాత్పర్యం: ఈవిధంగా నేర్పుతో రాక్షసులను మోసగించి అమృతం గ్రహించి విష్ణువు దాన్ని దేవతల కిచ్చాడు. ఆ అమృతాన్ని దేవతలు త్రాగేటప్పుడు, దేవతారూపం ధరించి రాహువు దేవతల పంక్తిలో కూర్చుండి అమృతాన్ని త్రాగబోగా, అతనిచెంత ఉండిన చంద్రసూర్యులు వాడిని గుర్తించి విష్ణువుకు చెప్పారు. ఆ అమృతం రాహువు కంఠరంధ్రం ప్రవేశించటానికి ముందే (రాహువు దాన్ని మ్రింగటానికి ముందే). (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అమరారిమర్దనుఁడు చ।
క్రము గ్రక్కున నేయ, రాహుకంఠము దెగి దే
హము ధరణిఁ బడియెఁ, దన్ముఖ।
మమృతస్పర్శమున నక్షయం బై నిలిచెన్. 18

ప్రతిపదార్థం: అమర+అరి, మర్దనుఁడు= దేవతలకు శత్రువులైన రాక్షసులను సంహరించేటివిష్ణువు; చక్రము= తన ఆయుధ మైన సుదర్శనాన్ని; గ్రక్కునన్= వేగంగా; ఏయన్= ప్రయోగించగా, రాహు, కంఠము= రాహువుయొక్కమెడ; తెగి; దేహము= శరీరం; ధరణిన్= భూమిపై; పడియెన్= పడింది; తద్, ముఖము= ఆరాహువుయొక్కముఖం; అమృతస్పర్శమునన్= అమృతంయొక్క తాకుచేత; అక్షయంబు+ఐ= నాశనంలేనిదై; నిలిచెన్= ఉండిపోయింది.

తాత్పర్యం: రాక్షసాంతకు డయిన విష్ణువు తనచక్రాన్ని వేగంగా ప్రయోగించగా రాహువుయొక్కకంఠం తెగటంచేత శరీరం భూమిపై పడింది. అతడిముఖంమాత్రం అమృతంయొక్క తాకుచేత నాశనం లేనిదై ఉండిపోయింది.

విశేషం: ఇచట తెగి అనే క్త్వార్థకక్రియ హేత్వర్థంలో వాడబడింది. అంటే తెగటంచేత అని అర్థం.

వ. నాఁటంగోలె రాహువునకుఁ జంద్రాదిత్యులతోడి విరోధంబు శాశ్వతం బై ప్రవర్తిల్లుచుండె. 19

ప్రతిపదార్థం: నాఁటంగోలెన్= నాటినుండి; రాహువునకున్; చంద్ర+ఆదిత్యుల తోడి, విరోధంబు= చంద్రసూర్యులతోడివైరం (సమాసంలో తోడకు ఇత్వం వచ్చింది); శాశ్వతంబు+ఐ= నిత్యమయి; ప్రవర్తిల్లుచుండెన్= సాగుతూ ఉన్నది.

తాత్పర్యం: నాటినుండి రాహువుకు చంద్రసూర్యులతోడివిరోధం శాశ్వతంగా సాగుతూ ఉన్నది.

దేవదానవుల యుద్ధము (సం.1-11-10)

సీ. అంత దేవాహితు లమృతంబు గానక।
యెంతయు నలిగి బలీంద్రుఁ గూడి
మంతనం బుండి 'యమర్త్యులతోడి పొ।
త్తింతియ చాలు, నింకేల?'యనుచు

సంతనకట్టి, యుత్సాహసమేతులై।
యంతంబులేని రథాశ్వములను
దంతుల నమితపదాతుల నొడఁగూర్చి!।
యంతకాకారు లై యార్చి, యమర

ఆ. వరులఁ దాఁకి యేసి రురుతరశరపక్ష।
జాతవాతరయవిధూత మగుచుఁ
జెదర జలదపంక్తి, బెదర వజ్రాయుధు।
హృదయ, ముదిలకొనఁగఁ ద్రిదశగణము. 20

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; దేవ+అహితులు= దేవతలకు శత్రువు లయిన రాక్షసులు; అమృతంబు; కానక= పొందక; ఎంతయున్, అలిగి= మిక్కిలి కోపించి; బలి+ఇంద్రున్= తమకు రాజయిన బలిని; కూడి= కలిసికొని; మంతనంబు+ఉండి= మంత్రాలోచనం చేసి; అమర్త్యులతోడి, పొత్తు= దేవతలతో స్నేహం; ఇంతియ= ఇంతే; చాలున్; ఇంకన్+ఏల, అనుచు= ఇంకెందుకంటూ, సంతనకట్టి= గుమికూడి; ఉత్సాహసమేతులు+ఐ= ఉత్సాహంతో కూడినవా రై; అంతంబు, లేని= అపార మయిన, అధికములయిన; రథ+అశ్వములను= రథాలనూ, గుఱ్ఱాలనూ; దంతులన్= ఏనుగులనూ; అమితపదాతులన్= అధికసంఖ్య కల కాల్బలాన్ని; ఒడఁగూర్చి= సమకూర్చి; అంతక+ఆకారులు+ఐ= యమునియొక్క రూపంవంటి రూపం కలవారై; ఆర్చి= బొబ్బలిడి; ఉరుతర, శర, పక్ష, జాత, వాత, రయ, విధూతము+అగుచున్= మిక్కిలి అధికమయిన బాణాలకు కట్టిన ఎరకలవలన పుట్టిన గాలిచేత ఎగురగొట్టబడినది ఔతూ; జలద, పంక్తి= మేఘాలవరుస; చెదరన్= చెదరిపోగా; వజ్ర+ఆయుధు, హృదయము= వజ్రం ఆయుధంగా కల ఇంద్రుడిహృదయం; బెదరన్= భయపడగా; త్రిదశగణము= దేవతలసముదాయం; ఉదిలకొనఁగన్= పరితపించగా; అమరవరులన్= దేవతాశ్రేష్ఠులను; తాఁకి= ఎదిరించి; ఏసిరి= బాణాలు ప్రయోగించారు.

తాత్పర్యం: అప్పుడు రాక్షసులు అమృతాన్ని పొందక మిక్కిలి కోపించి, తమరాజయిన బలిచక్రవర్తిని కలిసికొని ఆలోచనచేసి, 'దేవతలతోడిపొందు ఇంతే చాలు, ఇం కెందుకు' అంటూ గుమికూడి ఉత్సాహంతో కూడినవారై అమితము లయిన రథాలను, గుఱ్ఱాలను, ఏనుగులను, అధికసంఖ్య గల కాల్బలాన్ని సమకూర్చుకొని యముడివలె భయంకర మయిన ఆకారాలుకలవా రై కేకలువేస్తూ మిక్కిలి సంఖ్యలో వేసినబాణాలకు కట్టిన ఈకలవలన పుట్టిన గాలియొక్కవేగంచేత ఎగురగొట్టబడిందై మేఘపంక్తి చెల్లాచెదరు కాగా, ఇంద్రుడిహృదయం భయపడేటట్లు దేవతాసముదాయం పరితపించేటట్లు, దేవతాశ్రేష్ఠులను ఎదిరించి బాణాదు లయిన ఆయుధాలను ప్రయోగించారు.

విశేషం: ఇంత+ఎ= ఇంతె; ఇంతియ రూపాంతరం.

మహాస్రగ్ధర.

అమరేంద్రారాతు లిట్లాహవముఖమున నేయంగఁ దత్తీక్ష్ణబాణౌ
ఘము ఘోరం బై సురానీకముపయిఁ బెలుచం గప్పినం జూచి, దైత్యో
త్తములం గోదండచక్రోద్యతభుజులు మహాదారుణుల్ వీరలక్ష్మీ
రమణుల్ దుర్వారవాత్యారయమున నరనారాయణుల్ దాఁకి రల్కన్. 21

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర+అరాతులు= దేవేంద్రునికి శత్రువు లయిన రాక్షసులు; ఇట్లు= ఈవిధంగా ఆహవముఖమునన్= యుద్ధరంగం ముందరి భాగాన; ఏయంగన్= బాణాదులను ప్రయోగించగా; తత్, తీక్ష్ణ, బాణ+ఓఘము= వారి వాడి అయిన బాణాలయొక్క సముదాయం; ఘోరంబు+ఐ= భయంకర మై; సుర+అనీకముపయిన్= దేవతలసైన్యంమీద; పెలుచన్, కప్పినన్ మిక్కిలి కప్పివేయగా; చూచి; దైత్య+ఉత్తములన్= రాక్షసశ్రేష్ఠులను; కోదండ, చక్ర+ ఉద్యత, భుజులు= క్రమంగా గాండీవ ధనుస్సుతోను, చక్రంతోను ఎత్తబడిన భుజాలు గలవారున్నూ; మహత్, దారుణుల్= మిక్కిలిభయంకరులున్నూ; వీర, లక్ష్మీరమణుల్= శౌర్యలక్ష్మికి

ప్రియులున్న్రా; ఐన; నర, నారాయణుల్= నరుడు, నారాయణుడు; దుర్వార, వాత్యారయమునన్= వారించశక్యంకాని పెనుగాలియొక్క వేగంవంటి వేగంతో; అల్కన్= కోపంతో; తాఁకిరి= ముట్టడించారు.

తాత్పర్యం: రాక్షసు లీవిధంగా యుద్ధరంగంలో బాణాలు ప్రయోగించగా వారి బాణాలసమూహం భయంకరమై దేవతలసేనమీద దట్టంగా కప్పుకోగా చూచి, గాండీవ ధనుస్సుతో, చక్రంతో కూడినవారూ, మిక్కిలి భయంకరులూ, శౌర్యలక్ష్మికి ప్రియులూ అయిన నరుడును నారాయణుడును అనేవారు వారింప శక్యంకాని పెనుగాలియొక్క వేగంవంటివేగంతో రాక్షసశ్రేష్ఠులను ముట్టడించారు.

విశేషం: బాణ+ఓఘము= బాణౌఘము, వృద్ధిసంధి, మహాస్రగ్ధరలో ప్రతిపాదానికి స, త, త, న, స, ర, ర, గ అనే గణాలుంటాయి. 1-9-16 అక్షరాలు యతిస్థానాలు. కాంతి(బంధౌజ్జ్వల్యం) అనే శబ్దగణం ఇందులో పోషింపబడింది.

మ. నరచాపప్రవిముక్తదారుణబృహన్నారాచధారల్ భయం
కరదైతేయనికాయకాయములపైఁ గప్పెన్ దిశల్ నిండ బం
ధురధాత్రీధరతుంగశృంగతటసందోహంబుపైఁ గప్పు దు
ర్ధర ధారాధర ముక్తసంతతపయోధారావళిం బోలుచున్. 22

ప్రతిపదార్థం: నర, చాప, ప్రవిముక్త, దారుణ, బృహత్, నారాచ, ధారల్= నరునిధనుస్సు నుండి విడువబడిన భయంకరమైన పెద్దబాణాల పరంపరలు; దిశల్, నిండన్= దిక్కులు నిండగా; బంధుర ధాత్రీధర, తుంగ, శృంగ, తట, సందోహంబుపైన్= అందమయిన పర్వతాలయొక్క ఎత్తైనశిఖరాల అంచుల సముదాయంపై; కప్పు= ఆవరించే; దుర్ధర, ధారాధర, ముక్త, సంతత, పయః+ధారా+ఆవళిన్, పోలుచున్= ధరింపశక్యం కాని మేఘాలనుండి విడువబడిన దట్టమయిన నీటిధారల సముదాయాన్ని పోలుతూ; భయంకర, దైతేయ, నికాయ, కాయములపైన్= భయాన్ని కల్గించే రాక్షససముదాయాల శరీరాలపై; కప్పెన్= ఆవరించాయి.

తాత్పర్యం: నరునిధనుస్సునుండి విడువబడిన భయంకరము లైన పెద్దబాణాలపరంపరలు దిక్కులు నిండగా అందమయిన పర్వతాలయొక్క ఎత్తయిన శిఖరాలఅంచుల సమూహంపై కప్పే భరింపశక్యంకాని మేఘాలనుండి విడువబడిన దట్ట మయిన నీటిధారలసముదాయాన్ని పోలుతూ, భయంకరులైన రాక్షసుల శరీరాల సముదాయాలపై కప్పాయి.

విశేషం: అలం: ఉపమ. ప్రసాద మిశ్రిత మైన ఓజస్సు (గాఢబంధత్వం) అనే శబ్దగుణం ఇక్కడ సార్థకంగా ప్రయోగించాడు నన్నయ.

మ. పతదుర్వీధరధాతునిర్ఝరజలాభం బై మహాదేహని
ర్గత సాంద్రారుణపూర మొక్కమొగి నొల్కం ద్రెస్సి, నారాయణో
న్నతదోర్దండవిముక్తచక్రనిహతిన్ నాకద్విషన్మస్తక
ప్రతతుల్ ఘోరరణంబునం బడియె భూభాగంబు కంపింపఁగన్. 23

ప్రతిపదార్థం: పతత్, ఉర్వీధర, ధాతు, నిర్ఝర, జల+ఆభంబు+ఐ= క్రిందకు పడుతున్న పర్వతంయొక్క గైరికాది ధాతువులతో కూడిన సెలయేళ్ళలోని నీటియొక్క కాంతివంటి కాంతి కలదై; (ఆభ= సమానం, కాంతి అనే అర్థాలున్నాయి.) నీటితో సమానమైన కాంతి కలదై; మహత్, దేహ, నిర్గత, సాంద్ర+అరుణ, పూరము= పెద్దశరీరాలనుండి బయల్వెడలిన దట్ట మయిన రక్తప్రవాహం; ఒక్క, మొగిన్= ఒకేవిధంగా (ఎడతెగకుండ); ఒల్కన్= కారగా; నారాయణ+ఉన్నత, దోర్దండ, విముక్త, చక్ర, నిహతిన్= నారాయణుడి యొక్క పొడవైన దండాలవంటి భుజాలనుండి విడువబడిన చక్రంయొక్క దెబ్బచేత; త్రెస్సి= తెగి; నాక, ద్విషత్, మస్తక, ప్రతతుల్= స్వర్గానికి శత్రువు లయిన రాక్షసుల తలల సమూహాలు; భూభాగంబు= భూతలం; కంపింపఁగన్= చలించగా; ఘోరరణంబునన్= భయంకరమయిన యుద్ధంలో, పడియెన్= పడ్డాయి.

తాత్పర్యం: పైనుండి క్రిందకు పడుతున్న గైరికాదిధాతువులతోకూడిన నదులనీటియొక్క కాంతివంటి కాంతికలదై, పెద్ద పెద్దదేహాలనుండి

బయల్వెడలిన రక్తప్రవాహం ఎడతెగకుండ కారుతుండగా, నారాయణుడియొక్క పొడవైన; దండాలవంటి భుజాలనుండి విడువబడిన చక్రంయొక్క దెబ్బచేత తెగి, రాక్షసుల తలల సముదాయాలు భూతలం చలించేటట్లుగా భయంకర మయిన యుద్ధరంగంలో పడ్డాయి.

విశేషం: ద్విషత్+మస్తక= ద్విషన్మస్తక - అనునాసికసంధి, ఆభ= కాంతి, సమానం అనే అర్థాలు రెండూ పై సందర్భానికి ఉచితంగా ఉంటాయి. సమానం అనే అర్థాన్ని గ్రహిస్తే ఉపమాలంకారం అవుతుంది. ఓజస్సు అనే శబ్దగుణం రచనలో ఇక్కడ సార్థకం.

వ. ఇట్లు సముద్రతీరంబున నమరాసురులకు నతిఘోరయుద్ధం బయ్యె; నందు నరనారాయణు లపారపరాక్రము లై యసురవీరులఁ బెక్కండ్రం జంపిన నుక్కడంగి, దెసచెడి, యసురులు సముద్రంబు సొచ్చిన, నమరులు సమరలబ్ధవిజయు లై యమరపతి నమృతరక్షణార్థంబు ప్రార్థించి, యథాస్థానంబున మంథరనగంబు ప్రతిష్ఠాపించి, తమతమనివాసం బులకుం జని సుఖంబుండి రంత. 24

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; సముద్రతీరంబునన్= సముద్రపుటొడ్డున; అమర+ అసురులకున్= దేవతలకును, రాక్షసులకును; అతిఘోరయుద్ధంబు= మిక్కిలి భయంకర మయినయుద్ధం; అయ్యెన్; అందున్= ఆ యుద్ధంలో; అపార, పరాక్రములు+ఐ= మేర లేని విక్రమంగలవా రై; అసుర, వీరులన్, పెక్కండ్రన్= పలువురు వీరు లయిన రాక్షసులను; చంపినన్= చంపగా; ఉక్కు+అడంగి= గర్వం తగ్గి; దెసచెడి= దిక్కులేక; అసురులు= రాక్షసులు; సముద్రంబు; చొచ్చినన్= ప్రవేశించగా; అమరులు= దేవతలు; సమరలబ్ధవిజయులు+ఐ= యుద్ధంలో పొందబడిన విజయం కలవా రై; అమరపతిన్= దేవతలకు రాజయిన ఇంద్రుని; అమృత, రక్షణ+అర్థంబు= అమృతాన్ని రక్షించటం కొరకు; ప్రార్థించి= వేడి; మంథరనగంబున్= మంథరపర్వతాన్ని; యథాస్థానంబునన్= పూర్వ మున్న చోట; ప్రతిష్ఠాపించి= నిలిపి; తమ, తమ, నివాసంబులకున్= తమ తమ గృహాలకు; చని= వెళ్ళి; సుఖంబు+ఉండిరి= సుఖంతో ఉన్నారు.

తాత్పర్యం: ఈ విధంగా సముద్రపుటొడ్డున దేవతలకూ, రాక్షసులకూ మిక్కిలిభయంకర మైన యుద్ధం జరిగింది. ఆయుద్ధంలో నరుడును, నారాయణుడును అధిక మైన పరాక్రమం కలవారై వీరులయిన రాక్షసులను పలువురిని చంపగా, గర్వం తగ్గి దిక్కు లేక రాక్షసులు సముద్రంలో ప్రవేశించారు. దేవతలు యుద్ధంలో విజయాన్ని సాధించిన వారై, తమకు రాజైన ఇంద్రుడిని అమృతం రక్షించటంకొరకు ప్రార్థించి, మంథరపర్వతాన్ని పూర్వ ముండేచోట మళ్ళీ నిలిపి, తమ తమ గృహాలకు వెళ్ళి సుఖంతో ఉన్నారు.

విశేషం: సుఖంబు+ఉండిరి; ఇచ్చట ప్రథమావిభక్తి (సుఖంబు) తృతీయార్థంలో వాడబడింది.

కద్రూవినత లుచ్చైశ్శ్రవమును జూచి పందెములు సఱచుట (సం. 1-18-1)

క. అమృతముతో నుద్భవ మై।
యమరేశ్వరయోగ్య మైన హయరత్నము త
ద్విమలోదధితీరంబునఁ।
గొమరుగ నేకతమ యిచ్చఁ గ్రుమ్మరుచున్నన్. 25

ప్రతిపదార్థం: అమృతముతోన్; ఉద్భవము+ఐ= పుట్టి; అమర+ఈశ్వర, యోగ్యము+ అయిన= దేవతలరా జయిన ఇంద్రుడికి తగిన; హయ, రత్నము= అశ్వశ్రేష్ఠం; తద్+విమల+ఉదధి, తీరంబునన్= ఆ నిర్మల మయిన పాలసముద్రపుటొడ్డున; కొమరుగన్= అందంగా; ఏకతము+అ= ఒంటరిగా; ఇచ్చన్= స్వేచ్ఛగా; క్రుమ్మరుచున్+ ఉన్నన్= తిరుగుతుండగా.

తాత్పర్యం: అమృతంతోపాటు పుట్టి దేవేంద్రునిచే గ్రహింపబడిన ఉచ్చైశ్శ్రవ మనే అశ్వశ్రేష్ఠం, ఆ పాలసముద్రం ఒడ్డున అందంగా, ఒంటరిగా, స్వేచ్ఛగా తిరుగుతుండగా.

వ. కద్రువయు, వినతయు వినోదార్థంబు విహరించువారు కరిమకరనికరా ఘూత జాత వాతోద్ధూత తుంగతరంగాగ్రసముచ్చలజ్జల కణాసారచ్ఛటాచ్ఛాదిత గగనతలం బైనదాని, నుద్యానవనంబునుంబోలె బహువిద్రుమలతాలంకృతం బైనదాని, నాటకప్రయోగంబునుంబోలె ఘనరసపాత్రశోభితరంగరమ్యం బైనదాని, దివంబునుం బోలె నహిమకరభరితం బైనదాని మఱియు. 26

ప్రతిపదార్థం: కద్రువయున్; వినతయున్; వినోద+అర్థంబు= వినోదంకొరకు; విహరించువారు= సంచరించేవారు; కరి, మకర, నికర+ఆఘాత, జాత, వాత+ఉద్ధూత, తుంగ, తరంగ+అగ్ర, సముచ్చలత్, జల, కణ+ఆసార+ ఛటా+ఆచ్ఛాదిత, గగన, తలంబు+ఐనదానిన్= ఏనుగులయొక్క, మొసళ్ళయొక్క సముదాయంయొక్క దెబ్బలచేత పుట్టిన, గాలిచేత ఎగురగొట్టబడిన ఎత్తయిన కెరటాలపైభాగంలో కదలాడే నీటిబిందువుల జడివాన సముదాయంచేత కప్పబడిన ఆకాశభాగం కలదానిని; ఉద్యానవనంబునున్, పోలెన్= విహారవనంవలె; బహు, వి, ద్రుమ, లతా+అలంకృతంబు+ అయిన, దానిన్= పెక్కుపక్షులతోకూడిన, చెట్లతోకూడిన, లతలచేత అలంకరింపబడిన దానిని; సముద్రపక్షంలో - బహు, విద్రుమ, లతా+అలంకృతంబు+ ఐనదానిన్= పెక్కుపగడపుతీగలచేత అలంకరింపబడిన దానిని; నాటక ప్రయోగంబునున్+పోలెన్= నాటకంయొక్క ప్రదర్శనంవలె; ఘన, రస, పాత్ర, శోభిత, రంగరమ్యంబు+ఐనదానిన్= గొప్పశృంగారాదిరసాలతోను, పాత్రలతోను ప్రకాశించేరంగంచే అందమయినదానిని; సముద్రపక్షంలో - ఘన, రస, పాత్ర, శోభి, తరంగ, రమ్యంబు+ఐనదానిన్= గొప్ప (అధికమైన) నీటికి నెలవై ప్రకాశించే కెరటాలచేత సుందర మైనదానిని, ఇక్కడ 'ఘన' అంటే మేఘా లనియు అర్థం చెప్పవచ్చును (మేఘాలలోని నీటికి నెలవులై); దివంబునున్, పోలెన్= ఆకాశంవలె, అహిమ, కర, భరితంబు+ఐనదానిన్= వేడికిరణాలు గల సూర్యుడితో కూడినదానిని; సముద్రపక్షంలో- అహి, మకర,

భరితంబు+ఐనదానిన్= పాములతోను, మొసళ్ళతోను కూడిన దానిని; మఱియున్= ఇంకా.

తాత్పర్యం: అటువంటి సమయంలో కద్రూవినతలు వేడుకకొరకు విహరిస్తూ, నీటిఏనుగుల, మొసళ్ళ సముదాయాల దెబ్బలవలన పుట్టిన గాలిచేత ఎగురగొట్టబడిన ఎత్తయిన కెరటాల పై భాగాన కదలాడే నీటిబిందువుల జడివాన మొత్తంచేత కప్పబడిన ఆకాశభాగం గలదానిని, విహారవనం వలె (పెక్కు పక్షులతోకూడిన చెట్లచేత, తీగలచేత అలంకరింపబడిన దానిని) పెక్కు పగడపు తీగలచే అలంకరింపబడినదానిని, (నాటక ప్రదర్శనంవలె గొప్పశృంగారాది రసాలతోను, పాత్రలతోను ప్రకాశించేరంగస్థలం వలె సుందర మైనదానిని) విస్తృత మైన నీటికి నెల వై ప్రకాశించే కెరటాలచేత సుందర మైనదానిని, (ఆకాశంవలె సూర్యుడితో కూడిన దానిని) పాములతోను, మొసళ్ళతోను నిండినదానిని, అదికాక.

విశేషం: అలంకారాలు; శ్లేష, వృత్త్యనుప్రాసం, అంత్యానుప్రాసం. నన్నయశ్లేషతో రచించినకొద్దిభాగాల్లో ఇది ఒకటి. ఉద్యానవనంబునున్‌పోలెన్, నాటకప్రయోగం బునున్ పోలెన్ - అనేచోట్ల ద్రుతంపై మరొకద్రుతం వాడబడింది.

చ. అలఘుఫణీంద్రలోకకుహరాంతరదీప్తమణిస్ఫురత్ప్రభా
వలి గలదాని, శశ్వదుదవాసమహావ్రతశీతపీడితా
చలమునిసౌఖ్యహేతువిలసద్బడబాగ్ని శిఖాచయంబులన్
వెలిఁగెడిదానిఁ గాంచి రరవిందనిభానన లమ్మహోదధిన్. 27

ప్రతిపదార్థం: అరవిందనిభ+ఆననలు= పద్మంతో సమాన మైన ముఖాలు కల కద్రూవినతలు; అలఘు, ఫణి+ఇంద్ర, లోక, కుహర+అంతర, దీప్త, మణి, స్ఫురత్, ప్రభా+ఆవళి, కలదానిన్= గొప్పనాగరాజులలోక మయిన పాతాళం యొక్క గుహలోపల ప్రకాశించే రత్నాలయొక్క వెలుగుతున్నకాంతులసముదాయం కలదానిని; శశ్వత్+ ఉదవాస, మహత్, వ్రత, శీత, పీడిత+ అచల, ముని, సౌఖ్య, హేతు, విలసత్, బడబా+ అగ్ని,

శిఖా, చయంబులన్= ఎల్లప్పుడు నీటిలో నివసించటమనే గొప్పవ్రతంచేత చలివలన బాధింపబడే కదలని (పర్వతాలనే) మునుల సుఖానికి కారణమయి ప్రకాశిస్తున్న ఔర్వాగ్నియొక్క జ్వాలల సముదాయాలచే; వెలిఁగెడుదానిన్= ప్రకాశించేదాన్ని; ఆ+మహత్+ఉదధిన్= ఆ గొప్పసముద్రాన్ని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: పద్మాలవంటి ముఖాలు కల కద్రూవినతలు గొప్పనాగరాజులలోకమయిన పాతాళగుహలో ప్రకాశించే మణులయొక్క వెలుగుతున్న కాంతులసముదాయం కలదానిని, ఎల్లప్పుడూ నీటిలో నివసించట మనే గొప్పవ్రతంచేత చలిచే బాధింపబడినప్పటికి కదలకుండాఉండే పర్వతాలనే మునులసౌఖ్యానికి కారణ మయి ఒప్పే బడబానలంయొక్క జ్వాలలసముదాయంచేత ప్రకాశించే ఆపెద్దసముద్రాన్ని చూచారు.

విశేషం: అలం: రూపకం. ఈపద్యరచనలో సమతా(మార్గభేద) విశిష్టమైన ఓజస్సు (గాఢబంధత్వం) అనే శబ్దగుణాన్ని, అక్షరరమ్యతను నన్నయ పోషించాడు. మొదటి, మూడవ చరణాలను దీర్ఘసమాసాలతో రచించి రెండవ, నాల్గవ చరణాలను, 'ఆవలిగలదాని, వెలిఁగెడిదాని' అనే పదాలతో సమంగా విరవటం వలన వృత్తరచనలో సమత్వం ఏర్పడింది. మిగిలిన వృత్తరచనలో ఓజస్సు రాణించింది. అలలవిన్యాసంలో సమత్వం, గాంభీర్యంలో ఓజస్విత కల సముద్రవర్ణనంలో ఈగుణసంయోజనం విభావస్ఫూర్తిని వెలారుస్తున్నది. (సంపా.)

మ. వివిధోత్తుంగ తరంగ ఘట్టన చలద్వేలావనైలావలీ
లవలీలుంగలవంగ సంగతలతాలాస్యంబు లీక్షించుచున్
ధవళాక్షుల్ సని కాంచి రంత నెదురం దత్తీరదేశంబునం
దవదాతాంబుజ ఫేనపుంజనిభు నయ్యశ్వోత్తముం దవ్వులన్. 28

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; ధవళ+అక్షుల్= తెల్లనికన్నులు కల కద్రూవినతలు; చని= వెళ్ళి; ఎదురన్= తమఎదుట; దవ్వులన్= దూరంలో;

వివిధ+ఉత్తుంగ, తరంగ, ఘట్టన, చలత్+వేలా, వన+ఏలా+ఆవలీ, లవలీ, లుంగ, లవంగ, సంగత, లతా, లాస్యంబులు= పలువిధా లయిన ఎత్తయిన కెరటాల దెబ్బలచే కదలుతున్న (వేలావన) సముద్రపుటొడ్డుమీది వనాలలోని ఏలకిలతల సమూహాలు, లవలి అనే పేరుగల లతలు, మాదీలతలు, లవంగలతలు అనే అందాలయిన (ఒండొంటితో కలసిన) లతలయొక్క చలన రూపాలయిన నాట్యాలు; ఈక్షించుచున్= చూస్తూ; తత్, తీర, దేశంబునందున్= ఆ సముద్రంయొక్క తీరప్రదేశంలో; అవదాత+అంబుజ, ఫేన, పుంజ, నిభున్= తెల్లనిపద్మాలతోనూ, నురుగు సముదాయంతోనూ, సమానమైన; ఆ+అశ్వ+ ఉత్తమున్= ఆ శ్రేష్ఠ మైన గుఱ్ఱాన్ని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: పిమ్మట తెల్లనికన్నులు గల ఆ కద్రూవినతలు తమఎదుట పలువిధా లైన ఎత్తైనకెరటాలదెబ్బలచేత కదలుతున్న సముద్రపుటొడ్డుమీది వనాలలోని ఏలకిలతలు, లవలీలతలు, మాదీలతలు, లవంగలతలు ఒండొంటితో కలిసి అందా లొలకపోసే లతల నాట్యాలు చూస్తూ తెల్లనిపద్మాలతోనూ, నురుగుసమూహంతోను సమానమైన ఆ ఉచ్చైశ్శ్రవమనబడే హయశ్రేష్ఠాన్ని చూచారు.

విశేషం: అలం: ఉపమ. వీనులకు విందైన సముద్రతరంగాల లయలూ, కన్నులకు పండువైన లతాలలనల నాట్యాలహొయలూ భూమికగా ఉండగా వాటిప్రక్కనే మనసును మరపించే తెల్లని ఉచ్చైశ్రవాన్ని దర్శింపచేస్తున్నాడు నన్నయ. ఇటువంటి చక్కని స్థిరచిత్రాలను వర్ణించటంలో నన్నయ దిట్ట. తరంగఘట్టనను, లతాలాస్యాలను, అశ్వసౌందార్యాన్నీ, విభావోచితమైన అక్షరరమ్యంగా వర్ణించాడు. ఓజోగుణ(గాఢబంధత్వ)విశిష్టమైన కాంతి(బంధౌజ్జ్వల్యం) అనే శబ్దగుణం కల రచనచేత సన్నివేశాన్ని ధ్వనిమయం చేశాడు నన్నయ. ఇందులోని అక్షరరమ్యత గుణపోషకం. (సంపా.)

వ. కని, కద్రువ వినతం జూచి 'చూడవె యల్ల యతిధవళంబైన యశ్వంబు నందు సంపూర్ణచంద్రునందు నల్లయుంబోలె వాలప్రదేశంబునందు నల్ల యై యున్నది' యనిన విని వినతనగి 'నీ వే కన్నులం జూచితే యక్క! యెక్కడిది నల్ల? యీయశ్వరాజుమూర్తి మహాపురుషకీర్తియుంబోలె నతినిర్మలం బై యొప్పుచున్నయది' యనిన విని నవ్వి వినతకుఁ గద్రువ యి ట్లనియె. 29

ప్రతిపదార్థం: కని= ఆగుర్రాన్ని చూచి; చూడవె= చూడుమా; అల్ల= ప్రసిద్ధ మైన; అతి, ధవళంబు+ఐన= మిక్కిలితెల్లని దైన; అశ్వంబునందున్= గుర్రంలో; సంపూర్ణ, చంద్రు+అందున్= నిండు చంద్రుడిలోని; నల్లయున్, పోలెన్= మచ్చవలె; వాలప్రదేశంబునందున్= తోకభాగంలో; నల్ల+ఐ= మచ్చ అయి; ఉన్నది; అనినన్= అని పలుకగా; విని; వినత; నగి= నవ్వి; నీవు, ఏ, కన్నులన్, చూచితి(వి), ఏ= నీవు ఏకన్నులతో చూచావో (సరిగా చూడలేదని భావం); అక్క= కద్రువకు సంబోధన; నల్ల= మచ్చ; ఎక్కడిది= ఎక్కడ ఉన్నది; ఈ, అశ్వరాజు, మూర్తి= ఈశ్రేష్ఠమైన గుర్రంరూపం; మహత్, పురుష కీర్తియున్, పోలెన్= మహాత్ముని కీర్తివలె; అతి, నిర్మలంబు+ఐ= మిక్కిలి తెల్లని దై; ఒప్పుచున్న, అది= ప్రకాశిస్తున్నది; అనినన్= అని వినత పల్కగా. విని= ఆలకించి; నవ్వి= హసించి; వినతకున్= వినతకు, కద్రువ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఆ గుర్రాన్ని చూచి కద్రువ వినతతో 'చూడుము! మిక్కిలి తెల్లని దైన ఆ గుర్రంలో, నిండు చంద్రుడిలోని మచ్చవలె తోకభాగం నల్లగా ఉన్నది' అని అనగా విని వినత నవ్వి 'ను వ్వే కన్నులతో చూచావే అక్కా! మచ్చ ఎక్కడిది? ఈ శ్రేష్ఠమైన గుఱ్ఱం మహాత్ముని కీర్తివలె మిక్కిలి తెల్లనిదై ప్రకాశిస్తున్నది' అని అనగా విని వినతతో కద్రువ ఇట్లా అన్నది.

విశేషం: అలం: ఉపమ.

తే. 'అమ్మహాశ్వంబుధవళదేహంబునందు।
నల్ల గలిగిన నీ విప్డు నాకు దాసి
వగుము; మఱి యందు నల్లలే దయ్యె నేని।
నీకు నే దాసి నగుదుఁ; బన్నిదము సఱుము.' 30

ప్రతిపదార్థం: ఆ+మహత్+అశ్వంబు, ధవళ, దేహంబు+అందున్= ఆగొప్ప గుర్రం యొక్క తెల్లని శరీరంలో; నల్ల= మచ్చ; కలిగినన్= ఉంటే; నీవు, ఇప్డు, నాకున్; దాసివి; అగుము; మఱి= అట్లుకాక; అందున్= శరీరంలో; నల్ల= మచ్చ; లేదు+అయ్యెన్+ఏని; నీకున్; నే= నేను; దాసిన్, అగుదున్; పన్నిదము= పందెం; చఱుము= (చరచుము) అరచేతిలో చేయివేసి పందెం వేయుము (చఱుము అనేది చరచుదమునకు రూపాంతరం).

తాత్పర్యం: ఆ గొప్ప గుర్రంయొక్క తెల్లనిదేహంలో నల్లనిమచ్చ ఉంటే నీ విప్పుడు నాకు దాసివి కమ్ము. అట్లా కాక ఆ శరీరంలో మచ్చలేకుంటే నేను నీకు దాసివి అవుతాను. పందెం వేయుము'.

వ. అని యి ట్లిద్దఱు నొండొరులకు దాసీత్వంబు పణంబుగా నొడివి పన్నిదంబు సఱచిన, వినత 'యయ్యశ్వంబు డాసి చూతము ర' మ్మనినఁ గద్రువయు 'నిపుడు ప్రొద్దు లేదు, పతిపరిచర్యాకాలంబు నయ్యెఁ; దేపకడయ చూత' మని యిద్దఱు మగుడివచ్చి తమ నివాసంబులకుం బోయి యున్న యప్పుడు. 31

ప్రతిపదార్థం: అని, ఇట్లు+ఇద్దఱున్= వినతాకద్రువలిరువురును; ఒండు+ఒరులకున్= ఒకరికొకరు; దాసీత్వంబు= దాసితనం; పణంబుగాన్= పందెంగా; నొడివి= పలికి; పన్నిదంబు= పందెం; చఱచినన్= చేతితో కొట్టి వెయ్యగా; వినత; ఆ+అశ్వంబు= ఆగుఱ్ఱాన్ని; డాసి= సమీపించి; చూతము=

చూద్దాము; రమ్ము, అనినన్; కద్రువయున్; ఇపుడు; ప్రొద్దు, లేదు= సమయం లేదు; పతి, పరిచర్యాకాలంబున్= భర్తకు సేవచేసేకాలంకూడ, అయ్యెన్; వేకడ+అ= ఉదయమే; చూతము; అని; ఇద్దఱు; మగుడి వచ్చి= తిరిగి వచ్చి; తమ, నివాసంబులకున్= తమ గృహాలకు; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: అని ఈవిధంగా వినతాకద్రువలిద్దరు ఒకరొకరికి దాస్యం చేయటం పందెంగా పలికి పందెం వేయగా, వినత ఆ గుఱ్ఱాన్ని చేరి చూద్దాము రమ్మని పలుకగా, కద్రువ 'ఇప్పుడు సమయం చాలదు. భర్తకు సేవ చేసే కాలం కూడ అయింది. రేపు ఉదయమే వచ్చి చూద్దాము' అని తెలిపింది. అప్పు డాసతు లిద్దరూ తిరిగివచ్చి తమ తమ గృహాలకు పోయి ఉన్న సమయాన (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: చూచుదము - చువర్ణంతోడి దుగ్దకారం తకార మవుతుంది - చూతము.

సీ. కద్రువ కొడుకులకడ కేఁగి 'యేను మి ।
మ్మందఱ వేఁడెద నన్నలార!
నాపంపు సేయుండు, నన్ను రక్షింపుఁడు ।
కామచారులకు దుష్కరము కలదె!
యుల్ల తెల్లని తురగోత్తము వాలంబు ।
నల్ల సేసితిరేని నాకు దాసి
యగు మన వినత, మీ రట్లు సేయనినాఁడు ।
దానికి మఱి యేను దాసి నగుదు;

ఆ. జంట పన్నిదంబు సఱచితి మిట్లుగా' ।
ననినఁ బాములెల్ల 'ననయ మిదియుఁ
దల్లి పనిచె నని యధర్మువు సేయంగ ।
నగునె? యెఱుక గలరె మగువ లెందు'! 32

ప్రతిపదార్థం: కద్రువ; కొడుకుల, కడకున్= కుమారులవద్దకు; ఏఁగి= వెళ్ళి; అన్నలార= వత్సలారా! మిమ్ము+అందఱున్, వేఁడెదన్; నా, పంపు, చేయుండు= నాఆజ్ఞ చేయండి; నన్ను; రక్షింపుఁడు= కాపాడండి; కామ, చారులకున్= ఇచ్చవచ్చినట్లు సంచరించేవారికి; దుష్కరము= చేయ శక్యం కానిది; కలదు+ఎ= ఉన్నదా! లేదు; ఉల్ల= దూరసమీపప్రదేశాలకు మధ్యప్రదేశంలో ఉన్న; తెల్లని, తురగ+ఉత్తము, వాలంబు= తెల్లని అశ్వశ్రేష్ఠం యొక్క తోకను; నల్ల+చేసితిరి+ఏని= మచ్చచేశారంటే; మన, వినత; నాకు; దాసి, అగున్; మీరు+అట్లు; చేయని, నాఁడు= చేయకుంటే; దానికిన్= వినతకు; మఱి ఇంక; ఏను= నేను; దాసిన్, అగుదున్; ఇట్లుగాన్= ఈవిధంగా; జంటపన్నిదంబు= ఇద్దరు సమానంగా వేసేపందెం; చఱచితిమి= వేశాము; అనినన్= అని చెప్పగా; పాములు+ఎల్లన్= పాములన్నీ; ఇదియున్= ఇది; అనయము= నీతి కానిది; తల్లి; పనిచెన్+అని= ఆజ్ఞాపించిన దని; అధర్మువు= అధర్మం; చేయంగన్, అగునె= చేయనవునా? ఎందున్= ఎక్కడైనా; మగువలు= స్త్రీలు; ఎఱుక, కలరె= తెలివిగలవారా? (కారని భావం).

తాత్పర్యం: కద్రువ కొడుకు లయిన పాములచెంతకు వెళ్ళి, 'వత్సలారా! నేను మిమ్మ ల్నందరినీ ప్రార్థిస్తున్నాను. నాఆజ్ఞ చేయండి. నన్ను కాపాడండి. ఇచ్చవచ్చినట్లు సంచరించగల మీకు చేయ శక్యంకానిది ఉన్నదా? ఆ తెల్లని అశ్వశ్రేష్ఠంతోకను మీరు మచ్చచేస్తే వినత నాకు దాసి అవుతుంది. మీరు అట్లా తోకను నలుపు చేయకపోతే నే నింక వినతకు దాసి నవుతాను. ఈ విధంగా ఒండొరులం పందెం వేసుకొన్నాం' అని పలుకగా పాములన్నీ 'ఇది నీతిరహితం. తల్లి ఆజ్ఞాపించిందని అధర్మం చేయవచ్చా? ఎక్కడైనా స్త్రీలు జ్ఞానం కలవారా!'

వ. అని యందఱుఁ దమలో విచారించి యధర్మారంభంబునకు సుముఖులు గాకయున్నఁ, గద్రువ కోపోద్దీపితముఖి యై. 33

ప్రతిపదార్థం: అని; అందఱున్= పాములన్ని; తమలోన్= తమలోతాము; విచారించి= ఆలోచించి; అధర్మ+ఆరంభంబునకున్= అధర్మం చేయ

మొదలిడటానికి; సుముఖులు= ఇష్టం కలవారు; కాక, ఉన్నన్= కాకుండగా; కద్రువ; కోప+ఉద్దీపిత, ముఖి యై= కోపంచేత ఎఱ్ఱబడిన ముఖం కలదై.

తాత్పర్యం: అని అందరూ తమలో తాము ఆలోచించి అధర్మం చేయటానికి ఇష్టపడనివారు కాగా, కద్రువ కోపంచేత ఎఱ్ఱబడిన ముఖం కలదై.

క. 'అనుపమముగ జనమేజయుఁ।
డను జనపతి సేయు సర్పయాగ నిమిత్తం
బునఁ బాములు పంచత్వము।
సనియెడు' మని యురగములకు శాపం బిచ్చెన్. 34

ప్రతిపదార్థం: అనుపమముగన్= సాటిలేకుండ; జనమేజయుఁడు= పరీక్షిత్తు కుమారుడు; అను జనపతి= అనేరాజు; చేయు సర్పయాగ, నిమిత్తంబునన్= సర్పాలను హుతం చేసే యజ్ఞ మనే కారణంగా; పాములు; పంచత్వము, చనియెడున్, అని= మరణం పొందుగాక అని; (ఎడు-తల ద్రుతానికి అచ్చు పరమైనపుడు మకారమవుతుంది); ఉరగములకున్= పాములకు; శాపంబు+ఇచ్చెన్= శాపమిచ్చినది.

తాత్పర్యం: 'పరీక్షిత్తుకుమారు డయిన జనమేజయు డనే రాజు చేసే సాటిలేని సర్పయాగం కారణంగా పాములు మరణం పొందుగాక' అని వాటికి శాప మిచ్చింది.

వ. అందు శాపానుభవభీతచిత్తుం డై కర్కోటకుం డనువాఁడు తల్లి పంచిన రూపంబున నుచ్చైశ్శ్రవంబువాలంబు నీలంబుగాఁ బట్టి వ్రేలుచున్న, మఱునాఁడు ఱేపకడయ కద్రువయు వినతయుం జని, యత్తురంగంబుఁ జూచి వినత యోటువడి, కద్రువకు దాసి యైె, నోసి పనులు సేయుచున్నంతఁ, బంచశత వర్షంబులు నిండి రెండవయండం బవిసిన నందు. 35

ప్రతిపదార్థం: అందున్= ఆపాములలో; శాప+అనుభవ, భీత, చిత్తుండు+ఐ= శాపాన్ని అనుభవించటానికి భయపడిన మనస్సు కలవా డై; కర్కోటకుండు+ అనువాడు; తల్లి; పనిచిన, రూపంబునన్= ఆజ్ఞాపించిన రూపంతో, ఉచ్చైశ్శ్రవంబు, వాలంబు= ఆ పేరుండే అశ్వశ్రేష్ఠంయొక్క తోక; నీలంబు+కాన్= నల్ల అయ్యేట్లుగా; పట్టి= పట్టుకొని; వ్రేలుచున్నన్= వ్రేలాడుతుండగా; మఱునాఁడు; ఱేపకడ+అ= ఉదయమందే; కద్రువయున్, వినతయున్; చని= వెళ్ళి; ఆ+తురంగంబున్= ఆ గుఱ్ఱాన్ని; చూచి; వినత; ఓటు, పడి= ఓడి; నోసి= నొచ్చి, పనులు, చేయుచున్, ఉన్న, అంతన్= పనులు చేస్తూఉండగా; పంచశత, వర్షంబులు= ఐదువందలేండ్లు; నిండి= పూర్తికాగా; రెండవ, అండంబు= రెండవగ్రుడ్డు; అవిసినన్= పగులగా; అందున్= ఆగ్రుడ్డునుండి.

తాత్పర్యం: ఆ పాములలో శాపం అనుభవించటానికి భయపడిన హృదయం గలవాడై కర్కోటకు డనే పాము తల్లి అయిన కద్రువ ఆజ్ఞాపించిన రూపంతో ఉచ్చైశ్శ్రవ మనే తెల్లనిదేవతలగుఱ్ఱంతోకకు నల్లనిమచ్చ అయ్యేట్లుగా పట్టుకొని వ్రేలాడుతూ ఉండగా మరుసటి రోజున ఉదయమే కద్రువయు వినతయు వెళ్ళి ఆ గుఱ్ఱాన్ని చూచారు. దానితోకను కర్కోటకుడు నల్లగా పట్టుకొని వ్రేలాడుతుండటంచేత వినత ఓడి కద్రువకు దాసియై నొచ్చి ఆమె చెప్పిన పనులు చేస్తుండగా ఐదువందల ఏండ్లు నిండాయి. అంత వినత పెట్టిన రెండవగ్రుడ్డు పగిలి ఆ గ్రుడ్డునుండి.

వినతకు గరుడుండు జనియించుట (సం. 1-20-4)

ఉ. ఆతతపక్షమారుత రయ ప్రవికంపిత ఘూర్ణితాచల
వ్రాత మహార్ణవుండు, బలవన్నిజదేహసముజ్జ్వల ప్రభా
ధూత పతంగతేజుఁ డుదితుం డయి తార్క్ష్యుఁడు తల్లికిన్ మనః
ప్రీతి యొనర్చుచున్ నెగసె భీమజవంబున నభ్రవీథికిన్. 36

ప్రతిపదార్థం: ఆతత, పక్షమారుత, రయ, ప్రవికంపిత, ఘూర్ణిత+అచల, వ్రాత, మహత్, అర్ణవుండు= విశాల మైన రెక్కలగాలియొక్క వేగంచేత క్రమంగా చలింపజేయబడినట్టియు, సంక్షోభింప జేయబడినట్టియు, పర్వతాల సముదాయాలను, గొప్పసముద్రాలను, కలవాడున్నూ; బలవత్+నిజ, దేహ, సముజ్జ్వల, ప్రభా, ధూత, పతంగ, తేజుఁడు= బలం కల తన దేహంయొక్క ప్రకాశించేకాంతిచేత తిరస్కరింపబడిన సూర్యునియొక్క కాంతి కలవాడున్నూ; అయిన; తార్క్ష్యుఁడు= గరుత్మంతుడు; ఉదితుండు+అయి= పుట్టి; తల్లికిన్= తల్లి అయిన వినతకు; మనఃప్రీతి= హృదయానికి ప్రియాన్ని; ఒనర్చుచున్= కావిస్తూ; అభ్రవీథికిన్= ఆకాశమార్గానికి; భీమజవంబునన్= భయంకర మయిన వేగంతో; నెగసెన్= ఎగిరాడు.

తాత్పర్యం: విశాల మయిన రెక్కలగాలుల వేగంచేత చలింపచేయబడిన పర్వతాల సమూహాన్ని, సంక్షోభింపచేయబడిన పెద్ద సముద్రాలను కలవాడున్నూ, బలం గల తనశరీరంయొక్క ప్రకాశించే కాంతిచేత తిరస్కరించబడిన సూర్యుడితేజస్సు కలవాడున్నూ అయిన గరుత్మంతుడు పుట్టి తల్లి అయిన వినతహృదయానికి ప్రియం చేస్తూ, అధికమయినవేగంతో ఆకాశమార్గానికి ఎగిరాడు.

క. దారుణకల్పాంతమరుత్।
ప్రేరిత హవ్యవహశిఖల పెల్లిది యని బృం
దారకమునిబృందస్తుతి ।
బోరనఁ దా నగ్నిసూక్తములతో నెసఁగెన్. 37

ప్రతిపదార్థం: దారుణ, కల్ప+అంత, మరుత్, ప్రేరిత, హవ్యవహ, శిఖల, పెల్లు+ఇది, అని= భయంకర మయిన ప్రళయకాలంలోని గాలిచే ప్రేరేపింపబడిన అగ్నియొక్క జ్వాలల సముదాయం ఇ దని; బృందారక, ముని, బృంద, స్తుతి= దేవతలయొక్కయు, మునుల సమూహంయొక్కయు స్తోత్రం; తాన్= తాను; బోరనన్=శీఘ్రంగా, అగ్ని, సూక్తములతోన్= అగ్నినిస్తుతించే వేదమంత్రాలతో ఎసఁగెన్= అతిశయించింది. (ఎగసెన్- పాఠాంతరం= బయల్వెడలింది).

తాత్పర్యం: భయంకరమయిన ప్రళయకాలంలోని గాలులచేత ప్రేరేపింపబడిన అగ్నియొక్క జ్వాలలసముదాయమిదని, దేవతలయొక్క, మునిసముదాయంయొక్క స్తోత్రం తాను శీఘ్రంగా అగ్నిని స్తుతించే వేదమంత్రాలతో అతిశయిల్లింది.

వ. అంత. 38

ప్రతిపదార్థం: అంతన్= పిదప

తాత్పర్యం: అటు పిమ్మట.

క. హరికులిశక్షతి యెఱుఁగని ।
గురుతరపక్షములతోడి కులగిరివోలెన్
గరుడండు గగనగతి నురు ।
తరజవమున నరుగుదెంచి తల్లికి మ్రొక్కెన్. 39

ప్రతిపదార్థం: హరి, కులిశ, క్షతి= ఇంద్రుని వజ్రాయుధంయొక్క దెబ్బ; ఎఱుఁగని= తెలియని; గురుతర, పక్షములతోడి కులగిరి, పోలెన్= మిక్కిలి పెద్దరెక్కలతో కూడిన కులపర్వతంవలె; గరుడండు; గగనగతిన్= ఆకాశగమనాన; ఉరుతర, జవమునన్= అధికమైన వేగంతో; అరుగుదెంచి= వచ్చి; తల్లికిన్= వినతకు; మ్రొక్కెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: పూర్వం ఇంద్రుడు వజ్రాయుధంచేత పర్వతాలరెక్కలు ఖండించాడు. అట్లా వజ్రాయుధంయొక్క దెబ్బ నెఱుగని పెద్దరెక్కలతో కూడిన కులపర్వతం వలె గరుడుడు ఆకాశగమనాన వచ్చి తల్లి అయిన వినతకు నమస్కరించాడు.

విశేషం: అలం: ఉపమ, మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం అనేవి ఏడుకులపర్వతాలు. ఈపద్యంలో కవిప్రౌఢోక్తిసిద్ధమైన అలంకారంవలన కలిగే వస్తుధ్వని ఉన్నది. వజ్రాహతికి రెక్కలు కోల్పోని కులపర్వతం ఉపమానంగా చెప్పటం కవి ప్రౌఢోక్తి. దీనివలన భావికథలో ఇంద్రుడి వజ్రాయుధంకూడా ఏమీచేయలేనంత వీరుడై, ఇంద్రుడికి స్నేహితుడై, విష్ణువుకు వాహనమై, అమృతం త్రాగకపోయినా అమరుడై వెలుగొందే అసమానవీరుడయ్యే కథార్థాలు ధ్వన్యమానము లౌతున్నాయి. గరుత్మంతుడి గమనవేగం కందంలోని లఘువుల బాహుళ్యం వ్యంజింపజేస్తున్నది. అక్షరరమ్యత కూడ ఇక్కడ కథార్థధ్వనికి తోడ్పడుతున్నది. (సంపా.)

వ. ఇట్లు నిజజననికి మ్రొక్కి కద్రువపాలికిం బోయి. 40

తాత్పర్యం: ఈవిధంగా తనతల్లి యైన వినతకు నమస్కరించి, సవతితల్లి అయిన కద్రువచెంతకు వెళ్ళి.

చ. తడయక మ్రొక్కియున్న వినతాసుతు నప్పుడు సూచి, యాత్మలో
నిడుగడఁ జేయుచుం గడు సహింపక కద్రువ వానిఁ బిల్చి 'నా
కొడుకుల నెల్ల నెత్తికొని క్రుమ్మరుచుండుమ, యేమి పంచినన్
మడవక చేయు మీ' వని సమర్పణ సేసెఁ బ్రభుత్వ మేర్పడన్. 41

ప్రతిపదార్థం: తడయక= ఆలస్యంచేయక; మ్రొక్కి= నమస్కరించి; ఉన్న=ఉన్నటువంటి; వినతా, సుతున్= వినతయొక్క కుమారుడైన గరుడని; అప్పుడు= ఆసందర్భంలో; చూచి; ఆత్మలోన్= మనస్సులో; ఇడుగడన్, చేయుచున్= అసూయచూపుతూ; కడున్, సహింపక= మిక్కిలి ఓర్వలేక; కద్రువ; వానిన్= గరుడుని; పిల్చి; నా, కొడుకులన్, ఎల్లన్= నాకుమారు లైన పాముల నన్నింటిని; ఎత్తికొని= మోసికొని; క్రుమ్మరుచున్, ఉండుము+అ= తిరుగుతూఉండుమా! ఏమి, పంచినన్= వారేమి ఆజ్ఞాపించినా; ఈవు= నీవు; మడవక= మరలక (అలక్ష్యం చేయక); చేయుము; అని= అని పలికి; ప్రభుత్వము+ఏర్పడన్= అధికారం స్పష్టమయ్యేటట్లు; సమర్పణ, చేసెన్= గరుడునికి పాములను అప్పగించింది.

తాత్పర్యం: ఆలస్యం చేయకుండ మ్రొక్కిన, వినతపుత్రుడయిన గరుత్మంతుడిని కద్రువ చూచి మనసులో అసూయపడి ఓర్వలేక అతనితో ఇట్లా అన్నది: 'నాకొడుకుల(పాముల)నందరిని ఎత్తుకొని తిరుగుతూ ఉండుము. ఏపని చెప్పినను తిరస్కరించవ'ద్దని అధికారం ఏర్పడేటట్లు తన కొడుకులను అతనికి అప్పగించింది.

వ. గరుడండును గద్రువ పంచిన పనులెల్లను వినత యనుమతంబున నతివినయపరుం డై చేయుచు. 42

ప్రతిపదార్థం: గరుడండును= గరుడుడుకూడ (గరుడడు, గరుడుడు అనే రూపాలు రెండూ ఉన్నాయి); కద్రువ, పంచిన, పనులు+ఎల్లను= కద్రువ ఆజ్ఞాపించిన పనులన్నిటిని; వినత, అనుమతంబునన్= తల్లి అయిన వినత అంగీకారంతో; అతివినయ, పరుండు+అయి= మిక్కిలి నమ్రతతో కూడినవాడై; చేయుచున్= చేస్తూ.

తాత్పర్యం: గరుడుడుకూడ కద్రువ ఆజ్ఞాపించిన పనులన్నిటిని తన తల్లి అయిన వినత అంగీకారంతో మిక్కిలి నమ్రతతో చేస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఆ పన్నగముఖ్యులఁ దన ।
వీఁపునఁ బెట్టికొని పఱచి, విపినములు, మహా
ద్వీపములు, గిరులు, నఖిల ది ।
శాపాలపురములుఁ జూపెఁ జన వారలకున్. 43

ప్రతిపదార్థం: ఆ, పన్నగ, ముఖ్యులన్= ఆ సర్పశ్రేష్ఠులను; తన, వీపునన్= తన వీపుమీద; పెట్టికొని; పఱచి= పరువెత్తి (ఎగిరి); వారలకున్= ఆపాములకు; విపినములు= అడవులు; మహత్+ద్వీపములు= గొప్పదీవులు; గిరులున్=

పర్వతాలను; అఖిల, దిశా, పాల, పురములున్= సకల దిక్పాలకుల నగరాలను కూడ; చనన్= ఒప్పేట్లుగా; చూపెన్= చూపెను.

తాత్పర్యం: గరుడడు ఆ సర్పముఖ్యులను తనవీపుమీద పెట్టుకొని ఎగిరి, అడవులను, గొప్పద్వీపాలను, పర్వతాలను, అష్టదిక్పాలకుల నగరాలను వారికి ఒప్పేట్లుగా చూపించాడు.

వ. ఒక్కనాఁడు సప్తమారుతజవంబున సప్తాశ్వమండలంబుదాఁక నెగసిన, నమ్మార్తాండు చండకిరణంబుల వేఁడిమిఁ దాఁకి, మాఁడి, గరుడని వీఁపున నున్నయురగులు దొరఁగి నేలంబడి మూర్ఛవోయినంజూచి, కద్రువ కడునలిగి, గరుడనిం బదరి, యతిభక్తి నింద్రు నారాధించి. 44

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు; సప్తమారుత, జవంబునన్= ఏడుగాలులశక్తితో; సప్తాశ్వ మండలంబు దాఁకన్= సూర్యమండలంవరకు; ఎగసినన్= పైకి ఎగురగా; ఆ+మార్తాండు= ఆ సూర్యునియొక్క; చండ, కిరణంబుల, వేఁడిమి= తీక్ష్ణమైన కిరణాలవేడి; తాఁకి= సోకి; మాఁడి= మాడిపోయి; గరుడని, వీఁపునన్, ఉన్న; ఉరగులు= పాములు; తొరఁగి= జారి; నేలన్, పడి; నేలమీద పడి; మూర్ఛ, పోయినన్; చూచి; కద్రువ; కడున్, అలిగి= మిక్కిలి కోపించి; గరుడనిన్; పదరి= ఆక్షేపించి; ఇంద్రున్; అతిభక్తిన్= మిక్కిలిభక్తితో; ఆరాధించి= పూజించి.

తాత్పర్యం: ఒకదినాన ఏడువాయువుల వేగంతో గరుడడు సూర్యుడిమండలం (బింబం) వరకు పైకెగురగా ఆసూర్యుడి తీక్షణ్ మైన కిరణాలవేడి తాకటంచేత గరుడుని వీపుపై ఉండే పాములు మాడి, జారి, నేలమీద పడి మూర్ఛిల్లగా చూచి కద్రువ మిక్కిలి కోపించి గరుడుని నిందించి ఇంద్రుడిని భక్తితో పూజించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. నరసురసిద్ధకింపురుషనాగనభశ్చరముఖ్యు లెల్ల నీ
కరుణయ వేచి మంద్రు, త్రిజగంబులు నీ కులిశాభిరక్షణ

స్ఫురణన చేసి సుస్థిరతఁ బొందుఁ బురందర! సర్వలోకసుం
దర! శరణంబు నా కగుము దానవసూదన! పాకశాసనా! 45

ప్రతిపదార్థం: దానవసూదన= రాక్షసులను హతమార్చినవాడా!; పాకశాసనా= పాకుడనే రాక్షసుడిని శిక్షించినవాడా!; సర్వ, లోక, సుందర= అన్ని లోకాలకు అందమైనవాడా!; పురందర= ఓఇంద్రుడా!; నర, సుర, సిద్ధ, కింపురుష, నాగ, నభస్+చర, ముఖ్యులు+ఎల్లన్= నరులు, దేవతలు, సిద్ధులు, కింపురుషులు, నాగులు, ఆకాశంలో తిరుగాడే ఇతరులు మొదలయిన వారిలోని. ముఖ్యులందరును; నీ, కరుణ+అ= నీదయనే; వేచి= ఎదురుచూచి; మంద్రు= జీవిస్తారు; నీ, కులిశ+అభిరక్షణ, స్ఫురణన్+ అ+చేసి= నీవజ్రాయుధంయొక్క రక్షణంయొక్క అతిశయంచేతనే, త్రిజగంబులు= ముల్లోకాలు; సుస్థిరతన్, పొందున్= (స్థిరత్వాన్ని) శాంతిని పొందుతాయి; నాకున్; శరణంబు= రక్షణము, అగుము= కమ్ము.

తాత్పర్యం: రాక్షససంహారి వైన ఓ ఇంద్రుడా! నరులు, దేవతలు, సిద్ధులు, కింపురుషులు, నాగులు, ఆకాశమార్గాన చరించే ఇతర ముఖ్యు లందరూ నీదయనే అపేక్షించి జీవిస్తారు. నీవజ్రాయుధంయొక్క రక్షణ కలగటంచేతనే ముల్లోకాలు శాంతిని పొందుతాయి. ఓఇంద్రుడా! ఎల్లలోకాలలో సుందరుడ వైనవాడా! నాకు రక్షకుడ వగుము.

విశేషం: ఈపద్యంలో రేఫాక్షరబాహుళ్యంవలన అక్షరరమ్యత ఏర్పడింది. దీనివలన కద్రువ లోని మనోవేదన ధ్వన్యమాన మౌతున్నది. 'పురందర! సర్వలోకసుందర!' అనే సంబుద్ధిలోని బిందుపూర్వక దకారంతో కూడుకొన్న ర వర్ణం వలన కలిగే నాదమాధుర్యం ఇంద్రుడిని ప్రసన్నుడినిగా చేసికొనటానికి తోడ్పడుతుంది. ఉదారత(బంధముయొక్క వికటత్వం)తో కూడుకొన్న ప్రసాదం (బంధశైథిల్యం) అనే శబ్దగుణం రసభావవ్యంజకంగా సంవదించిన నన్నయ రచనాశిల్ప మిది. (సంపా.)

వ. అని స్తుతియించి పర్జన్యప్రసాదంబున మహావృష్టి గొడుకులపయిం గురియించి, యయ్యురగుల విగత పరితాపులంజేసి కద్రువ గర్వంబున నుఱక గరుడని వినతనుం బనులుగొనుచున్నంత, నొక్కనాఁడు గరుడండు తల్లి కి ట్లనియె. 46

ప్రతిపదార్థం: అని; స్తుతియించి= పొగడి; పర్జన్య, ప్రసాదంబునన్= ఇంద్రుడి అనుగ్రహంచేత; మహత్, వృష్టి= గొప్పవాన; కొడుకులపయిన్= కుమారులయిన పాములమీద; కురియించి= కురిసేట్లు చేసి; ఆ+ఉరగులన్= ఆపాములను; విగత, పరితాపులన్= పోయిన సంతాపం (వేడివల్లకలిగినబాధ) కలవారిని; చేసి; ఉఱక= లక్ష్యపెట్టక; పనులు, కొనుచున్+ఉన్న+అంతన్= వారిచేత పనులు చేయించుకొంటూండగా అప్పుడు; గరుడండు; తల్లికిన్= వినతకు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికినాడు.

తాత్పర్యం: అని పొగడి, ఇంద్రుడి అనుగ్రహంచేత కొడుకులమీద గొప్పవాన కురిసేటట్లు చేసి, ఆపాములను వేడివలనకలిగినబాధ లేనివారిగా చేసి, కద్రువ ఎవ్వరినీ లక్ష్యపెట్టక వారిచే పనులు చేయించుకొంటూ ఉండగా, గరుడుడు తల్లితో ఇట్లా పలికాడు.

ఉ. ఆయతపక్షతుండహతి నక్కులశైలము లెల్ల నుగ్గుగాఁ
జేయు మహాబలంబును బ్రసిద్ధియునుం గల నాకు నీపనిం
బాయక వీఁపునం దవడుఁ బాముల మోవను, వారికిం బనుల్
సేయను నేమి కారణము సెప్పుము దీనిఁ బయోరుహాననా! 47

ప్రతిపదార్థం: పయోరుహ+ఆననా= పద్మంవంటి ముఖం కలదానా! ఆయత, పక్ష, తుండ, హతిన్; ఆయత= పెద్దవయిన; పక్ష= రెక్కలయొక్క; తుండ= ముక్కుయొక్క; హతిన్= దెబ్బచేత; ఆ+కుల, శైలములు+ఎల్లన్= ఆప్రాచీన పర్వతాలు అన్నింటిని; నుగ్గుగాన్= పొడిగా; చేయు, మహత్, బలంబును= చేసేగొప్పబలాన్ని; ప్రసిద్ధియునున్= ప్రఖ్యాతియు; కల; నాకున్; ఈపనిన్= ఈపనిని; పాయక= క్రమంతప్పకుండ; విడువక; వీఁపునందున్= వీపుమీద; అవడు, పాములు= నీచా లయిన పాములను; మోవను= మోయటానికి; వారికిన్, పనుల్ చేయను= ఆపాములకు సేవలుచేయటానికి, ఏమి కారణము; చెప్పుము.

తాత్పర్యం: పద్మంవంటిముఖంకలదానా! కులశైలాలన్నింటిని నావిశాలమైన రెక్కలతో, వాడియైన ముక్కుతోడి దెబ్బలతో పొడిగాచేసే గొప్పబలమున్నూ, ప్రసిద్ధియున్నూ ఉన్న నాకు విడువక సదా నీచా లయిన పాములను వీపుపై మోయటానికి, వాటికి సేవచేయటానికి కారణ మేమి? ఈ పనికి కారణమేమిటో చెప్పుము.

విశేషం: తల్లిని 'పయోరుహాననా!' అని సంబోధించటం ఉచితంకాదని కొందరంటారు. అయితే, ఇక్కడ అవయవార్థం అవివక్షితమని గ్రహించాలి. ఇటువంటిది ఈఆశ్వాసంలోనే మరొకటి ఉన్నది. వాసుకి తన చెల్లెలైన జరత్కారువును 'అంబుజనేత్రా'! (2.216) అని సంబోధిస్తాడు. ఇవి కావ్యభాషలో గౌరవాన్ని తెలిపే సంబుద్ధులుగా పరిగణింపబడతాయి. ఇందులో కొందరు భావించినట్లు అనౌచిత్యం లేదు.

వ. అని యడిగిన వినత తనకుం గద్రువతోడి పన్నిదంబున నైన దాసీత్వంబును, తత్కారణం బైన యనూరుశాపంబును గొడుకున కేర్పడం జెప్పి యి ట్లనియె. 48

ప్రతిపదార్థం: అని, అడిగినన్= అని గరుత్మంతుడు అడుగగా; వినత, తనకున్; కద్రువతోడి, పన్నిదంబునన్= కద్రువతో వేసిన పందెంవలన; ఐన, దాసీత్వంబును= ఏర్పడిన దాసితనాన్ని; తత్, కారణంబు+ఐన= దానికి కారణ మయిన; అనూరు, శాపంబునున్= అనూరు డిచ్చిన శాపాన్ని; కొడుకునకున్; ఏర్పడన్, చెప్పి= వివరించి (స్పష్టమయ్యేట్లుగా); ఇట్లు, అనియెన్.

తాత్పర్యం: అని గరుడుడు అడుగగా వినత తన సవతి అయిన కద్రువతో జరిగిన పందెంచేత కలిగిన దాస్యాన్నీ, ఆ కారణాన కలిగిన జ్యేష్ఠపుత్రు డైన అనూరు డిచ్చిన శాపాన్నీ కొడుకునకు స్పష్టంగా తెల్పి ఇట్లా అన్నది.

క. నీ కతమున నా దాస్యము ।
ప్రాకటముగఁ బాయు ననిన పలు కెడలోనం
జేకొని, యూఅడి నిర్గత ।
శోకస్థితి నున్నదానఁ జూవె ఖగేంద్రా! 49

ప్రతిపదార్థం: ఖగ+ఇంద్రా+= ఓపక్షిరాజా! నీకతమునన్= నీకారణంచే; నా దాస్యము= నా దాసితనం; ప్రాకటముగన్= ప్రసిద్ధంగా (అందరికీ తెలిసేటట్లుగా); పాయున్= పోతుంది; అనిన= అని అనూరుడు చెప్పిన; పలుకు= మాట; ఎడలోనన్= మనస్సులో; చేకొని= గ్రహించి; ఊఅడి= ఓదార్పుచెంది; నిర్గత, శోక, స్థితిన్= పోయిన దుఃఖం కల స్థితిలో; ఉన్నదానన్+చూవె= ఉన్నదానినిసుమా!

తాత్పర్యం: ఓ పక్షిశ్రేష్ఠుడా! నీకారణంగా నా దాసితనం పోతుం దని అనూరుడు చెప్పినమాటను మనస్సులో ఉంచుకొని, బాధ విడిచి దుః ఖంపోయినస్థితి కలదాన నై ఉన్నానుసుమా!

వ. 'కొడుకులు సమర్థులైనం దల్లిదండ్రులయిడుమలు వాయుట యెందునుం గలయది, గావున నీయట్టిసత్పుత్త్రుం బడసియు దాసి నై యుండుదాననే' యనిన విని వైనతేయుండు తద్దయు దుఃఖితుం డై, యొక్కనాఁడు కాద్రవేయుల కి ట్లనియె. 50

ప్రతిపదార్థం: కొడుకులు; సమర్థులు+ఐనన్= శక్తికలవారైతే; తల్లిదండ్రుల; ఇడుమలు= కష్టాలు; పాయుట= వీడటం; ఎందునున్, కల, అది= ఎచ్చటైనా ఉన్నది; కావునన్; నీ, అట్టి, సత్, పుత్త్రున్= నీవంటి మంచికుమారుడిని; పడసియున్= పొందియు; దాసిని+ఐ, ఉండు, దానను+ఏ= దాసి నై ఉంటానా;

అనినన్= అని చెప్పగా; విని; వైనతేయుండు= వినతకొడు కైన గరుత్మంతుడు; తద్దయున్= మిక్కిలి; దుఃఖితుండు+ఐ= దుఃఖంపొందినవాడై; కాద్రవేయులకున్= కద్రువ కుమారు లయిన పాములకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కుమారులు శక్తిమంతు లైతే తల్లిదండ్రుల కష్టాలు తొలగటం ఎచ్చటైనా ఉన్నదే(సహజమే). కావున నీవంటి యోగ్యు డైన కుమారుడిని పొంది నేను ఇంకా దాసి నై ఉంటానా!' అని వినత తెల్పగా విని గరుడుడు దుఃఖించి కద్రువపుత్రు లైన పాములతో ఇట్లా పలికాడు.

క. మా యీ దాస్యము వాయు ను ।
పాయము సేయుండు, నన్నుఁబనుపుండిష్టం
బేయది దానిన తెత్తు న ।
జేయుఁడ నై యమరవరులఁ జేకొని యైనన్. 51

ప్రతిపదార్థం: మా, ఈ, దాస్యము= తల్లియైన వినతకు, నాకు గల ఈబానిసతనం; పాయు+ఉపాయము= పోయేటి ఆలోచనను; చేయుండు= చెయ్యండి; నన్నున్; పనుపుండు= ఆజ్ఞాపించండి; ఇష్టంబు, ఏ+అది= కోరిం దేదో; దానిన్+అ= దాన్నే; అమర, వరులన్= దేవశ్రేష్ఠులను; చేకొని+ఐనన్= లోబరుచుకొని అయినా; అజేయుఁడను+ఐ= ఓడించబడనివాడనై, విజయం పొందేవాడినై; తెత్తున్= తెస్తాను.

తాత్పర్యం: నాతల్లియొక్క, నాయొక్కదాస్యం పోవటానికి ఆలోచన చేయండి; నన్ను ఆజ్ఞాపించండి; దేవశ్రేష్ఠులను లోబరుచుకొని అయినా మీకిష్టమయిన దానిని విజయం పొంది తెస్తాను.

వ. అనిన నయ్యురగులు కరుణించి గరుడని కి ట్లనిరి. 52

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; ఆ+ఉరగులు= ఆపాములు; కరుణించి= జాలిపడి, దయదలచి; గరుడనికిన్+ ఇట్లు+అనిరి= గరుత్మంతునితో ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: అని గరుడుడు అడుగగా ఆపాములు జాలిపడి గరుడుడితో ఇట్లా చెప్పారు.

చ. 'అమితపరాక్రమంబును, రయంబును, లావును గల్గు ఖేచరో
త్తముఁడవు నీవు; నీదయినదాస్యముఁ బాచికొనంగ నీకుఁ జి
త్తము గలదేని, భూరిభుజదర్పము శక్తియు నేర్పడంగ మా
కమృతముఁ దెచ్చియి' మ్మనిన నవ్విహగేంద్రుఁడు సంతసంబునన్. 53

ప్రతిపదార్థం: నీవు; అమిత, పరాక్రమంబును= అంతు లేని విక్రమాన్ని; రయంబును= వేగాన్ని; లావును= బలాన్ని; కల్గు; ఖేచర+ఉత్తముఁడవు= పక్షులలో గొప్పవాడివి, (పక్షి శ్రేష్ఠుడివి); నీది+అయిన, దాస్యమున్= నీకు కలిగిన బానిసతనాన్ని; పాచికొనంగన్= పోగొట్టుకొనటానికి; నీకున్; చిత్తము, కలదు+ఏని= మనసు ఉంటే; భూరి, భుజ, దర్పము= అధిక మైన భుజాల యొక్క గర్వమున్నూ; శక్తియున్= సామర్థ్యమున్నూ; ఏర్పడంగన్= స్పష్టమయ్యే టట్లు; మాకున్; అమృతమున్; తెచ్చి, ఇమ్ము; అనినన్= అని పాములు చెప్పగా; ఆ, విహగ+ఇంద్రుఁడు= ఆపక్షిశ్రేష్ఠుడు; సంతసంబునన్= సంతోషంతో.

తాత్పర్యం: 'నీవు అంతులేని విక్రమాన్ని, వేగాన్ని, బలాన్ని కలిగిన పక్షిశ్రేష్ఠుడవు. నీకు కలిగిన దాస్యం పోగొట్టుకొనాలనే అభిప్రాయ మున్నట్లయితే, గొప్ప భుజాలగర్వమూ, శక్తీ ప్రకటితమయ్యేటట్లుగా మాకు అమృతాన్ని తెచ్చి ఇమ్మని పాములు చెప్పగా, ఆపక్షిశ్రేష్ఠుడు సంతోషంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: గరుడుడికి ఉన్న అనంతపరాక్రమాది గుణాలకు తగిన కోరిక అమృతాన్ని తెచ్చి ఇవ్వట మని పాములు నిర్ణయించాయి. అమృతాన్ని పొందటం పాముల కోర్కె. దానిని తీర్చగలిగిన సమర్థుడు వారికి దొరికాడు. అందుకని అడిగారు. మహాభారతంలో అనేక సందర్భాలలో అమృతత్వసాధనకై జీవులు చేసే ప్రస్థానాన్ని ధ్వనిమయంచేయటం ఇచ్చటి కథార్థప్రయోజనం.

గరుత్మంతుఁడమృతంబుఁదెచ్చుటకుఁదల్లియనుమతిఁగొనుట (సం. 1-24-1)

వ. 'అట్ల చేయుదు; నమృతంబు దెచ్చి మీ కిచ్చి, యేనునుం దల్లియు దాస్యంబువలన విముక్తుల మగువార' మని నొడివి, తద్వృత్తాంతం బంతయుం దల్లికిం జెప్పి 'యమృత హరణార్థం బరిగెద' నని మ్రొక్కిన, వినత సంతసిల్లి కొడుకుం గౌఁగిలించుకొని. 54

ప్రతిపదార్థం: అట్లు+అ= ఆవిధంగానే; చేయుదున్; అమృతంబు, తెచ్చి; మీకున్+ఇచ్చి; ఏనునున్; తల్లియున్; దాస్యంబువలనన్; విముక్తులము+ అగువారము= విడువబడినవార మవుతాము; అని; నొడివి= చెప్పి; తద్, వృత్తాంతంబు= ఆవిషయం; అంతయున్; తల్లికిన్= వినతకు; చెప్పి; అమృత, హరణ+అర్థంబు= అమృతాన్ని హరించేనిమిత్తం; అరిగెదన్= వెడలుతాను; అని; మ్రొక్కినన్= నమస్కరించగా; సంతసిల్లి= సంతోషించి; కొడుకున్= కుమారు డయిన గరుడుని; కౌఁగిలించుకొని= వాత్సల్యంతో ఆలింగనం చేసికొని.

తాత్పర్యం: 'అట్లే చేస్తాను. స్వర్గంనుండి అమృతం తెచ్చి మీ కిచ్చి నేనూ మాతల్లి అయిన వినతా దాస్యంనుండి విడువబడినవాళ్ళ మవుతా' మని పలికి, ఆవిషయమంతా తల్లియైన వినతకు తెల్పి 'అమృతం హరించటానికి వెళ్తా' నని నమస్కరించగా వినత సంతోషించి కొడుకును కౌగిలించుకొని.

చ. 'అనిలుఁడు పక్షయుగ్మ, మమృతాంశుఁడు వీఁపనలుండు మస్తకం,
బినుఁడు సమస్తదేహమును నెప్పుడుఁ గాచుచు నీ కభీష్టముల్
ఘనముగఁ జేయుచుండెడు జగన్నుత! యున్నతియున్ జయంబుఁ జే
కొను' మని యిచ్చె దీవనలు గోరి ఖగేంద్రునకుం బ్రియంబునన్. 55

ప్రతిపదార్థం: అనిలుఁడు= వాయువు; పక్షయుగ్మము= రెక్కలజంటను; అమృత+అంశుఁడు= చంద్రుడు; వీఁపు; అనలుండు= అగ్ని; మస్తకంబు=

శిరస్సును; ఇనుఁడు= సూర్యుడు; సమస్తదేహమునున్= సర్వశరీరాన్ని; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కాచుచున్= రక్షిస్తూ; నీకున్, అభీష్టముల్= కోరికలు; ఘనముగన్= గొప్పగా; చేయుచుండెడున్= తీరుస్తూ ఉంటారుగాక! జగత్+నుత= లోకాలచేత స్తుతింపబడినవాడా! ఉన్నతియున్= గొప్పతనాన్ని; జయంబున్= విజయాన్ని; చేకొనుము= గ్రహించుము; అని; కోరి; దీవనలు= ఆశీస్సులు; ప్రియంబునన్= ప్రీతితో; ఖగ+ఇంద్రునకున్= పక్షులకు రాజయిన గరుత్మంతుడికి; ఇచ్చెన్= ఇచ్చింది.

తాత్పర్యం: 'వాయువు రెక్కలజంటను, చంద్రుడు వీపును, అగ్ని తలను, సూర్యుడు ఎల్లశరీరాన్ని సర్వదా రక్షిస్తూ నీ కోరికలు గొప్పగా తీరుస్తూఉంటారు గాక! లోకాలచేత నుతింపబడేవాడా! గొప్పతనాన్ని, విజయాన్ని గ్రహించుము' అని వినత మనసులో కోరి పక్షులకు రా జయిన గరుడునికి ప్రీతితో ఆశీస్సులు ఇచ్చింది.

విశేషం: తల్లులు బిడ్డలకు ఉగ్గుపెట్టి వారి శరీరంలోని అంగాల నన్నింటికీ శ్రీరామరక్షలు కోరుతూ వాత్సల్యాన్ని వ్యక్తంచేసినట్లు ఇక్కడ వినత తనకొడుకు రెక్కలకు, వీపునకు, తలకు, శరీరం మొత్తానికీ దైవరక్షను నిర్దేశించింది. గరుడుడు పక్షికాదనీ, మంత్రమనీ చెప్పే తత్త్వజ్ఞులు వీటిని మంత్రరక్షాకవచంగా వ్యాఖ్యానిస్తారు.

వ. గరుడండును దల్లిదీవనలు గైకొని గమనోన్ముఖుం డై 'యమృతంబు దెచ్చునపుడు లావు గలుగవలయు, నా కాహారంబు ప్రసాదింపు' మనిన వినత యి ట్లనియె. 56

ప్రతిపదార్థం: గరుడండును; తల్లి; దీవనలు= ఆశీస్సులు; కైకొని= గ్రహించి; గమన+ఉన్ముఖుండు+ఐ= వెళ్ళటానికి సిద్ధు డై; అమృతంబు; తెచ్చునపుడు; లావు= బలం; కలుగవలయున్; నాకున్ ఆహారంబు= తినే పదార్థం; ప్రసాదింపుము= అనుగ్రహించుము; అనినన్; వినత; ఇట్లు+ అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: గరుడుడు తల్లి అయిన వినతయొక్క దీవెనలు పొంది వెళ్ళటానికి సిద్ధమై, 'అమృతం తెచ్చే సమయంలో తగినబలం కలిగి ఉండాలి; నాకు ఆహారం అనుగ్రహించు' మని తల్లితో పలుకగా ఆమె ఇట్లా అన్నది.

క. విషనిధికుక్షి నసంఖ్యము ।
నిషాదగణ ముండి ధారుణీప్రజకుఁ గడున్
విషమమును జేయు, దాని ని ।
మిషమున భక్షించి చను మమిత్రవిఘాతీ! 57

ప్రతిపదార్థం: అమిత్రవిఘాతీ= శత్రువులను సంహరించేవాడా! విషనిధి, కుక్షిన్= సముద్రంయొక్క గర్భాన; అసంఖ్యము= లెక్కలేని; నిషాదగణము= బోయవాళ్ళసముదాయం; ఉండి; ధారుణీ, ప్రజకున్= భూమిలోని జనులకు; కడున్= మిక్కిలి; విషమమును= కష్టాన్ని; చేయున్; దానిన్= ఆ నిషాదగణాన్ని; నిమిషమునన్= కనురెప్పపాటుకాలంలో (తక్కువకాలంలో) భక్షించి= తిని; చనుము= వెళ్ళుము.

తాత్పర్యం: ఓ శత్రువులను సంహరించే గరుడుడా! సముద్రగర్భాన లెక్కింపరాని బోయవాళ్ళసముదాయం ఉన్నది; భూమిలోని ప్రజలకు క్లేశం కలిగిస్తున్నది; ఆనిషాదగణాన్ని నిమిషకాలంలో తిని వెళ్ళుము.

వ. 'భక్షణవిషయంబున బ్రాహ్మణునిం బరిహరించునది' యనిన గరుడండు 'నాకు బ్రాహ్మణు నెఱుంగు తెఱంగెఱింగింపు' మనిన వినత యి ట్లనియె. 58

ప్రతిపదార్థం: భక్షణవిషయంబునన్= తినే సందర్భంలో; బ్రాహ్మణునిన్; పరిహరించునది= విడవాలి; అనినన్; గరుడండు; నాకున్; బ్రాహ్మణున్; ఎఱుంగు, తెఱంగు= తెలిసికొనే విధం; ఎఱింగింపుము= తెలుపుము.

తాత్పర్యం: తినే సందర్భంలో బ్రాహ్మణుడిని విడిచిపెట్టుము. (తినకుము) అని వినత పలుకగా గరుడుడు బ్రాహ్మణు డెవరో తెలిసికొనేవిధం తెల్పుమని అడుగగా వినత ఇట్లా చెప్పింది.

క. రయమున మ్రింగుడు గాలము ।
క్రియ నెవ్వఁడు కంఠబిలముక్రిందికిఁ జన క
గ్నియపోలె నేర్చుచుండును ।
భయరహితా! వాని నెఱుఁగు బ్రాహ్మణుఁ గాఁగన్. 59

ప్రతిపదార్థం: రయమునన్= వేగంతో; మ్రింగుడున్= మింగిన అనంతరం; గాలముక్రియన్= చేపనుపట్టే గాలంవలె; ఎవ్వఁడు; కంఠ, బిలము క్రిందికిన్= కంఠరంధ్రంక్రిందికి; చనక= వెళ్ళక; అగ్ని+అ+పోలెన్= అగ్నివిధంగా; ఏర్చుచుండును= కాలుస్తుంటాడో; భయరహితా= భయంలేనివాడా!; వానిన్= అట్టివాడిని; బ్రాహ్మణున్, కాఁగన్= బ్రాహ్మణు డయినట్లుగా; ఎఱుఁగు= తెలిసికో!

తాత్పర్యం: భయం లేని ఓ గరుత్మంతుడా! వేగంగా మింగేటప్పుడు చేపలను పట్టే గాలమనే సాధనంవలె ఎవడు కంఠరంధ్రంక్రిందికి పోకుండ అగ్నివలె కాలుస్తుంటాడో అట్టివాడిని బ్రాహ్మణుడిగా తెలిసికొమ్ము.

విశేషం: అలం: ఉపమ

తే. కోపితుం డైన విప్రుండు ఘోరశస్త్ర ।
మగు, మహావిష మగు, నగ్ని యగు;నతండ
యర్చితుం డైన జనులకు నభిమతార్థ ।
సిద్ధికరుఁ డగు, గురుఁడగుఁ, జేయుఁ బ్రీతి. 60

ప్రతిపదార్థం: విప్రుండు= బ్రాహ్మణుడు; కోపితుండు+ఐనన్= కోపం కల్గింపబడినవా డయితే; ఘోర, శస్త్రము+అగున్= భయంకరమైన ఆయుధమవుతాడు; మహత్, విషము+అగున్= గొప్పవిష మవుతాడు; అగ్ని, అగున్; అతండు+అ= ఆ బ్రాహ్మణుడే; అర్చితుండు+ఐనన్= సేవింపబడినవా డయితే; జనులకున్= ప్రజలకు; అభిమత+అర్థ, సిద్ధి, కరుఁడు+అగున్= కోరబడిన ప్రయోజనం యొక్క సిద్ధిని కలిగించేవా డవుతాడు; గురుఁడు+అగున్= ఉపదేశకు డవుతాడు; ప్రీతిన్+చేయున్= ఇష్టం కలిగిస్తాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడు కోపింపచేయబడితే భయంకర మయిన ఆయుధమవుతాడు, గొప్పవిష మవుతాడు, అగ్ని అవుతాడు; ఆబ్రాహ్మణుడే సేవింపబడితే ప్రజలకు కోరబడిన ప్రయోజనంయొక్క సిద్ధిని కలిగించేవా డవుతాడు, ఆచార్యు డవుతాడు. ఇష్ట మొనరిస్తాడు.

వ. అని బ్రాహ్మణస్వరూపంబుఁ జెప్పిన నెఱింగి, వినతకు మ్రొక్కి వీడ్కొని, గరుడం డతిత్వరితగతిం బఱచి, సముద్రోదరంబున నున్న నిషాదు లనేక శతసహస్రసంఖ్యలవారిం బాతాళవివరంబునుంబోని తనకంఠబిలంబుఁ దెఱచి యందఱ నొక్కపెట్ట మ్రింగిన, నం దొక్క విప్రుం డుండి కుత్తుకకు డిగక నిప్పనుంబోలె నేర్చుచున్న నెఱింగి, 'నాకంఠబిలంబున విప్రుం డున్న వాఁడేని వెలువడి వచ్చునది' యనిన గరుడని క వ్విప్రుం డి ట్లనియె. 61

ప్రతిపదార్థం: అని; బ్రాహ్మణ, స్వరూపంబున్= బ్రాహ్మణుడియొక్క స్వరూపాన్ని (లక్షణాన్ని); చెప్పినన్= చెప్పగా; ఎఱింగి; వినతకున్; మ్రొక్కి= నమస్కరించి; వీడ్కొని= సెలవుపుచ్చుకొని; గరుడండు; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగం గల గమనంతో; పఱచి= పరుగెత్తి (ఎగిరి); సముద్ర+ఉదరంబునన్= సముద్రంయొక్క గర్భంలో; ఉన్న; అనేక, శత, సహస్ర, సంఖ్యల, వారిన్= పెక్కువందల వేల సంఖ్యలలో ఉన్న వారిని; నిషాదులన్= బోయలను; పాతాళవివరంబునున్, పోని= పాతాళలోకంయొక్క రంధ్రంవంటి; తన, కంఠ, బిలంబున్= తన కంఠంయొక్క రంధ్రాన్ని తెఱచి; ఒక్కపెట్టన్= ఒక్కమారుగా; మ్రింగినన్= మ్రింగగా; అందున్= ఆకంఠబిలంలో; ఎఱింగి=

తెలిసి; విప్రుండు= ఒక్క బ్రాహ్మణుడు, ఉండి; కుత్తుకకున్, డిగక= కంఠంలోనికి దిగక; నిప్పునున్, పోలెన్= నిప్పువలె; ఏర్చుచున్+ఉన్నన్= కాలుస్తూ ఉండగా; నా కంఠబిలంబునన్= నా కంఠంయొక్క రంధ్రంలో; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉన్నవాఁడు+ఏని= ఉన్నవా డయితే; వెలువడి వచ్చునది= బయటికి రావాలి; అనినన్= అనగా; గరుడనికిన్= గరుత్మంతుడితో; ఆ+ విప్రుండు= ఆబ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వినత బ్రాహ్మణుడిలక్షణాన్ని చెప్పగా తెలిసికొని గరుడుడు వినతకు నమస్కరించి, ఆమెకడ సెలవు పుచ్చుకొని, మిక్కిలి వేగం గల గమనంతో ఎగిరి(పరుగెత్తి) సముద్రగర్భాన ఉండే పెక్కువేలసంఖ్య కల బోయలను పాతాళరంధ్రంవంటి తనకంఠరంధ్రం తెరిచి ఆనిషాదులనందరిని ఒకేమారు మ్రింగగా, ఆనిషాదులలో ఒక బ్రాహ్మణుడు ఉండి, గొంతుకలోనికి దిగక అగ్నివలె కాలుస్తుండగా తల్లి చెప్పిన లక్షణాన్నిబట్టి బ్రాహ్మణుడు కంఠంలో ఉన్నా డని తెలిసికొని, 'నాకంఠరంధ్రంలో ఎవడైనా బ్రాహ్మణుడు ఉంటే, బయటికి రావా' లని పలుకగా ఆబ్రాహ్మణుడు గరుడుడితో ఇట్లా పలికాడు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. 'విప్రుఁడ నున్నవాఁడ, నపవిత్రనిషాది మదీయభార్య, కీ
ర్తిప్రియ! దీనిఁ బెట్టి చనుదెంచుట ధర్మువె నాకు?' నావుడున్
'విప్రులఁ బొంది యున్న యపవిత్రులుఁ బూజ్యులు గారె; కావునన్
విప్రకులుండ! వెల్వడుము వేగమ నీవును నీ నిషాదియున్.' 62

ప్రతిపదార్థం: కీర్తిప్రియ!= కీర్తిపట్ల ఆసక్తి కలవాడా! గరుత్మంతుడా!; విప్రుఁడన్= బ్రాహ్మణుడను; ఉన్నవాఁడన్; అపవిత్ర= పరిశుద్ధురాలు కానిది; నిషాది= బోయవనిత; మదీయ, భార్య= నాభార్య; దీనిన్= ఈబోయతను; పెట్టి=విడిచి; చనుదెంచుట= రావటం; నాకున్; ధర్మువు+ఎ= ధర్మమా! (ధర్మంకాదని భావం); నావుడున్= అనగావిని; విప్రకులుండ= బ్రాహ్మణకులుడా!; విప్రులన్= బ్రాహ్మణులను; పొంది, ఉన్న= చెంది ఉండే (చెట్టపట్టి ఉండే); అపవిత్రులున్= అపరిశుద్ధులుకూడ; పూజ్యులు కారె= పూజింపదగినవారు కారా! (అవుతారు); కావునన్= ఆకారణంవలన; నీవును= నీనిషాదియున్= నీబోయభార్యయు; వేగము+అ= శీఘ్రంగా; వెల్వడుము= బయటకు రమ్ము; ఇచట 'నిషాదియు' అనేశబ్దం సహార్థంలో వాడబడింది. నిషాదియున్ అంటే నిషాదితోడ అని అర్థం.

తాత్పర్యం: 'కీర్తిపట్ల ఆసక్తిగల ఓగరుత్మంతుడా! బ్రాహ్మణుడిని ఉన్నాను, నాభార్య అపరిశుద్ధురా లయిన బోయవనిత; దీన్ని విడిచి రావటం నాకు ధర్మమా?' అనగా గరుడడు 'బ్రాహ్మణులను పొంది ఉండే అపరిశుద్ధులుకూడ పూజింపదగినవారు కారా? కావున ఓ బ్రాహ్మణ కులానికి చెందినవాడా! నీవు నీనిషాదిభార్యతో వెంటనే బయటకు రమ్ము!'

వ. అనిన నాగరుడని యనుగ్రహంబున బ్రాహ్మణుండు నిషాదీసహితుం డై వెలువడి వచ్చి, గరుడని దీవించి, యథేచ్ఛం జనియె; గరుడండును గగనపథంబునం బఱచి, కశ్యపుం గని నమస్కరించి, 'యస్మజ్జననీ దాస్యనిరాసార్థం బురగుల కమృతంబుఁ దేర నరిగెద, నిషాదఖాదనంబున నాఁకలి వోవకున్నయది, నా కాహారంబు ప్రసాదింపు' మనిన కొడుకుకడంకకు మెచ్చి కశ్యపప్రజాపతి యి ట్లనియె. 63

ప్రతిపదార్థం: అనినన్= గరుడుడు అట్లా పలుకగా; ఆ, గరుడని; అనుగ్రహంబునన్= ఆ గరుడని దయచేత; బ్రాహ్మణుండు; నిషాదీ సహితుండై=బోయజాతి పత్నితో వెలువడి, వచ్చి= బయటకు వచ్చి; గరుడనిన్; దీవించి= ఆశీర్వదించి; యథా+ఇచ్ఛన్= ఇచ్ఛవచ్చినట్లు; చనియెన్= వెళ్ళాడు; గరుడండును; గగనపథంబునన్= ఆకాశమార్గాన; పఱచి= ఎగిరి; కశ్యపున్= తండ్రి అయిన కశ్యపుని; కని= చూచి; నమస్కరించి= మ్రొక్కి; అస్మత్, జననీ, దాస్య, నిరాస+అర్థంబు= మాతల్లియొక్క బానిసతనాన్ని

పోగొట్టటానికి; ఉరగులకున్= పాములకు; అమృతంబు; తేరన్= తేవటానికి; అరిగెదన్= వెళ్లుతున్నాను; నిషాద, ఖాదనంబునన్= నిషాదులను తినటంచేత; ఆకలి; పోవక+ ఉన్న+అది= తొలగకుండా ఉన్నది; నాకున్; ఆహారంబు= తినేపదార్థం; ప్రసాదింపుము= అనుగ్రహించుము; అనినన్; కొడుకు, కడంకకున్= కొడు కయిన గరుడుని పూనికకు; మెచ్చి; కశ్యపప్రజాపతి= కశ్యపబ్రహ్మ; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: అని గరుడడు పలుకగా, అతనిదయవలన బ్రాహ్మణుడు తన నిషాదభార్యతో కూడి కంఠంనుండి బయటకు వచ్చి గరుడుని ఆశీర్వదించి, తన ఇచ్చవచ్చినట్లు వెళ్ళాడు. గరుడడును ఆకాశమార్గాన ఎగిరి తండ్రి అయిన కశ్యపుడిని చూచి మ్రొక్కి 'నాతల్లి దాస్యాన్ని తొలగించే నిమిత్తం పాములకు అమృతం తేవటానికి వెళ్ళుతున్నాను. బోయలను తినటం చేత నాఆకలి తీరలేదు. నాకు మరే దైనా ఆహారం అనుగ్రహించండి' అని పలుకగా అతని (కుమారుని) పూనికకు మెచ్చి కశ్యపబ్రహ్మ ఇట్లా అన్నాడు.

గజకచ్ఛపముల వృత్తాంతము (సం. 1-25-10)

క. అనలనిభుండు విభావసుఁ ।
డను విప్రుఁడు నియమవంతుఁ దర్థాఢ్యుం డై
తనరి సుఖ మున్న, నాతని ।
యనుజన్ముఁడు సుప్రతీకుఁ డనువాఁ డతనిన్. 64

ప్రతిపదార్థం: అనల, నిభుండు= అగ్నితో సమాను డయిన; విభావసుఁ డు+అను, విప్రుఁడు= విభావసు డనే పేరుకల బ్రాహ్మణుడు; నియమవంతుఁ డు= నియమం కలవాడు; అర్థ+ఆఢ్యుండు+ఐ= ధన సంపన్ను డయి; తనరి= ఒప్పి; సుఖము+ఉన్నన్= సుఖంతో ఉండగా; (ఇట ప్రథమ, తృతీయార్థంలో వాడబడింది); అతని+అనుజన్ముఁడు= అతని తమ్ముడు; సుప్రతీకుఁడు+అనువాఁడు= సుప్రతీకు డనే పేరు కలవాడు; అతనిన్= అన్న అయిన విభావసుడిని.

తాత్పర్యం: అగ్నితో సమానుడు, నియమాల ననుసరించేవాడు అయిన విభావసు డనే బ్రాహ్మణుడు, ధనసంపన్ను డై ఒప్పి సుఖంతో ఉండగా అతని తమ్ము డయిన సుప్రతీకు డనే పేరుకలవాడు అతని అన్న విభావసునితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మనపితృవర్గము వడసిన ।
ధనము విభాగించి యిమ్ము ధర్మస్థితి నా'
కని యడుగంబోయిన య ।
య్యనుజునకు విభావసుం డహంకారమునన్. 65

ప్రతిపదార్థం: మన, పితృవర్గము= మనతల్లిదండ్రుల, తాతముత్తాతల సమూహం; పడసిన= పొందిన; ధనమున్= సంపదను; విభాగించి= పాలుపంచి (విభజించి); నాకున్; ధర్మస్థితిన్= ధర్మం ప్రకారంగా; ఇమ్ము; అని, అడుగన్, పోయిన= అని అడగటానికి వెళ్లిన; ఆ, అనుజునకున్= ఆ తమ్ము డయిన సుప్రతీకునికి; విభావసుండు; అహంకారమునన్= గర్వంతో.

తాత్పర్యం: 'మన తండ్రితాతలు పొందిన సంపదను ధర్మప్రకారంగా పాలు పంచి నా కి' మ్మని అడగటానికి వెళ్ళిన తమ్ము డయిన సుప్రతీకుడికి విభావసుడు గర్వంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తా నలిగి యిచ్చె శాపం ।
'బేనుఁగ వై యుండు' మని, సహింపక వాఁడున్
మానుగఁ 'గూర్మమ వగు' మని ।
వానికిఁ బ్రతిశాప మిచ్చె వసులోభమునన్. 66

ప్రతిపదార్థం: తాను= ఆవిభావసుడు; అలిగి= కోపించి; ఏనుఁగవు+ఐ, ఉండుము+అని= ఏనుగవుగా ఉండుమని; శాపంబు+ఇచ్చెన్= శాపమిచ్చాడు; సహింపక= ఆశాపానికి ఓర్వక; వాఁడున్= తమ్ము డయిన సుప్రతీకుడును; మానుగన్= ఒప్పుగా; కూర్మమవు+ అగుము+అని= తాబేలువు కమ్ము

అని; వానికిన్= అన్న అయిన విభావసుడికి; వసులోభమునన్= సంపదపైనిఆశచేత; ప్రతిశాపము+ఇచ్చెన్= ఎదురుశాపం ఇచ్చాడు.

తాత్పర్యం: అన్న అయిన విభావసుడు 'ఏనుగవు కమ్ము' అని తమ్ముడిని శపిస్తే, ఆశాపానికి సహించక, తమ్ము డయిన సుప్రతీకుడు సంపదపై గల మక్కువతో 'తాబేలువు కమ్ము' అని అన్నను శపించాడు.

వ. 'ఇ ట్లన్నయుం దమ్ముండును నన్యోన్యశాపంబులం జేసి యోజనత్ర యోత్సేధంబు గలిగి దశయోజనవృత్తం బైన కూర్మంబును, షడ్యో జనోత్సేధంబు గలిగి ద్వాదశ యోజన విస్తృతం బైన గజంబును నై సరోవర విపినంబుల నుండి యర్థనిమిత్తం బైన పూర్వవైరంబునఁ దమలో నిత్యంబు నొండొంటితోడం బెనంగి పోరుచుండు; నవి నీకాహారంబు సు; మ్మరుగుము, కార్యసిద్ధి యయ్యెడు' మనిన గరుడండును మనోవేగంబునం బఱచి యారెంటినిం గాంచి. 67

ప్రతిపదార్థం: ఇట్లు+అన్నయున్, తమ్ముండునున్; అన్యోన్య, శాపంబులన్, చేసి= ఒండొరుల కిచ్చుకొన్న శాపాలచేత; యోజన, త్రయ+ఉత్సేధంబు, కలిగి= మూడు యోజనాల పొడవు (3×8= 24మైళ్ళు) గలిగి; దశ, యోజన, వృత్తంబు+ఐన= పదియోజనాల (ఆమడల) చుట్టుకొలత గలిగిన; కూర్మంబును= తాబేలును; షట్, యోజన+ఉత్సేధంబు, కలిగి= ఆరుయోజనాల పొడవు గలిగి; ద్వాదశ, యోజన, విస్తృతంబు+ఐన= పన్నెండు యోజనాల వ్యాప్తి (వెడల్పు) గలిగిన; గజంబునున్+ఐ= ఏనుగును అయి; సరోవరవిపినంబులన్= క్రమంగా చెరువులోను, అడవిలోను; ఉండి= నివసించి; అర్థ, నిమిత్తంబు+ఐన= సంపదకారణంగా ఏర్పడిన; పూర్వ, వైరంబునన్= పూర్వజన్మలోని పగతో; నిత్యంబున్= ఎల్లప్పుడును; తమలోన్= తమలోతాము; ఒండు+ఒంటితోడన్= ఒకటి ఇంకొకదానితో; పెనంగి= కలయబడి;పోరుచుండున్= పోట్లాడుతుంటాయి. అవి=ఆతాబేలును,

ఏనుగును; నీకున్; ఆహారంబు, చుమ్ము= తినదగినపదార్థాలు సుమా!; అరుగుము= వెళ్ళుము; కార్యసిద్ధి= పని నెరవేరటం; అయ్యెడున్+అనినన్= అవుతుందని చెప్పగా; (ఆశీర్వచనాన ఎడు చివరి ద్రుతానికి 'మ'కారం ఆదేశ మయింది); గరుడండును, మనస్+వేగంబునన్= మనస్సుయొక్క వేగంవంటి వేగంతో; పఱచి= పరుగెత్తి (ఎగిరి); ఆ, రెంటినిన్= ఆ తాబేటిని, ఏనుగును; కాంచి= చూచి.

తాత్పర్యం: 'ఈవిధంగా అన్నదమ్ములిద్దరు ఒండొరుల కిచ్చుకొన్న శాపాలచేత, మూడామడల పొడవు, పది ఆమడల పరిధి కల తాబేలును, ఆరామడలపొడవు, పండ్రెండామడల వెడల్పు గల ఏనుగును అయి క్రమంగా (తాబేలు) చెరువులోను (ఏనుగు) అడవిలోను ఉండి పూర్వజన్మంలోని విరోధంతో తమలో తాము ఎల్లప్పుడూ ఒండొంటితో కలియబడి పోరుతూఉంటాయి. ఆ తాబేలు, ఆ ఏనుగు నీకు తినదగిన ఆహారం సుమా! వెళ్ళుము. నీపని నెరవేరుగాక!' అని పలుకగా గరుడడు మనస్సుయొక్క వేగంవంటి వేగంతో ఎగిరి ఆ రెండింటిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చఱచి యొకచేతఁ గూర్మముఁ।
బెఱచేత గజంబుఁ బట్టి పెనఁచి ఖగేంద్రుం
డిఱికికొని గగనవీథిం।
బఱచె వియచ్చరవిమానపంక్తులు దూలన్. 68

ప్రతిపదార్థం: చఱచి= ఆక్రమించి; కొట్టి; ఒక, చేతన్= ఒకచేత్తో; కూర్మమున్= తాబేటిని; పెఱ, చేతన్= వేరొకచేత్తో; గజంబున్= ఏనుగును; పట్టి= పట్టుకొని; పెనఁచి= చుట్టుకొనేట్లుచేసి; ఖగ+ఇంద్రుండు= పక్షి శ్రేష్ఠు డయిన గరుత్మంతుడు; ఇఱికికొని అణగేటట్లు అదిమి; గగనవీథిన్= ఆకాశమార్గంలో; వియత్+చర, విమాన, పంక్తులు= ఆకాశంలో సంచరించే

దేవతలయొక్క విమానాల వరుసలు; తూలన్= సంచలించేట్లుగా; పఱచెన్= ఎగిరాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు పక్షి అవటంవల్ల రెక్కలతో ఏనుగును, తాబేటిని ఆక్రమించి ఒకచేత్తో (పాదంతో) తాబేటిని, వేరొకదానితో ఏనుగును పెనవేసి నొక్కి పట్టుకొని, ఆకాశంలో సంచరించే దేవతల విమానాల వరుసలు సంచలించేటట్లు ఎగిరాడు.

క. కనకవ్రతతీవితతులఁ ।
బెనఁగిన సురభూరుహములఁ బెద్దయు బెడఁగై
తనరిన యలంబతీర్థం ।
బున కరిగె నగంబు లొక్కమొగి గ్రక్కదలన్. 69

ప్రతిపదార్థం: కనక, వ్రతతీ, వితతులన్= సంపంగితీగల సమూహాలతో; పెనఁగిన= అల్లుకొని ఉండే; సుర, భూరుహములన్= దేవతా (కల్ప) వృక్షాలతో; పెద్దయున్= అధికంగా; బెడఁగు+ఐ= మనోహరమై; తనరిన= ప్రకాశించిన; అలంబ తీర్థంబునకున్ = అలంబ మనే పేరున్న తీర్థానికి; నగంబులు= కొండలు; ఒక్కమొగిన్= ఒక్కసారిగా; గ్రక్కదలన్= (కదలగా, కదలగా) మిక్కిలి కదులుతుండగా; అరిగెన్= వెళ్ళినాడు.

తాత్పర్యం: సంపంగితీగలసమూహంతో అల్లుకొని ఉన్న దేవతావృక్షాలతో ఎక్కువగా మనోహర మై ప్రకాశిస్తున్న అలంబం అనే పేరున్న తీర్థానికి కొండలు మిక్కిలి కంపిస్తూ ఉండగా వెళ్లాడు.

వ. అందు రోహిణంబను పాదపోత్తమంబు గరుడనిం గని సంభావించి 'శతయోజనాయతంబైనమదీయ శాఖపై నుండి యిగ్గజకచ్ఛపంబుల భక్షించి పో' మ్మనిన గరుడండు 'నట్ల చేయుదు' నని యమ్మహాశాఖపై నూఁద సమకట్టి, యందు. 70

ప్రతిపదార్థం: అందున్= ఆపర్వతంలో; రోహిణంబు+అను= రోహిణమనే పేరున్న; పాదప+ఉత్తమంబు= వృక్ష శ్రేష్ఠం (పెద్దచెట్టు); గరుడనిన్= గరుత్మంతుడిని; కని= చూచి; సంభావించి= ఆదరించి (గౌరవించి); శత, యోజన+ఆయతంబు+ఐన= వందయోజనాల పొడవు ఉండే; మదీయ శాఖపైన్= నాకొమ్మపై; ఉండి= కూర్చుండి; ఈ, గజ, కచ్ఛపంబులన్= ఈఏనుగును, తాబేటిని; భక్షించి, పొమ్ము= తిని వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; గరుడండును= గరుత్మంతుడును; అట్లు+అ చేయుదున్, అని= ఆవిధంగానే చేస్తానని; ఆ, మహత్, శాఖపైన్= ఆ గొప్ప చెట్టుకొమ్మపై; ఊఁదన్, సమకట్టి= ఆధారంగా చేసికొని నిలబడటానికి నిశ్చయించి; అందున్= ఆ కొమ్మపై.

తాత్పర్యం: ఆ పర్వతంలో రోహిణము అనే వృక్షశ్రేష్ఠం గరుడుని చూచి గౌరవించి, 'వందామడల పొడవు గల నాకొమ్మపై నిల్చి ఈ ఏనుగును, తాబేటిని తిని వెళ్ళు' మని పలుకగా గరుడుడు అట్లే చేస్తా నని ఆపెద్ద కొమ్మపై నిలబడటానికి పూని ఆ కొమ్మపై (తరువాతి పద్యంతో అన్వయం.

క. పాదంబులు పెట్టుడుఁ ద ।
త్పాదపఘనశాఖ విఱిఁగి బల్లన నుచ్చై
ర్నాదమున దిక్కు లద్రువఁగ ।
భేదిల్లె విహంగతతులు భీతిం బఱవన్. 71

ప్రతిపదార్థం: పాదంబులు= కాళ్ళు; పెట్టుడున్= మోపినవెంటనే; తద్, పాదపఘన, శాఖ= ఆరోహిణ మనే చెట్టుయొక్క గొప్ప కొమ్మ; విఱిఁగి; బల్లనన్= బల్లు మనేట్లుగా; ఉచ్చైః, నాదమునన్= పెద్దధ్వనితో; దిక్కులు; అద్రువఁగన్= కంపించగా; విహంగతతులు= పక్షుల సమూహాలు; భీతిన్= భయంతో; పఱవన్= పరుగెత్తగా, (ఎగురగా); భేదిల్లెన్= విరిగింది.

తాత్పర్యం: ఆగరుత్మంతుడు పాదాలు మోపగానే ఆ రోహిణ మనే వృక్షంయొక్క గొప్పకొమ్మ ఫెళ్ళుమనేటట్లుగా పెద్దధ్వనితో విరిగి,

దిక్కులు కంపించగా, పక్షులసమూహాలు భయంతో ఎగిరిపోగా విరిగి పోయింది.

వ. అమ్మహాశాఖ నవలంబించి తలక్రిం దై యాదిత్యకిరణంబులు తమ కాహారంబుగాఁ దపంబు సేయుచున్న వాలఖిల్యమహామునిగణంబులం జూచి, యిది భూమిపయింబడిన నిమ్మునులకు బాధయగు నని దానిం గఱచికొని, గజకచ్ఛపంబులం గరంబుల నిఱికికొని, గరుడండు గగనంబునం బఱచి, తనకు నూఁద నిమ్మగు ప్రదేశం బెందునుం గానక గంధమాదనంబు నకుం జని, యందుఁ దపంబు సేయుచున్న కశ్యపుం గనుంగొని మ్రొక్కిన. 72

ప్రతిపదార్థం: ఆ+మహత్, శాఖన్= ఆగొప్పకొమ్మను: అవలంబించి= పట్టుకొని; తల, క్రిందు+ఐ= తలక్రిందిభాగాన ఉండేటట్లుగా; ఆదిత్య, కిరణంబులు= సూర్యుని యొక్క కిరణాలు; తమకున్, ఆహారంబు, కాన్= భుజించేపదార్థం కాగా; తపంబు, చేయుచున్న, వాలఖిల్య, మహత్, ముని, గణంబులన్= వాలఖిల్యు లనే పేరున్న గొప్పమునులసమూహాలను; చూచి; ఇది= ఈవిరిగిన కొమ్మ; భూమి, పయిన్, పడినన్= భూమిమీద పడితే; ఈ+మునులకున్= తలక్రిందుగా వ్రేలాడుతూ తపస్సు చేస్తున్న ఈ మునులకు; బాధ+అగున్+అని; దానిన్= ఆవిరిగినకొమ్మను; కఱచి కొని= నోటితో పట్టుకొని; గజ, కచ్ఛపంబులన్= ఏనుగును, తాబేటిని; కరంబులన్= చేతులలో; ఇఱికికొని= అడగునట్లుచేసి, అదిమిపట్టుకొని; గరుడండు; గగనంబునన్= ఆకాశంలో; పఱచి= ఎగురుతూ వెళ్ళి, తనకున్, ఊఁదన్= నిలవటానికి; ఇమ్ము+అగు, ప్రదేశంబు= తగినచోటును; ఎందునున్, కానక= ఎక్కడను చూడక; గంధమాదనంబునకున్= గంధమాదన మనే పర్వతానికి; చని= వెళ్ళి; అందున్= ఆపర్వతంలో; తపంబు+చేయుచున్న; కశ్యపున్= తండ్రి అయిన కశ్యపుడిని; కనుంగొని= చూచి; మ్రొక్కినన్= నమస్కరించగా.

తాత్పర్యం: ఆగొప్పకొమ్మను పట్టుకొని తలక్రిందుగా ఉండి సూర్యుడి కిరణాలే తమకు భోజనంగా తపస్సు చేస్తున్న వాలఖిల్యు లనే గొప్ప మునుల సమూహాన్ని చూచి ఈ కొమ్మ భూమిపై పడితే 'ఈమునులకు బాధ కలుగుతుం' దని ఆ కొమ్మను నోటితో కరచుకొని ఏనుగును, తాబేటిని చేతులలో అదిమిపట్టుకొని గరుడడు ఆకాశంలోనికి ఎగిరి తనకు నిలవటానికి వీలయినచోటు ఎచ్చటా కానలేక గంధమాదన పర్వతానికి వెళ్ళి అక్కడ తపస్సు చేస్తున్న తండ్రి అయిన కశ్యపుడిని చూచి నమస్కరించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కనకమహీధరప్రతిమకాయు, మహాజవనిర్జితప్రభం
జను, నవిచింత్య భూరిబలసత్త్వసమన్వితు, దీప్తహవ్యవా
హనసము, వైనతేయునిఁద దాస్యగతద్రుమశాఖ నున్న య
త్యనఘుల వాలఖిల్యులను, నమ్మునినాథుఁడు చూచి నెమ్మితోన్.73

ప్రతిపదార్థం: కనక, మహీధర, ప్రతిమ, కాయున్= బంగారుకొండ అయిన మేరు పర్వతంతో సమాన మైన శరీరం కలవాడిని; మహత్, జవ, నిర్జిత, ప్రభంజనున్= గొప్పవేగంచేత జయింపబడిన వాయువు కల; అవిచింత్య, భూరి, బల, సత్త్వ సమన్వితున్= ఊహింపరాని గొప్పబలంతో, శక్తితో కూడిన వాడిని; దీప్త హవ్యవాహన, సమున్= వెలుగుతున్న అగ్నితో సమాను డయిన వాడిని; వైనతేయునిన్= వినత యొక్క కుమారు డయిన గరుత్మంతుడిని; తద్, ఆస్య, గత, ద్రుమ, శాఖన్= ఆ గరుత్మంతుడియొక్క నోటిలో ఉండే చెట్టుకొమ్మకు; ఉన్న; అతి+అనఘులన్= ఎట్టిపాపం లేనివారిని; మిక్కిలి గొప్పవారిని; వాలఖిల్యులనున్= వాలఖిల్యు లనే పేరున్న మునులను; ఆ+ముని, నాథుడు= ఆమునులకు నాయకు డయిన కశ్యపుడు; నెమ్మితోన్= దయతో; చూచి.

తాత్పర్యం: మేరుపర్వతంతో సమాన మయిన శరీరం గల వాడిని, తనకు గలగొప్పవేగంతో జయింపబడిన వాయువు గలవాడిని, ఊహింపరాని

గొప్పబలంతోను, శక్తితోను కూడినవాడిని, వెలుగుతున్న అగ్నితో సమానుడైనవాడిని, వినతాకుమారు డయిన గరుత్మంతుని, అతనినోటిలో ఉన్న చెట్టుకొమ్మకు వేలాడుతున్న పాపరహితు లైన వాలఖిల్యు లనే పేరున్న మునులను కశ్యపుడు దయతో చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

వ. ‘ఇగ్గరుడండు భువనహితమహారంభుండు బలసమన్వితుండు, మీకు బాధయగునని యిత్తరుశాఖ విడువనేరకున్న వాఁడు; వీనిం గరుణించి మీరొండుకడ కరుగుం’ డనిన వాలఖిల్యులు కశ్యపుప్రార్థనం జేసి దాని విడిచి హిమవంతంబునకుం జనిరి; గరుడండును ముఖనిక్షిప్తశాఖాస్ఖలిత వచనుం డగుచుఁ దండ్రి కిట్లనియె. 74

ప్రతిపదార్థం: ఈ+గరుడండు= ఈ గరుత్మంతుడు; భువన, హిత, మహత్+ ఆరంభుండు= లోకాలకు మేలు కలిగించే గొప్పప్రయత్నం కలవాడు; బలసమన్వితుండు= బలంతో కూడినవాడు; మీకున్= చెట్టుకొమ్మకు తలక్రిందుగా వ్రేలాడుతూ తపస్సు చేసికొంటున్న మీకు; బాధ, అగును+అని; ఈ తరు, శాఖన్= ఈ చెట్టుకొమ్మను; విడువన్=, నేరక+ఉన్నవాఁడు= విడిచిపెట్ట లేక ఉన్నవాడు; వీనిన్= కొమ్మతోపాటు మిమ్మల్ని ఇక్కడికి తెచ్చిన ఈగరుత్మంతుడిని; కరుణించి= దయదలచి; మీరు+ఒండు, కడకున్= వేరొకచోటికి; అరుగుండు= వెళ్ళండి, అనినన్= అని చెప్పగా; వాలఖిల్యులు= వాలఖిల్యు లనే మునులు; కశ్యపు, ప్రార్థనన్ చేసి= కశ్యపునియొక్క కోరికచేత; దానిన్, విడిచి= ఆకొమ్మను విడిచి; హిమవంతంబునకున్= హిమవంత మనే పర్వతానికి; చనిరి= వెళ్ళారు; గరుడండును; ముఖ, నిక్షిప్త, శాఖా, స్ఖలిత, వచనుండు+అగుచున్= నోటిలో ఉంచుకొన్న కొమ్మవలన తొట్రుపాటుతో కూడిన మాటలు గలవా డవుతూ; తండ్రికిన్+ ఇట్లు+ అనియెన్= తండ్రి అయిన కశ్యపుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ‘ఈగరుత్మంతుడు లోకాలకు మేలుచేసే గొప్ప ప్రయత్నం కలవాడు. బలంతో కూడినవాడు. మీకు బాధకలుగుతుం దని నోటితో కరచుకొని ఉన్న ఈ చెట్టుకొమ్మను విడువజాలకున్నాడు. వీడిని అనుగ్రహించి మీరు ఇంకొకచోటికి వెళ్ళండి’ అని పలుకగా వాలఖిల్యమునులు కశ్యపుడి వేడికోలుతో ఆకొమ్మను విడిచి హిమవత్పర్వతానికి వెళ్ళారు. గరుడడును ముఖంలో ఉంచబడిన కొమ్మచేత తొట్రుపాటుతో కూడిన వాక్యాలు కలవాడవుతూ తండ్రి అయిన కశ్యపుడితో ఇట్లా పలికాడు.

క. ధరణీసురవిరహిత మగు।
నరణ్యదేశంబు నాకు నానతియిం డి
త్తరుశాఖ విడువవలయును।
కరము నిరోధ మిది యనినఁ గశ్యపుడనియెన్. 75

ప్రతిపదార్థం: ధరణీసుర, విరహితము+అగు= బ్రాహ్మణులు లేనిదైన; అరణ్యదేశంబు= అడవి ప్రదేశాన్ని; నాకున్; ఆనతి+ఇండు= తెలియజేయండి (ఆజ్ఞాపించండి); ఈ, తరుశాఖన్= ఈ చెట్టుకొమ్మను; విడువన్‌వలయును; ఇది= ఈకొమ్మ; కరమున్= మిక్కిలి; నిరోధము= ఆటంకం; అనినన్= అని చెప్పగా; కశ్యపుండు+ అనియెన్= కశ్యపుడు చెప్పాడు.

తాత్పర్యం: బ్రాహ్మణులు లేని అడవిప్రాంతాన్ని నాకు తెలియజేయండి. ఈకొమ్మను అక్కడ విడిచిపెట్టాలి. ఇది నాకు మిక్కిలి ఆటంకం. అని చెప్పగా కశ్యపుడు ఇట్లా చెప్పాడు.

క. హిమశైలకందరాభా।
గముకడ నిష్పురుషనగము కల దచ్చో నీ
ద్రుమశాఖ విడువు మది దా।
నమానుష మగమ్య మీశ్వరాదుల కైనన్. 76

ప్రతిపదార్థం: హిమ, శైల, కందరా, భాగము, కడన్= మంచుకొండయొక్క గుహయొక్క ప్రాంతం దగ్గర; నిష్పురుషనగము= నిష్పురుష మనే కొండ;

కలదు; అచ్చోన్= ఆకొండమీద; ఈ, ద్రుమ, శాఖన్,= ఈచెట్టు కొమ్మను; విడువుము; అది, తాను= ఆకొండ; అమానుషము= మానవాతీతం (మనుష్యకృతంకానిది); ఈశ్వర+ఆదులకున్+ ఐనన్= ఈశ్వరుడు మొదలయిన వారికికూడ; అగమ్యము= పొందరానిది;

తాత్పర్యం: హిమాలయంయొక్క గుహాప్రాంతంలో నిష్పురుషం అనే కొండ ఉన్నది. అక్కడ ఈ చెట్టుకొమ్మను విడువుము. అది మానవాతీతం. ఈశ్వరుడు మొదలయిన వారికికూడ చొరరానిది.

విశేషం: 'హిమశైలకందరాభాగముకడ' - అన్నప్పుడు హిమవత్పర్వతగుహా సమీపంలో నిష్పురుష పర్వతం ఉన్నదని అర్థం వస్తున్నది. కాని, అక్కడ అది లేదు. అందువలన 'దేశవిరోధమనే దోషం ఏర్పడుతుందని కొందరు అంటారు. 'హిమరుద్ధకందరాభాగముకడ' అని ఉండాలని భావిస్తారు. "తతో నిష్పురుషం శైలం - హిమసంరుద్ధకందరం' అని మూలం.

వ. 'అది యిచ్చటికి లక్షయోజనంబులు గల దరుగు' మనిన గరుడండును మనోవేగంబునం బఱచి యా నిష్పురుషనగంబునం దత్తరుశాఖ విడిచి హిమవంతంబుమీఁదికిం బోయి గజకచ్ఛపంబుల భక్షించి, మహాసత్త్వ సంపన్నుం డై నాకలోకంబున కెగయ సమకట్టి పక్షవిక్షేపంబుఁ జేసిన.77

ప్రతిపదార్థం: అది= ఆకొండ; ఇచ్చటికిన్= ఈగంధమాదనపర్వతానికి; లక్ష యోజనంబులు, కలదు= లక్ష ఆమడలదూరం ఉన్నది; అరుగుము= వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; గరుడండును, మనస్+వేగంబునన్= మనస్సుయొక్క వేగంవంటి వేగంతో; పఱచి= పరుగెత్తి(ఎగిరి); ఆ, నిష్పురుష, నగంబునన్= ఆనిష్పురుష మనే కొండలో; తద్, తరు, శాఖన్= ఆ రోహిణి వృక్షం యొక్క కొమ్మను; విడిచి= వదలిపెట్టి; హిమవంతంబుమీఁదికిన్= హిమాలయపర్వతంపైకి; పోయి= వెళ్ళి; గజకచ్ఛపంబులన్= ఏనుగును, తాబేటిని; భక్షించి= తిని; మహత్, సత్త్వసంపన్నుండు+ఐ= గొప్పబలంతో కూడిన వాడయి; నాకలోకంబునకున్= స్వర్గలోకానికి; ఎగయన్= ఎగరటానికి; సమకట్టి= నిశ్చయించి, పూని; పక్ష, విక్షేపంబున్, చేసినన్= రెక్కలు విదల్చటం చేయగా.

తాత్పర్యం: 'ఆకొండ ఈగంధమాదనపర్వతానికి లక్షఆమడలదూరంలో ఉన్నది. వెళ్ళుము' అని తండ్రి పలుకగా గరుడడు మనోవేగంతో ఎగిరి ఆనిష్పురుషపర్వతంలో ఆచెట్టుకొమ్మను విడిచి హిమాచలంమీదికి పోయి ఏనుగును తాబేటిని తిని గొప్పబలంతోకూడినవాడై స్వర్గలోకానికి ఎగురబూని రెక్కలు విదిలించగా.

గరుడం డమృతహరణార్థం బెగయుట - (సం. 1-26-37)

క. ఘనపక్షానిలచలితా ।
వనిరుహములవలనఁ దొరఁగు వరపుష్పచయం
బనిమిషజయార్థ మరిగెడు ।
వినతాసుతుమీఁదఁ బుష్పవృష్టియ పోలెన్. 78

ప్రతిపదార్థం: ఘన, పక్ష+అనిల, చలిత+అవని, రుహముల వలనన్= గొప్పవైన రెక్కలయొక్క గాలిచేత కదలినచెట్లనుండి; తొరఁగు= జారిపడే; వర, పుష్ప, చయంబు= శ్రేష్ఠమైన పూలసముదాయం; అనిమిష, జయ+అర్థము= దేవతలను జయించటం కొరకు; అరిగెడు= వెళ్ళే; వినతా, సుతు, మీఁదన్= వినతకొడు కయిన గరుత్మంతుడిమీద; పుష్ప, వృష్టి+అ, పోలెన్= పూలవానవలె ఉండింది.

తాత్పర్యం: గొప్ప వయిన రెక్కలనుండి పుట్టిన గాలివలన కదలిన చెట్లనుండి శ్రేష్ఠములయిన పూలసమూహాలు దేవతలను జయించటానికి వెళ్ళేగరుత్మంతుడిపై పూలవానవలె ఒప్పాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. పూలవానయేమో అన్నట్లు ఉండిం దని భావం.

వ. ఇట్లమృతహరణార్థంబు గరుడండు గగనంబున కెగసిన, నట దేవలోకంబునందు. 79

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అమృత, హరణ+అర్థంబు= అమృతాన్ని తేవటానికి గరుడండు; గగనంబునకున్= ఆకాశానికి; ఎగసినన్= ఎగురగా; అట; దేవలోకంబునందున్= అచ్చట దేవతలలోకంలో.

తాత్పర్యం: ఈ విధంగా అమృతాన్ని తేవటానికి గరుడడు ఆకాశంలోనికి ఎగురగా అక్కడ స్వర్గలోకంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

మాలిని.

సురపతిసభఁ జూడం జూడ నంగారవృష్టుల్
గురిసెఁ గులిశధారల్ గుంఠితం బయ్యెఁ, దిక్కుం
జరమదము లడంగెన్, సర్వదిక్పాలకాంతః
కరణములు భయోద్వేగంబునన్ సంచలించెన్. 80

ప్రతిపదార్థం: సుర, పతి, సభన్= దేవతలరా జయిన ఇంద్రునిసభలో; చూడన్, చూడన్= చూడగాచూడగా; అంగార, వృష్టుల్= నిప్పుకణాలవర్షాలు; కురిసెన్= కురిశాయి; కులిశధారల్= వజ్రాయుధంయొక్క అంచులు; కుంఠితంబు+అయ్యెన్= మొక్కపోయాయి (బండబారాయి); దిక్, కుంజర, మదములు= దిక్కులలోని ఏనుగుల గర్వాలు; అడంగెన్= అణగారాయి; సర్వ, దిక్, పాలక+అంతః, కరణములు= అన్ని దిక్కులయొక్క పాలకులయొక్క (అందరుదిక్పాలకుల) మనస్సులు; భయ+ఉద్వేగంబునన్= భయంయొక్క ఆవేశంతో; సంచలించెన్= కంపించాయి.

తాత్పర్యం: చూస్తుండగానే దేవేంద్రునిసభలో నిప్పుకణాలవర్షాలు కురిశాయి. వజ్రాయుధంయొక్క అంచులు మొక్కపోయాయి. దిక్కులలోని ఏనుగులగర్వాలు అణగారాయి; దిక్పాలకులమనస్సులు భయావేశంతో క్షోభించాయి.

విశేషం: ముపర్ణకాంత మవటంచేత 'ధారలు' బహువచనాంత మైన విశేషణమైన 'కుంఠితం' ఏకవచనంలో ఉండవచ్చు. మాలినీ వృత్తంలో పాదానికి న, న, మ, య, య - అనేగణాలు ఉంటాయి. 9వఅక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. దేవలోకంలో ప్రవేశించే గరుత్మంతుడివలన దేవసభలో కలిగిన ఉత్పాతాలు ఒక మాలికగా ఇందులో నన్నయ వర్ణించాడు. (ఇవి గరుడ విజయాన్ని వ్యంగ్యంగా సూచిస్తున్నాయి.) అంగారవృష్టులు భావికథలో గరుత్మంతుడు చేసే యుద్ధాన్నీ, మిగిలిన ఉత్పాతాలు క్రమంగా-ఇంద్రుడు గరుడుడిపై ప్రయోగించే వజ్రాయుధం నిష్ఫలంకావటాన్నీ, సర్వలోక విజేతగా గరుత్మంతుడు గుర్తింపబడటాన్నీ, ఇంద్రుడివలె గరుత్మంతుడు పక్షికులానికి ఇంద్రుడు కావటాన్నీ ధ్వనింపచేస్తున్నట్లు నిబంధించటం నన్నయరచనలోని వస్తుధ్వని, గరుత్మంతుడి సురలోకవిజయానికీ, అమృత హరణానికీ, నారాయణ కరుణాప్రాప్తికీ, ఇంద్రుడి స్నేహానికీ, అమృతాన్ని ఇంద్రుడికి ఉపాయంతో తిరిగిఅందించటానికీ, వినతకూ గరుత్మంతుడికీ స్వాతంత్ర్యం లభించటానికీ నాందివలె రాణించే ఈపద్యాన్ని విశేషవృత్తమైన 'మాలిని'తో నన్నయ రచించి పఠితల మనస్సులు వస్తుధ్వనిని ఆస్వాదించేటట్లు హెచ్చరిస్తున్నారు. భరతుడు మాలినీవృత్తాన్ని 'నాందీముఖి' అన్నాడు. నన్నయ దానిని సార్థకం చేశాడు. (సంపా.)

వ. ఇట్టి మహోత్పాతంబులు పుట్టిన, సురపతి బృహస్పతిం జూచి, 'యిది యేమి నిమిత్తం?' బని యడిగిన, దాని నంతయు నెఱింగి బృహస్పతి సురపతి కి ట్లనియె. 81

ప్రతిపదార్థం: ఇట్టి; మహత్, ఉత్పాతంబులు= గొప్ప చెడ్డ శకునాలు; పుట్టినన్= పుట్టగా; సురపతి= దేవేంద్రుడు; బృహస్పతిన్+ చూచి= గురు వైన బృహస్పతిని చూచి; ఇది, ఏమి; నిమిత్తంబు= కారణం; అని; అడిగినన్; దానిన్+అంతయున్= ఆవిషయా న్నంతటిని; ఎఱింగి= తెలిసికొని; బృహస్పతి; సురపతికిన్= ఇంద్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ఇటువంటి గొప్పదుశ్శకునాలు కలుగగా దేవేంద్రుడు దేవతాగురు వైన బృహస్పతిని చూచి 'ఈ అపశకునాలకు కారణ మేమిటి?' అని అడిగాడు. ఆవిషయ మంతా తెలిసికొని బృహస్పతి దేవేంద్రుడికి ఇట్లా చెప్పాడు.

సీ. బ్రహ్మణ్యుఁ డగు కశ్యపబ్రహ్మవరమున।
వినతకుఁ బుట్టిన యనఘమూర్తి
వాలఖిల్యులదయ వరపక్షికులమున।
క్రిందుఁ డై పరఁగిన యిద్ధతేజుఁ,
డుదధిలో నున్న యత్యుగ్రనిషాదుల।
నారంగ మ్రింగిన ఘోరవీరుఁ,
డిభకచ్ఛపముల రోహిణశాఖతో నెత్తి।
కొని దివిఁ బఱచిన యనిలవేగి.

తే. వీఁగి తనతల్లిదాస్యంబు నీఁగఁబూని।
తడయ కమృతంబు గొనిపోవఁ గడఁగి వచ్చెఁ;
గామరూపసంపన్నుండు, గామగమనుఁ।
డతఁడు నీకు నసాధ్యుండు శతమఖుండ! **82**

ప్రతిపదార్థం: శత, మఖుండ= ఇంద్రుడా! బ్రహ్మణ్యుఁడు+అగు= బ్రహ్మజ్ఞానం కలిగిన; కశ్యప బ్రహ్మ, వరమునన్= కశ్యపు డనే ప్రజాపతియొక్క వరంచేత; వినతకున్; పుట్టిన; అనఘమూర్తి= పాపంలేనట్టి వ్యక్తి; వాలఖిల్యుల, దయన్= వాలఖిల్యు లనే మునుల దయచేత; వర, పక్షి, కులమునకున్= శ్రేష్ఠ మయిన పక్షులయొక్క కులానికి; ఇంద్రుఁడు+ఐ= రాజై; పరఁగిన= ప్రసిద్ధి పొందిన; ఇద్ధ, తేజుఁడు= ప్రకాశించే ప్రతాపం కలవాడు; ఉదధిలోన్+ ఉన్న= సముద్రంలో ఉండే; అతి+ఉగ్ర, నిషాదులన్= మిక్కిలి భయంకరు లైన బోయవాళ్ళను; ఆరంగ, మ్రింగిన= పూర్తిగా తినినట్టి; ఘోర, వీరుఁడు= భయంకరు డైన వీరుడు; ఇభ, కచ్ఛపములన్= ఏనుగును, తాబేటిని; రోహిణశాఖతోన్= రోహిణవృక్షంయొక్క కొమ్మతోపాటుగా; ఎత్తికొని= ఎత్తికొని పట్టుకొని; దివిన్= ఆకాశంలో; పఱచిన= (పరుగెత్తిన) ఎగిరిన; అనిల, వేగి= గాలియొక్క వేగం వంటి వేగం కలవాడు; వీఁగి= ఉత్సాహపడి; తన, తల్లి; దాస్యంబున్= తనతల్లి అయిన వినతయొక్క దాసితనాన్ని; ఈఁగన్+పూని= తొలగించటానికి నిశ్చయించి; తడయక= ఆలస్యంచేయక; అమృతంబు, కొని, పోవన్= అమృతాన్ని తీసికొనిపోవటానికి; కడఁగి, వచ్చెన్= పూని వచ్చాడు; కామ, రూప, సంపన్నుండు= కోరుకొన్నరూపం ధరించ కలవాడు; కామ, గమనుఁడు= కోరికకు తగినట్లుగా వెళ్ళేవాడు; నీకున్; అతఁడు= ఆవినతకొడుకు; అసాధ్యుండు= జయింపరానివాడు.

తాత్పర్యం: బ్రహ్మజ్ఞానం కలిగిన కశ్యపు డనే ప్రజాపతి వరంవలన వినతకు పుట్టిన పాపరహితుడు ఈగరుత్మంతుడు. ఇతడు వాలఖిల్యులనే మహర్షుల కృపచేత శ్రేష్ఠమయిన పక్షికులానికి రాజుగా ప్రసిద్ధిపొందిన గొప్ప ప్రభావం కలవాడు. సముద్రంలోపల ఉండే మిక్కిలి భయంకరు లైన బోయవాళ్ళను పూర్తిగా తినివేసిన ఘోర మైన వీరుడు. ఏనుగును, తాబేటిని రోహిణ వృక్షపు కొమ్మతోపాటు పట్టుకొని ఆకాశంలో ఎగిరిన వాయువేగం కలవాడు. ఉత్సాహపడి తనతల్లియొక్క దాసితనాన్ని పోగొట్టటానికి ఆలస్యం చేయకుండా అమృతం తీసికొనిపోవటానికి సాహసించి వచ్చాడు. ఇచ్ఛవచ్చిన రూపం ధరించగలిగినవాడు. ఇచ్ఛవచ్చినట్లుగా సంచరించేవాడు. ఓఇంద్రుడా! ఈగరుత్మంతుడు నీకు జయింపరానివాడు.

వాలఖిల్యుల వృత్తాంతము (సం. 1-27-4)

వ. అగ్గరుడని మాహాత్మ్యంబు నీవు నెఱుంగుదు; వది యెట్లనినఁ దొల్లి కశ్యపప్రజాపతి పుత్త్రార్థి యై భవత్ప్రభృతులైన దేవగణంబులను, వాలఖిల్యప్రముఖు లైన మహామునిగణంబులను దనకు సహాయులనుగాఁ బడసి పుత్త్రకామేష్టి సేయునాఁడు నీవు నీబలంబునకుం దగినయిద్మభారంబు

మోచికొని యశ్రమంబున వచ్చువాఁడ వై, యల్పకుశపలాశేధ్మభారంబులు మోచికొని వడవడ వడంకుచు వచ్చువారి, నల్పసత్త్వుల, నంగుష్ఠప్రమాణ దేహుల; ననవరతోపవాస కృశీభూత శరీరుల, వాలఖిల్యమహామునులం జూచి నగిన, నమ్మునులు సిగ్గుపడి కడు నలిగి. 83

ప్రతిపదార్థం: ఆ+గరుడని, మాహాత్మ్యంబు= ఆగరుత్మంతుడి గొప్పతనాన్ని; నీవునున్= నీవుకూడ; ఎఱుంగుదువు= తెలియుదువు; అది; ఎట్లు+అనినన్= ఏవిధంగా నంటే; తొల్లి= పూర్వం; కశ్యప, ప్రజాపతి= కశ్యపబ్రహ్మ; పుత్ర+అర్థి+ఐ= కొడుకులను కోరేవాడై; భవత్, ప్రభృతులు+ఐన= నీవు మొదలుగా ఉండే; దేవగణంబులను= దేవతల సమూహాలను; వాలఖిల్య, ప్రముఖులు+ఐన= వాలఖిల్యులు మొదలగువారైన; మహత్+ముని గణంబులన్= గొప్పవారైన ఋషులయొక్క సమూహాలను, తనకున్= యజ్ఞంచేయబోయే తనకు (కశ్యపుడికి); సహాయులను కాన్= తోడ్పడేవాళ్ళుగా; పడసి= పొంది; పుత్ర, కామ+ఇష్టి, చేయువాఁడు= పుత్రకామేష్టిని చేసే వాడు; నీవు; నీ, బలంబునకున్= నీయొక్క శక్తికి; తగిన= సరిపడిన; ఇధ్మ, భారంబు= కట్టెల (సమిధల) బరువును; మోచికొని; అశ్రమంబునన్= శ్రమలేకుండా; వచ్చు, వాఁడవు+ఐ; అల్ప, కుశ, పలాశ+ఇధ్మ, భారంబులు= తక్కువయిన దర్భ, మోదుగకట్టెల బరువులను; మోచికొని; వడవడ= వణకటంలో ధ్వన్యనుకరణం; వడంకుచున్= వణికిపోతూ; వచ్చు, వారిన్= వచ్చేటివాళ్ళను; అల్పసత్త్వులన్=తక్కువబలం గలవారిని; అంగుష్ఠప్రమాణ దేహులన్= బొటనవ్రేలంత కొలతఉన్న శరీరాలు కలవాళ్ళను; అనవరత+ఉపవాస, కృశీభూత, శరీరులన్= ఎల్లప్పుడూ ఉపవాసాలచేత (ఒకరోజంతా భోజనం చేయకుండా ఉండి మరునాటిఉదయం భుజించటం ఉపవాస మనబడుతుంది) చిక్కినశరీరం కలిగినవారిని; వాలఖిల్య, మహత్, మునులన్= వాలఖిల్యులనే గొప్పమునులను; చూచి; నగినన్= నవ్వగా; ఆ+మునులు= ఆవాలఖిల్యమునులు; సిగ్గుపడి; కడున్, అలిగి= మిక్కిలి కోపించి.

తాత్పర్యం: ఆ గరుడుని గొప్పతనం నీవుకూడ ఎరుగుదువు. అది ఎట్లంటే: పూర్వం కశ్యప ప్రజాపతి పుత్రులను కోరువాడై నీవుమొదలుగా ఉన్న దేవతలసమూహాలను, వాలఖిల్యులు మొదలుగా ఉన్న గొప్పమునుల సమూహాలను తనకు తోడ్పడే వాళ్ళనుగా పొంది (పుత్రులను పొందటానికై చేసే) పుత్రకామేష్టి అనే యజ్ఞాన్ని చేసేటప్పుడు నీవు నీబలానికి తగ్గ కట్టెల(సమిధల) మోపు మోసికొని శ్రమలేకుండా (అనాయాసంగా) వస్తూ స్వల్పమైన దర్భలయొక్క, మోదుగుకట్టెలయొక్క మోపులను మోసికొని శ్రమచేత వడవడవణకుతూ వచ్చే హీనబలులను, బొటనవ్రేలంతమాత్రం కొలత ఉండే దేహాలతోకూడినవారున్నూ నిరంతరం ఉపవాసం చేస్తూ ఉండటంచేత చిక్కినమేనులు కలవారున్నూ అయిన వాలఖిల్యులనే గొప్పమునులను చూచి నవ్వగా ఆమునులు సిగ్గుపడి మిక్కిలి కోపించి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **రణవిజయుఁ డనల తేజుం।**
డణిమాదిగుణాఢ్యుఁ డుదితుఁ డయ్యెడు వీరా
గ్రణి శతమఖుకంటెను శత।
గుణవీర్యుం డైన పుత్త్రకుం డజితుం డై. 84

ప్రతిపదార్థం: రణ, విజయుఁడు= యుద్ధంలో విజయం కలవాడు; అనల, తేజుండు= అగ్నియొక్క ప్రకాశంవంటి ప్రకాశం కలవాడు; అణిమా+ఆది, గుణ+ఆఢ్యుఁడు= అణిమ మొదలయిన గుణాలసంపద గలిగినవాడు; వీర+అగ్రణి= వీరులలో అగ్రేసరుడు; శతమఖుకంటెను= ఇంద్రుడికంటె; శతగుణవీర్యుండు+ఐన= వందరెట్లుబలం కలిగిన; పుత్త్రకుండు= కొడుకు; అజితుండు+ఐ= ఓడింపబడనివా డయి; ఉదితుఁడు+అయ్యెడున్= పుడతాడు (పుట్టగలడు).

తాత్పర్యం: యుద్ధంలో ఎప్పుడూ విజయం పొందేవాడున్నూ, అగ్నియొక్క ప్రకాశం గలవాడున్నూ, అణిమాదిగుణాలసంపద కలవాడున్నూ, వీరులలో

అగ్రభాగాన ఉండే వాడున్నూ, ఇంద్రుడికంటె వందరెట్లు బలం కలవాడున్నూ అయిన కుమారుడు జయింపరానివా డై పుట్టగలడు.

విశేషం: అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం అనేవి అష్టసిద్ధులు.

వ. వాఁడు రెండవయింద్రుం డయ్యెడు మని మహావీర్యవంతంబు లైన మంత్రంబుల వేల్చుచున్నంత, నంతయు నెఱింగి నీవు కశ్యపుపాలికిం బోయి నాకుం గరుణింపుండని వారిం బ్రార్థించినఁ గశ్యపప్రజాపతి యమ్మునుల కి ట్లనియె. 85

ప్రతిపదార్థం: వాఁడు= ఆపుట్టేవాడు; రెండవ, ఇంద్రుండు; అయ్యెడున్+ అని= అవునుగాక! అని; మహత్, వీర్యవంతంబులు+ఐన= గొప్పశక్తితో గూడిన; మంత్రంబులన్= వేదమంత్రాలతో; వేల్చుచున్+ఉన్న+ అంతన్= యజ్ఞకుండంలో హోమం చేస్తున్నసమయంలో; అంతయున్= విషయా న్నంతటిని; ఎఱింగి= తెలిసికొని; నీవు; కశ్యపుపాలికిన్= యజ్ఞం చేస్తున్న కశ్యపుడిసమీపానికి; పోయి= వెళ్ళి; నాకున్, కరుణిం పుండు= నన్ను దయచూడండి (ఇట ద్వితీయావిభక్తి అర్థంలో షష్ఠి వాడబడింది) అని; వారిన్= ఆ వాలఖిల్యులను; ప్రార్థించినన్= వేడుకొనగా; కశ్యపప్రజాపతి= కశ్యపబ్రహ్మ; ఆ, మునులకున్= ఆవాలఖిల్యమునులకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఆ పుట్టేవాడు రెండవఇంద్రుడు అగుగాక! అని గొప్పశక్తిగల మంత్రాలతో అగ్నిలో హోమం చేస్తుండగా ఈ విషయమంతా తెలిసికొని నీవు కశ్యపుని చెంతకు వెళ్ళి, నన్ను దయచూడం డని వారిని వేడగా కశ్యపబ్రహ్మ ఆవాలఖిల్యులతో ఇట్లా చెప్పాడు.

ఉ. ఉండు నితండు పద్మజు నియోగమునం ద్రిజగంబులందు నిం
ద్రుం డయి భూతరాశిఁ దన దోర్బలశక్తిఁ గడంగి కాచుచున్;

రెండవయింద్రుఁ డైన విపరీత మగున్ భువనప్రవృత్తి; మీ
రొండువిధంబు సేయు టిది యుక్తమె బ్రహ్మనియుక్తి యుండఁగన్.86

ప్రతిపదార్థం: ఇతండు= ఈయింద్రుడు; పద్మజు, నియోగమునన్= బ్రహ్మయొక్క ఆజ్ఞచేత; త్రిజగంబులందున్= మూడులోకాలలో; ఇంద్రుండు+అయి= ఇంద్రపదవి పొంది; భూతరాశిన్= ప్రాణులసమూహాన్ని; తన, దోస్+బల, శక్తిన్= తనభుజాలబలం యొక్క సామర్థ్యంతో; కడంగి= పూనుకొని; కాచుచున్= రక్షిస్తూ; ఉండున్= ఉంటాడు; రెండవ, ఇంద్రుఁడు; ఐనన్= ఏర్పడితే; భువన, ప్రవృత్తి= లోకాలయొక్కవర్తన; విపరీతము+అగున్= తారుమారవుతుంది; బ్రహ్మ, నియుక్తి= బ్రహ్మయొక్క నియోగం; ఉండఁ గన్= ఉండగా; మీరు; ఒండు, విధంబు= వేరొకపద్ధతిని; చేయుట= చేయటం; ఇది, యుక్తము+ఎ= ఇది తగునా? తగదు.

తాత్పర్యం: ఇతడు బ్రహ్మయొక్క నియమంచేత మూడులోకాలలో ఇంద్రుడుగా ఉండి జీవులసమూహాన్ని, తనబాహువులబలంయొక్క సామర్థ్యంతో కాపాడుతున్నాడు. రెండవఇంద్రుడు ఏర్పడితే లోకాలయొక్కవర్తన తారుమా రవుతుంది. బ్రహ్మయొక్క నియమం ఉండగా మీరు వేరువిధం చేయటం తగునా?(తగదు).

వ. 'మీవచనం బమోఘంబు గావున నింక నాకు నుద్భవిల్లెడు పుత్త్రుండు పక్షికులంబున కెల్ల నింద్రుం డయ్యెడు' మనికశ్యపుండు వారల నొడంబఱిచి నీయింద్రత్వంబేకాధిష్ఠితంబు సేసె; నట్టి కశ్యపప్రజాపతి యజ్ఞమహిమను, వాలఖిల్యులతపోమహిమను వినతకుం బుట్టి విహగేంద్రుం డయిన యా గరుడం డిప్పు డమృతహరణార్థం బరుగుదెంచుటంజేసి స్వర్గలోకంబున మహోత్పాతంబులు పుట్టె' నని సురపతికి బృహస్పతి చెప్పిన విని, యింద్రుం డమృతరక్షకుల నెల్ల రావించి, 'మీర లతిప్రయత్నంబున నమృతంబు రక్షించుకొని యుండుం' డని పంచిన 'వల్లె' యని. 87

ప్రతిపదార్థం: మీ, వచనంబు= మీ(వాలఖిల్యుల) యొక్కమాట; అమోఘంబు= వ్యర్థం కానిది; కావునన్= కాబట్టి; ఇంకన్= ఇటుతర్వాత; నాకున్; ఉద్భవిల్లెడు, పుత్త్రుండు= పుట్టబోయేకొడుకు; పక్షికులంబునకున్+ ఎల్లన్= పక్షులజాతి కంతటికిని; ఇంద్రుండు+అయ్యెడున్, అని= ఇంద్రుడు అవును గాక! అని; కశ్యపుండు; వారలన్= ఆ మునులను; ఒడంబఱిచి= ఒప్పించి; నీ, ఇంద్రత్వంబు= నీ ఇంద్రపదవిని; ఏక+అధిష్ఠితంబు చేసెన్= ఒక్కనిచే పొందబడిందిగా (అధిష్ఠింపబడిన దానినిగా) చేశాడు; అట్టి, కశ్యప, ప్రజాపతి, యజ్ఞమహిమను= అటువంటి కశ్యపబ్రహ్మయొక్క యజ్ఞంయొక్క మహత్త్వంచేతను; వాలఖిల్యుల తపస్+మహిమను= వాలఖిల్యులు అనే మునులయొక్క తపస్సుయొక్కగొప్పతనంచేతను; వినతకున్, పుట్టి; విహగ+ ఇంద్రుండు+అయిన= పక్షులకు రాజయిన; ఆ, గరుడండు= ఆగరుత్మంతుడు; ఇప్పుడు; అమృతహరణ+అర్థంబు= అమృతాన్ని ఎత్తుకొనిపోవటంకొరకు; అరుగు దెంచుటన్, చేసి= రావటంచేత; స్వర్గలోకంబునన్, మహత్, ఉత్పాతంబులు= గొప్ప చెడుశకునాలు; పుట్టెను= ఏర్పడినవి; అని; సురపతికిన్= దేవతల రాజయిన ఇంద్రుడికి; బృహస్పతి= దేవతలగురు వయిన బృహస్పతి; చెప్పినన్= చెప్పగా; విని ఇంద్రుండు; అమృత, రక్షకులన్, ఎల్లన్= అమృతాన్ని కాపాడేవారినందరిని; రావించి= రప్పించి; (వచ్చుధాతువుకు ప్రేరణరూపం); మీరలు; అతిప్రయత్నంబునన్= మిక్కిలిప్రయత్నంతో; అమృతంబు రక్షించుకొని, ఉండుండు; అని పంచినన్= అని ఆజ్ఞాపించగా; వల్లె, అని= అట్లే అని (అంగీకరించి).

తాత్పర్యం: 'మీవాక్కు వ్యర్థం కాదు. కావున ఇంక నాకు పుట్టబోయేకొడుకు పక్షిజాతికి అంతకూ ఇంద్రుడు(రాజు) అవునుగాక!' అని కశ్యపుడు వాలఖిల్యులను అంగీకరింపజేసి నీఇంద్రపదవి ఒక్కడిచేతనే అధిష్ఠితం అయ్యేటట్లు (ఒక్కడే ఇంద్రుడు ఉండేటట్లు) చేశాడు. అట్టి కశ్యపబ్రహ్మ పుత్రకామేష్టి మహత్త్వంచేతను, వాలఖిల్యులతపస్సుయొక్క మాహాత్మ్యంచేతను జన్మించి పక్షులకు రాజైన ఆ గరుడడు ఇప్పుడు అమృతాన్ని కొని పోవటంకొరకు రావటంచేత స్వర్గలోకంలో గొప్పదుశ్శకునాలు కలిగాయి' అని బృహస్పతి దేవేంద్రుడికి చెప్పగా విని, ఇంద్రుడు అమృతాన్ని రక్షించేవారిని అందరినీ రప్పించి 'మిక్కిలిప్రయత్నంతో అమృతాన్ని కాపాడుతూ ఉండం' డని పంపగా వారు అట్లే అని.

విశేషం: ఎడున్+అని; ఎడు, తల ద్రుతానికి అచ్చు పరమయ్యేటపుడు మకారం ఆదేశం ఔతుంది. ఎడుమని.

క. వారలు బహుప్రకారా ।
కారులు, వీరులు, నిశాతఖడ్గాదిమహా
దారుణ శస్త్రధరులు, కృ ।
ష్ణారుణ సితపీతఘనతరాంగత్రాణుల్. 88

ప్రతిపదార్థం: వారలు= ఆ అమృతాన్ని కాపాడేవారు; బహుప్రకార+ఆకారులు= పెక్కురకా లయిన రూపాలు కలవారు; వీరులు; నిశాత, ఖడ్గ+ఆది, మహత్, దారుణ, శస్త్ర, ధరులు= వాడి అయిన కత్తి మొదలయిన గొప్పభయంకరాలైన ఆయుధాలను ధరించినవారు; కృష్ణ+అరుణ, సిత, పీత, ఘనతర+అంగత్రాణుల్= నల్లని, ఎఱ్ఱని, తెల్లని, పచ్చని గొప్పవయిన కవచాలు కలవారు.

తాత్పర్యం: పెక్కురకా లయిన రూపాలు గల్గినవారు, వీరులు, వాడి అయిన కత్తి మొదలయిన భయంకరా లయిన ఆయుధాలు ధరించినవారు, నల్లని, ఎఱ్ఱని, తెల్లని, పచ్చని గొప్ప వయిన కవచాలు కలవారు అయిన ఆ అమృతరక్షకులు. (తరువాతి పద్యంలోని 'సమకట్టి' అనే దానితో అన్వయం.)

క. సమకట్టి యొక్కమొగి న ।
ప్రమాదు లై నిలిచి రేయుఁబవలును రక్షా
క్షము లై యమృతము చుట్టును ।
నమేయబలు లుండి రంత నతిరభసమునన్. 89

ప్రతిపదార్థం: సమకట్టి= పూని; ఒక్కమొగిన్= ఒకేవిధంగా (పూనికతో); అప్రమాదులు+ ఐ= ఏమరుపాటు, పరాకు, లేనివా రయి; నిలిచి= నిలబడి ఉండి; రేయున్= రాత్రియున్నూ (రేయి-రూపాంతరం రే); పవలును= పగటిపూటయున్నూ; రక్షాక్షములు+ ఐ= రక్షణలో సమర్థులై; అమృతము, చుట్టునున్= అమృతంయొక్క అన్నివైపులా; అమేయబలులు= అపరిమితమైన బలం కలవారు; ఉండిరి; అంతన్= ఆసమయంలో; అతి, రభసమునన్= మిక్కిలి వేగంతో.

తాత్పర్యం: అమృతాన్ని రక్షించటానికి నిశ్చయించి దృఢమైన పూనికతో ఏమరుపాటు లేనివా రై నిలబడి రాత్రింబగళ్ళూ రక్షించటంలో సమర్థు లై ఊహింపరాని బలం కలవారు, అమృతంచుట్టూ కావలి ఉన్నారు. అంత మిక్కిలివేగంతో. (రాబోయేపద్యంతో అన్వయం.)

మ. వితతోల్కాశనిపుంజమొక్కొ యనఁగా విన్వీథివిక్షిప్తప
క్షతివాతాహతిఁ దూలి తూలశకలాకారంబు లై వారిద
ప్రతతుల్ సాల్పడి నల్గడం జెదరఁగాఁ బాఱెన్ మనోవేగుఁ డై
పతగేంద్రుం డమృతాంతికంబునకుఁ దత్పాలుర్ భయం బందఁగన్. 90

ప్రతిపదార్థం: వితత+ఉల్క+అశని, పుంజము+ఒక్కొ= విరివిగా గల మండే నిప్పుకణాల యొక్కయు, పిడుగులయొక్కయు సమూహమా; అనఁగాన్= అనునట్లుగా; విన్, వీథి= ఆకాశమార్గంలో, విక్షిప్త, పక్షతి, వాత+ఆహతిన్= విదల్చబడిన రెక్కలయొక్క గాలియొక్క దెబ్బలచేత; తూలి= అటు నిటు కదలి; వారిదప్రతతుల్= మబ్బులయొక్క సముదాయాలు; తూల, శకల+ఆకారంబులు+ఐ=

దూదిపింజలయొక్క రూపాలు గల వై; చాల్పడి= వరుసగట్టి; నల్, కడన్= నాల్గువైపులా, చెదరఁగాన్= చెదరిపోగా; మనస్+వేగుఁడు+ఐ= మనస్సుయొక్క వేగంవంటి వేగం కలవా డయి; పతగ+ఇంద్రుండు= పక్షులకు ఇంద్రుడయిన గరుత్మంతుడు; అమృత+అంతికంబునకున్= అమృతం దగ్గరకు; తద్+పాలుర్= ఆఅమృతరక్షకులు; (పాలురు అనే ప్రథమావిభక్తి అంతంలో బహువచనానికి ఉకారం లోపించింది); భయంబు+అందఁగన్= భయపడగా; పాఱెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: విరివి అయిన నిప్పుకణాలతో కూడిన పిడుగులసమూహమా అనేటట్లుగా ఆకాశమార్గంలో విదల్చబడిన రెక్కలనుండి పుట్టినగాలిదెబ్బచే అటునిటు కదలి, మబ్బులసముదాయాలు దూదిపింజల ఆకృతికల వై వరుసగట్టి నాలుగుదిక్కులకు చెదరిపోగా, అమృతాన్ని రక్షించేవారు భయపడేటట్లుగా, మనస్సుయొక్క వేగంవంటి వేగంకలవాడయి, గరుడుడు అమృతందగ్గరకు ఎగిరి వెళ్ళాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అంత. 91

ప్రతిపదార్థం: అంతన్= పిదప.

తాత్పర్యం: పిమ్మట (తరువాతి పద్యంతో అన్వయం.)

గరుడఁ డమృతరక్షకులతో యుద్ధము సేయుట (సం. 1-28-1)

క. కల్పాంతానలకీలా ।
కల్పాయతపక్షుఁ, బక్షిగణవిభు, శౌర్యా
కల్పుఁ గని, యమృతరక్షు ల ।
నల్పక్రోధు లయి తాఁకి రార్చి కడంకన్. 92

ప్రతిపదార్థం: కల్ప+అంత+అనల, కీలా, కల్ప+ఆయత, పక్షున్= ప్రళయకాలంలోని అగ్నియొక్క జ్వాలలతో సమాన మయిన విశాల

మైనరెక్కలు కలవాడిని; పక్షి, గణ, విభున్= పక్షులసమూహాలకు రాజయినవాడిని; శౌర్య+ఆకల్పున్= పరాక్రమం అలంకారంగా కలిగినవాడిని గరుత్మంతుడిని; కని= చూచి; అమృత, రక్షులు= అమృతాన్ని కాపాడేవారు; అనల్ప, క్రోధులు+అయి= అధిక మైన కోపంకలవా రయి; ఆర్చి= గర్జించి; కడంకన్= సాహసంతో; తాఁకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: ప్రళయకాలంలోని అగ్నిజ్వాలలతో సమానమైన విశాలమైన రెక్కలు కలిగినవాడున్నూ, పక్షిగణాలకు రాజున్నూ, శౌర్య మలంకారంగా కలవాడున్నూ అయిన గరుత్మంతుడిని చూచి, అమృతాన్ని కాపాడేవారు అధికమైనకోపంతో అరచి పూనికతో ఎదుర్కొన్నారు.

క. తడఁబడ నేసియు వైచియుఁ।
బొడిచియు వివిధాస్త్రశస్త్రముల నుద్ధతు లై
కడుకొని యుద్ధము సేసిరి।
కడిమిమెయిన్ విబుధవరులు గరుఁడనితోడన్. 93

ప్రతిపదార్థం: తడఁబడన్= తొట్రుపాటుపడేటట్లు; ఏసియున్= బాణాలు ప్రయోగించియూ; వివిధ+అస్త్ర, శస్త్రములన్= పలురకా లయిన అస్త్రాలతో (మంత్రం ఉచ్చరించి ప్రయోగించబడే ఆయుధాలతో), శస్త్రాలతో (లోహాదినిర్మితాలయిన ఆయుధాలతో); వైచియున్= క్రమంగా పడేసియు; పొడిచియున్= క్రుమ్మియు; ఉద్ధతులు+ఐ= గర్వించినవా రై; కడుకొని= ఉత్సాహం పొంది; కడిమిమెయిన్= పరాక్రమంతో; గరుడనితోడన్= గరుత్మంతుడితో, విబుధవరులు= దేవతాశ్రేష్ఠులు; యుద్ధము; చేసిరి.

తాత్పర్యం: తొట్రుపడేటట్లుగా బాణాలు ప్రయోగించి, పలురకా లయిన శస్త్రాస్త్రాలతో పడేసియు, క్రుమ్మియు, గర్వించిన వారయి, ఉత్సాహం పొంది పరాక్రమంతో దేవతాశ్రేష్ఠులు గరుత్మంతుడితో యుద్ధం చేశారు.

వ. గరుడండును నిజపక్ష విక్షిప్తరజోవృష్టి నమరవరుల దృష్టిపథంబుఁ గప్పి స్వర్గలోకంబు నిరాలోకంబుగాఁ జేసిన, నమరేంద్రుపనుపునం బవనుం డా రజోవృష్టి చెదర వీచె నంత. 94

ప్రతిపదార్థం: గరుడండును= గరుత్మంతుడును; నిజ, పక్ష, విక్షిప్త, రజస్+వృష్టిన్= తనరెక్కలచేత విదల్చబడిన దుమ్ముయొక్క వర్షంతో; అమరవరుల= దేవతాశ్రేష్ఠుల యొక్క; దృష్టిపథంబున్= చూపుమార్గాన్ని; కప్పి; స్వర్గలోకంబు= దేవతలలోకమైన స్వర్గలోకాన్ని; నిరాలోకంబు, కాన్= వెలుగు లేనిది అయ్యేటట్లుగా; చేసినన్= చేయగా; అమర+ఇంద్రు, పనుపునన్= దేవతలరాజయిన ఇంద్రుడి ఆజ్ఞచేత; పవనుండు= గాలి; ఆ, రజః+వృష్టి= ఆదుమ్ముయొక్కవర్షం, చెదరన్= చెదరేటట్లుగా; వీచెన్= విసిరాడు; అంతన్= అప్పుడు

తాత్పర్యం: గరుడడు తనరెక్కలచేత చిమ్మబడిన ధూళివర్షంచేత దేవతాశ్రేష్ఠుల దృష్టిమార్గాన్ని కప్పి స్వర్గలోకాన్ని వెలుతురులేనిదానినిగా చేయగా, ఇంద్రుడిఆజ్ఞచేత వాయువు ఆ దుమ్మువాన చెదరిపోయేటట్లుగా విసరాడు.

మాలిని.

పరశు కులిశ కుంత ప్రాస బాణాసనోద్య
త్పరిఘ కణప చక్ర ప్రస్ఫుర ద్బాహు సేనా
పరివృతుఁ డయి తాఁకెన్ భౌమనుం డన్మహోకిం
కరుఁడు సమరకేళీగర్వితున్ వైనతేయున్. 95

ప్రతిపదార్థం: పరశు, కులిశ, కుంత, ప్రాస, బాణాసన, ఉద్యత్, పరిఘ, కణప, చక్ర, ప్రస్ఫురత్, బాహు, సేనా, పరివృతుఁడు+అయి= గొడ్డలి, వజ్రాయుధం, బల్లెములు, ఈటెలు, విండ్లు, పైకెత్తబడిన గుదియలు, కణపాలు (ఒక రకంఆయుధాలు), చక్రాలు మొదలయిన వాటితో ప్రకాశిస్తున్న

భుజాలు కలిగిన సైన్యంతో చుట్టబడినవాడయి; భౌమనుండు+అన్= భౌమనుడు అనే పేరు కల (అనులోని ఉత్వం లోపించింది); మహత్, కింకరుఁడు= గొప్పసేవకుడు; సమర, కేళీగర్వితున్= యుద్ధ మనే క్రీడలో మదించిన; వైనతేయున్= వినతకొడు కయిన గరుత్మంతుడిని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: గొడ్డలి, వజ్రం, బల్లెం, ఈటె, విల్లు, ఎత్తబడినబాణం, కణపం, చక్రం అనేవాటితో ప్రకాశిస్తున్నచేతులు కలిగిన సైన్యంతో చుట్టబడిన వాడయి భౌమనుడనే గొప్ప సేవకుడు యుద్ధ మనే క్రీడలో మదించిన గరుత్మంతుడిని ఎదుర్కొన్నాడు.

క. బలవత్ఖగేంద్రకోపా।
నలభస్మీభూతుఁ డై క్షణంబున వాఁడున్
బలమఱి క్రాఁగె నుదగ్ర।
జ్వలన జ్వాలావలీఢశలభమపోలెన్. 96

ప్రతిపదార్థం: బలవత్, ఖగ+ఇంద్ర, కోప+అనల, భస్మీభూతుఁడు+ఐ= బలవంతు డయిన, పక్షిరా జయిన గరుత్మంతుడియొక్క కోప మనే అగ్నిచేత బూడిద అయినవాడయి; క్షణంబునన్= క్షణకాలంలో; వాఁడున్= ఆభౌమనుడుకూడ; బలము+అఱి= బలం నశించి; ఉదగ్ర, జ్వలన, జ్వాలా+అవలీఢ, శలభము+అ, పోలెన్= పైకిలేస్తున్న అగ్నియొక్క మంటలచే కాల్చబడిన మిడుతయే అన్నట్లుగా క్రాఁగెన్= మాడిపోయాడు.

తాత్పర్యం: బలవంతు డయిన గరుత్మంతుడియొక్క కోప మనే అగ్నిచేత బూడి దయిన వా డయి, క్షణకాలంలో ఆభౌమను డనేవాడు బలం నశించి పైకి లేచే అగ్నిమంటలచేత కాల్చబడిన మిడతయే అన్నట్లుగా దగ్ధుడైనాడు.

విశేషం: అలం: ఉపమ.

సీ. పక్షతుండాగ్ర నఖక్షతదేహు లై।
బోరన నవరక్తధార లొలుక
విహగేంద్రునకు నోడి నిహతు లై సురవరుల్।
సురరాజు మఱువు సొచ్చిరి కలంగి;
సాధ్యు లనాయాససాధ్యులై పాఱిరి।
పూర్వాభిముఖు లయి గర్వ ముడిఁగి;
వసువులు రుద్రులు వసుహీనవిప్రుల।
క్రియ దక్షిణాశ్రితు లయిరి భీతి

ఆ. వంది; యపరదిక్కుఁ బొంది రాదిత్యు; లా।
శ్వినులు నుత్తరమున కొనరఁ బఱచి;
రనల వరుణ పవన ధనద యమాసురుల్।
వీఁక దఱిఁగి కాందిశీకు లయిరి. 97

ప్రతిపదార్థం: పక్ష, తుండ+అగ్ర, నఖ, క్షత, దేహులు+అయి= రెక్కలు ముక్కుయొక్క కొనభాగం, గోళ్ళు అనేవాటిచే గాయపరచబడిన శరీరాలు కలవా రయి; బోరన= శీఘ్రంగా; నవ, రక్త, ధారలు= క్రొత్తనెత్తురుల ధారలు; ఒలుకన్= కారగా; విహగ+ఇంద్రునకున్, ఓడి= గరుత్మంతునికి ఓడిపోయి; నిహతులు+ఐ= హింసింపబడినవారై; కలంగి= కలతపొంది; సురవరుల్= దేవతాశ్రేష్ఠులు; సురరాజు, మఱువు= దేవతలకు రాజయిన ఇంద్రుడి ఆశ్రయాన్ని; చొచ్చిరి= చేరారు; సాధ్యులు= సాధ్యు లనే దేవతలలోని ఒకతెగవారు; అనాయాససాధ్యులు+ఐ= శ్రమలేకయే జయింపబడినవా రయి; గర్వము+ ఉడిఁగి= గర్వం నశించి; పూర్వ+అభిముఖులు+ఐ= తూర్పుముఖంగా పోయేవా రయి; పాఱిరి= పరుగెత్తారు; వసువులు= ఎనమండుగురు వసువులు; రుద్రులు= పదొకండుమంది రుద్రులు; భీతిన్+ అంది= భయపడి; వసుహీన, విప్రులక్రియన్= సంపద లేని బ్రాహ్మణులవలె;

దక్షిణ+ఆశ్రితులు+అయిరి= దక్షిణదిక్కును ఆశ్రయించినవారైనారు. బ్రాహ్మణపక్షంలో-దక్షిణా+ఆశ్రితులు+ అయిరి= సంభావనను ఆశ్రయించిన వారైనారు; ఆదిత్యులు= పండ్రెండుగురు సూర్యులును; భీతిన్+అంది= భయపడి; అపర, దిక్కున్= పడమటిదిక్కును; పొందిరి= చేరారు. (సూర్యాస్తమయం పడమటిదిక్కున జరుగుతుంది); ఆశ్వినులు= అశ్వినీ దేవతలు; ఉత్తరమునకున్= ఉత్తరదిక్కుకు; ఒనరన్= ఒప్పునట్లుగా; పఱచిరి= పారిపోయారు; అనల, వరుణ, పవన, ధనద, యమ+అసురుల్= అగ్ని, వరుణుడు, వాయువు, కుబేరుడు, యముడు, రాక్షసు డయిన నైరృతి అనే దిక్పాలురు; వీఁక, తఱిఁగి= పరాక్రమం తగ్గి, కాందిశీకులు+అయిరి= దిక్కు తెలియక పరుగెత్తినవా రైనారు.

తాత్పర్యం: గరుడుడి రెక్కలచే, ముక్కుకొనచే, గోళ్ళచే దెబ్బతిన్నశరీరం గలవా రయి బోరు మని నెత్తుటిధారలు కారుతుండగా గరుత్మంతుడిచేత జయింపబడి, హింసింపబడి దేవతాశ్రేష్ఠులు ఇంద్రుడిచాటుకు చేరారు; సాధ్యు లనే దేవతాగణం శ్రమలేకుండా జయింపబడినవా రై గర్వం విడిచి తూర్పుదిక్కుకు పారిపోయారు; వసువులు, రుద్రులు సంపద లేని బ్రాహ్మణులవలె దక్షిణదిక్కును ఆశ్రయించారు (సంభావనను ఆశ్రయించారు); పండ్రెండుగురు సూర్యులు కలత చెంది పడమటిదిక్కును పొందారు; అశ్వినీదేవతలు ఉత్తరదిక్కుకు పోయారు; అగ్ని, వరుణుడు, వాయువు, కుబేరుడు, యముడు, అసురు డయిన నైరృతి అనే దిక్పాలురు దిక్కు తెలియక పారిపోయారు.

విశేషం: అలం: ఉపమ, శ్లేష

క. తలరఁగ రేణుక్రథన ।
ప్రలిహప్రరుజాశ్వకృంతపదనఖులను ర
క్షులఁ గులిశనిశాతనఖా ।
వలిఁ బక్షీంద్రుండు వ్రచ్చివందఱలాడెన్. 98

ప్రతిపదార్థం: పక్షి+ఇంద్రుండు= పక్షులకు రా జయిన గరుత్మంతుడు; రేణు, క్రథన, ప్రలిహ, ప్రరుజ+అశ్వకృంత, పదనఖులు+అనురక్షులన్= రేణువు, క్రథనుడు, ప్రలిహుడు, ప్రరుజుడు, అశ్వకృంతుడు, పదనఖుడు అనే కావలివాళ్ళను; తలరఁగన్= సంభ్రమించేటట్లుగా, కులిశ, నిశాత, నఖ+ఆవలిన్= వజ్రాయుధంవలె వాడి అయిన గోళ్ళవరుసతో; వ్రచ్చి= చీల్చి; వందఱలు+ఆడెన్= ముక్కలు చేశాడు.

తాత్పర్యం: రేణువు, క్రథనుడు, ప్రలిహుడు, ప్రరుజుడు, అశ్వకృంతుడు, పదనఖుడు అనే కావలివాళ్ళను సంభ్రమించేటట్లుగా గరుడడు వజ్రంవంటి వాడి అయిన గోళ్ళవరుసతో చీల్చి ముక్కలు చేశాడు.

వ. ఇట్లు నిర్జరవరుల నెల్ల నిర్జించి, యూర్జితుం డై గరుడం డమృత స్థానంబున కరిగి, దానిం బరివేష్టించి ఘోరసమీరప్రేరితం బై దుర్వారశిఖా జిహ్వల నంబరంబు నాస్వాదించుచున్న యనలంబుం గని, తత్క్షణంబ సకలనదీజలంబుల నెల్లఁ బుక్కిలించుకొని వచ్చి యయ్యనలంబు నాఱంజల్లి, తీక్ష్ణధారం బై దేవనిర్మితం బై పరిభ్రమించుచున్న యంత్రచక్రంబు నారాంతరంబున సంక్షిప్తదేహుం డై చొచ్చి యచ్చక్రంబుక్రింద. 99

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; నిర్జర, వరులన్, ఎల్లన్= దేవతలనందరిని; నిర్జించి= జయించి; ఊర్జితుండు+ఐ= బలవంతుడై; గరుడండు; అమృతస్థానంబునకున్= అమృతండుండే ప్రదేశానికి; అరిగి= వెళ్ళి; దానిన్= ఆ అమృతాన్ని; పరివేష్టించి= చుట్టుకొని; ఘోర, సమీర, ప్రేరితంబు+ఐ= భయంకర మైన వాయువుచే రగుల్కొల్పబడిన దై; దుర్వార, శిఖా, జిహ్వలన్= వారింప శక్యం గాని అగ్నిజ్వాల లనే నాలుకలతో; అంబరంబున్= ఆకాశాన్ని; ఆస్వాదించుచున్+ఉన్న= నాకుతున్న (తాకుతున్న); అనలంబున్, కని= అగ్నిని చూచి; తద్, క్షణంబు+ అ= ఆ క్షణమందే; సకల, నదీజలంబులన్+ ఎల్లన్= అన్ని నదులయొక్క నీటినంతటిని; పుక్కిలించుకొని= నోటిలో ఉంచుకొని (గండూషించి); వచ్చి; ఆ+అనలంబున్= ఆ అగ్నిని; ఆఱన్,

చల్లి= ఆరిపోయేటట్లుగా చల్లి; తీక్ష్ణ, ధారంబు+ఐ= పదు నైన అంచు గలదై; దేవనిర్మితంబు+ఐ దేవతలచేత తయారుచేయబడిన దై; పరిభ్రమించుచున్+ఉన్న= తిరుగుతున్న, యంత్రచక్రంబు, ఆర+అంతరంబునన్= యంత్రంలోని చక్రంయొక్క ఆకులలోపలిభాగాన; సంక్షిప్తదేహుండు+ఐ= చిన్నదిగా చేయబడినశరీరం కలవాడై; చొచ్చి= ప్రవేశించి; ఆ, చక్రంబు, క్రిందన్= ఆచక్రంయొక్క క్రిందిభాగంలో.

తాత్పర్యం: ఈ విధంగా దేవతాశ్రేష్ఠులను అందరినీ ఓడించి బలవంతుడై గరుడడు అమృతం ఉండే ప్రదేశానికి వెళ్ళి భయంకరమైనగాలిచేత రగుల్కొల్పబడి వారింపశక్యం గాని జ్వాల లనే నాలుకలచేత ఆకాశాన్ని కబళిస్తున్న అగ్నిని చూచి ఆ క్షణమందే అన్నినదులలోని నీటినంతటిని నోటిలో ఉంచుకొని వచ్చి ఆ అగ్ని ఆరిపోయేటట్లుగా చల్లి, వాడి అయిన అంచుకలదై, దేవతలచే నిర్మింపబడి తిరుగుతున్న యంత్రరూప మైన చక్రంయొక్క ఆకులనడుమ సంకోచింపబడిన (చిన్నదిగా చేయబడిన) దేహం కలవా డై ఆచక్రంక్రింద.

విశేషం: అలం: రూపకం.

ఉ. ఘోరవికార సన్నిహిత కోపముఖంబులు, దీప్తవిద్యుదు
ల్కారుణ దారుణాక్షములు నై, నిజదృష్టి విషాగ్ని నన్యులం
జేరఁగనీక యేర్చుచుఁ బ్రసిద్ధముగా నమృతంబు చుట్టు ర
క్షారతి నున్న యుగ్రభుజగంబుల రెంటిని గాంచి చెచ్చెరన్. 100

ప్రతిపదార్థం: ఘోర, వికార, సన్నిహిత, కోప, ముఖంబులు= భయంకరా లయి వికారంతో కూడిన కోపం కల నోళ్ళు కలవియున్నా; దీప్త, విద్యుత్+ ఉల్క+ అరుణ, దారుణ+అక్షములు+ ఐ= వెలుగుతున్న మెఱుపులవలె నిప్పులవలె ఎర్ర నైన, భయంకరా లయిన కన్నులు గలవియై; నిజ దృష్టి, విష+అగ్నిన్= తమచూపులనుండి ప్రసరించే విష మనే అగ్నితో; అన్యులన్=

ఇతరులను; చేరఁగన్, ఈక= దగ్గరకు రానీకుండ; ఏర్చుచున్= దహిస్తూ; ప్రసిద్ధముగాన్= ప్రకటమయ్యేటట్లు; అమృతంబు, చుట్టున్; రక్షా, రతిన్= రక్షించడంలోని ఆసక్తితో; ఉన్న; ఉగ్ర, భుజగంబులన్, రెంటిని= భయంకరమయిన పాములను రెంటిని; కాంచి= చూచి; చెచ్చెరన్= వెంటనే.

తాత్పర్యం: భయంకరాలయి, వికారంతో కూడిన కోపమున్న ముఖాలు కలవియున్నా; వెలుగుతున్న మెరుపులవలె, నిప్పుకణాలవలె, ఎర్ర నైన, భయంకరా లయిన కన్నులు కలవియున్నా అయి తమ కన్నులలోని విష మనే అగ్నితో ఇతరులను దగ్గరకు రానీకుండ దహిస్తూ అమృతానికి చుట్టూ కాపాడటంలోని ఆసక్తితో ఉన్న భయంకరా లయిన పాములను రెంటిని చూచి, వెంటనే.

విశేషం: అలం: రూపకం. ఈపద్యరచనలోని రేఫాక్షరబాహుళ్యం, పరుషాక్షర విన్యాసం సర్పాల భయంకరాకారాలను అక్షరరమ్యంగా ధ్వనింపజేస్తున్నవి.

వ. అయ్యురగంబులం దనపక్షరజోవృష్టినంధంబులంజేసి, వాని శిరంబులు ద్రొక్కి పరాక్రమం బెసంగనమృతంబు కొని గరుడండు గగనంబున కెగసిన. 101

ప్రతిపదార్థం: ఆ+ఉరగంబులన్= ఆపాములను; తన, పక్ష, రజస్+వృష్టి= తనరెక్కల వలన ఏర్పడిన దుమ్ముయొక్క వర్షంతో; అంధంబులన్+చేసి= గ్రుడ్డివాటినిగా చేసి; వాని, శిరంబులు, త్రొక్కి= వాటితలలు త్రొక్కి; పరాక్రమంబు+ఎసంగన్= పరాక్రమం ఎక్కువ కాగా; అమృతంబు, కొని= అమృతం తీసికొని; గరుడండు; గగనంబునకున్= ఆకాశానికి; ఎగసినన్= ఎగిరిపోగా.

తాత్పర్యం: ఆపాములను తనరెక్కలచేత ఎగురగొట్టబడిన దుమ్మువర్షంచేత గ్రుడ్డివాటినిగా చేసి, వాటి తలలు తన్ని, శౌర్యమొప్పేటట్లు అమృతాన్ని గ్రహించి గరుడుడు ఆకాశానికి ఎగిరిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కలహమున నిట్లు సురవీ।
రులఁ బల్వుర నోర్చి, యొక్కరుఁడ యమృతముఁదె
క్కలికొని, యాస్వాదింపక।
యలోలుఁ డగు వానిఁ జూచి హరి యి ట్లనియెన్. 102

ప్రతిపదార్థం: కలహమునన్= యుద్ధంలో; ఇట్లు= ఈవిధంగా; సురవీరులన్= వీరు లైన దేవతలను, పల్వురన్= చాలామందిని; ఓర్చి= ఓడించి; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; అమృతమున్= అమృతాన్ని; తెక్కలికొని= అపహరించి; ఆస్వాదింపక= రుచిచూడక; అలోలుఁడు+అగువానిన్= ఆసక్తిలేకుండ ఉన్న ఆగరుత్మంతుడిని, చూచి; హరి= విష్ణువు; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈవిధంగా యుద్ధంలో దేవతావీరులను పెక్కుమందిని జయించి ఒక్కడే అమృతాన్ని దొంగిలించి రుచి చూడకుండ అనాసక్తుడుగా ఉండే గరుత్మంతుడిని చూచి విష్ణువు ఇట్లా అన్నాడు.

క. నీ విజయోత్సాహమునకు,।
లావునకు, జవంబునకు, నలౌల్యమునకు, స
ద్భావమునకు మెచ్చి, వరం।
బీ వచ్చితి, వేఁడు మెద్ది యిష్టము నీకున్. 103

ప్రతిపదార్థం: నీ, విజయ+ఉత్సాహమునకున్= నీవిజయంలోని ప్రయత్నానికి; లావునకున్= బలానికి; జవంబునకున్= వేగానికి; అలౌల్యమునకున్= అనాసక్తికి; సత్, భావమునకున్= మంచితనానికి; మెచ్చి= సంతోషించి; వరంబు+ఈన్, వచ్చితిన్= వరం ఇవ్వటానికి వచ్చాను; నీకున్, ఇష్టము, ఎద్ది= నీకు ఏది ప్రియమో; వేఁడుము= కోరుకొమ్ము.

తాత్పర్యం: నీ విజయంలోని పూనికకు (ప్రయత్నానికి) బలానికి, వేగానికి, అనాసక్తికి, మంచితనానికి, సంతోషించి నీకు వర మివ్వటానికి వచ్చాను. నీ కేది ఇష్టమో కోరుకొమ్ము.

శ్రీమన్నారాయణుఁడు గరుడునకుఁ బ్రసన్నుఁ డగుట; ఇంద్రుండు గరుడునితో స్నేహించుట (సం. 1-29-12)

వ. అని ప్రసన్నుం డై యానతిచ్చిన యాదిదేవుం డగు శ్రీమన్నారాయణునకు నమస్కరించి గరుడం డి ట్లనియె. 104

ప్రతిపదార్థం: అని; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహించినవాడయి; ఆనతి+ఇచ్చిన= సెల విచ్చినటువంటి; ఆది, దేవుండు+ అగు= మొదటివే ల్పయిన; శ్రీమత్+నారాయణునకున్= శోభాయుక్తు డయిన నారాయణుడికి; నమస్కరించి= మ్రొక్కి; గరుడండు= గరుత్మంతుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని, దయకలవా డై ఆజ్ఞ ఇచ్చిన దేవాదిదేవు డయిన శ్రీమహావిష్ణువుకు మ్రొక్కి గరుడడు ఇట్లా పలికాడు.

విశేషం: శ్రీమత్+నారాయణునకున్= శ్రీమన్నారాయణునకు- అనునాసిక సంధి; ఆనతి+ఇచ్చిన= ఇకారసంధి; ఆనతిచ్చిన.

సీ. 'అమృతాశనంబు చేయకయును దేవ! నా।
కజరామరత్వంబు నందుటయును,
అఖిలలోకంబుల కగ్రణి వైన నీ।
యగ్రంబునందు ని న్నధికభక్తిఁ
గొలుచుచు నునికియుఁ గోరితిఁ, గరుణతో।
దయసేయు ముద్ధతదైత్యభేది!'
యనవుడు వానికి నభిమతంబులు ప్రీతుఁ।
డై యిచ్చి హరి యిట్టు లనియె: 'నాకు

ఆ. ననఘ! వాహనంబ వై మహాధ్వజమ వై।
యుండు' మనినఁ బక్షియును ప్రసాద
మనుచు మ్రొక్కిపఱచె; నంత నాతనిమీఁద।
వజ్ర మెత్తి వైచె వాసవుండు. 105

ప్రతిపదార్థం: దేవ= ఓదేవుడా! ఉద్ధత, దైత్య, భేది= గర్వించిన రాక్షసులను సంహరించేవాడా! అమృత+అశనంబు= అమృతం తినటం; చేయకయును= చేయకుండానే; నాకున్, అజర+అమరత్వంబున్= ముసలితనం, చావు అనేవి లేకుండటాన్ని; అందుటయును= పొందటాన్ని; అఖిల, లోకంబులకున్= అన్నిలోకాలకు; అగ్రణివి+ఐన= ప్రధానుడ వయిన; నీ, అగ్రంబునందున్= నీయెదుట; నిన్నున్; అధిక, భక్తిన్= మిక్కిలిభక్తితో; కొలుచుచున్, ఉనికియున్= సేవిస్తూ ఉండటము; కోరితిన్= వేడుకొన్నాను; కరుణతోన్= దయతో; దయచేయుము= అనుగ్రహించుము (ఇమ్ము); అనవుడున్= అనగా; వానికిన్= ఆగరుత్మంతుడికి; అభిమతంబులు= కోరికలను; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవా డయి; ఇచ్చి; హరి= విష్ణువు; ఇట్టులు+అనియెన్= ఇట్లా చెప్పాడు; అనఘ= పాపం లేని వాడా!; నాకున్= విష్ణువు నయిన నాకు; వాహనంబవు+ఐ= మోసేవాహనాని వై; ధ్వజమవు+ఐ= గొప్ప జెండా వై; ఉండుము; అనినన్= అని చెప్పగా; పక్షియును= పక్షి అయిన గరుత్మంతుడును; ప్రసాదము+ అనుచున్= అనుగ్రహమంటూ; మ్రొక్కి= నమస్కరించి; పఱచెన్= ఎగిరాడు; అంతన్= అంతట; అతనిమీఁదన్= ఆగరుత్మంతుడిమీద; వాసవుండు= ఇంద్రుడు; వజ్రము= వజ్రాయుధాన్ని; ఎత్తివైచెన్= పైకెత్తి విసిరాడు.

తాత్పర్యం: గర్వితు లైన రాక్షసులను సంహరించేవాడా! దేవా! అమృతం తినకుండానే ముసలితనం, చావు రాకుండటాన్నీ, అన్ని లోకాలకు అధికుడ వయిన నీయెదుట మిక్కిలి భక్తితో నిన్ను సేవిస్తుండటాన్నీ కోరినాను. దయతో ఇమ్ము. అని గరుత్మంతుడు కోరగా సంతోషించినవా డయి అతనికి కోరికలను ఇచ్చి విష్ణువు 'నీవు నాకు వాహనంగా, గొప్పజెండాగా ఉండుము' అని చెప్పగా పక్షి అయిన గరుత్మంతుడు అనుగ్రహ మంటూ నమస్కరించి యెగిరిపోయాడు. అప్పుడు ఇంద్రుడు అతనిపై వజ్రాయుధాన్ని విసరి వేశాడు.

వ. అదియును నంబరంబున నగ్నికణంబులు చెదరం బఱతెంచి పక్షిరాజుపక్షంబులు దాఁక వచ్చినం జూచి గరుడండు నగి, 'నీచేయువేదన నన్నుం దాఁక నోపదు; నీవు మహాముని సంభవంబ వగుటను, దేవేంద్రునాయుధంబ వగుటను నిన్ను నవమానింపంగాదు, గావున మదీయైకపర్ణశకలచ్ఛేదంబు సేయుము; నాయందు నీశక్తి యింతియ' యనిన సకలభూతసంఘం బెల్ల నాతనిపర్ణంబులసుస్థిరత్వంబునకు మెచ్చి సుపర్ణుం డని పొగడిరి. సురేంద్రుండును నవ్విహగేంద్రుమాహాత్మ్యంబునకు మెచ్చి యచ్చెరు వంది యి ట్లనియె 106

ప్రతిపదార్థం: అదియును= ఆవజ్రాయుధమును; అంబరంబునన్= ఆకాశంలో; అగ్నికణంబులు= నిప్పుకణాలు; చెదరన్= ఎగిరిపడేట్లుగా; పఱతెంచి= వచ్చి; పక్షిరాజు, పక్షంబులు= పక్షులకు రా జయిన గరుత్మంతుడి రెక్కలను; తాఁక, వచ్చినన్= తాకటానికి రాగా; చూచి; గరుడుండు= గరుత్మంతుడు; నగి= నవ్వి; నీ, చేయు, వేదన= నీవు చేసే బాధ; నన్నున్= నన్ను (గరుత్మంతుడిని); తాఁకన్, ఓపదు= తాకజాలదు; నీవు; మహత్, ముని, సంభవంబవు+అగుటను= గొప్పమునినుండి పుట్టినదాని వవటంచేతను (వజ్రాయుధం దధీచి వెన్నెముకతో నిర్మింపబడిం దని పురాణవచనం); దేవేంద్రు+ ఆయుధంబవు+ అగుటను= దేవేంద్రుడియొక్క ఆయుధ మవటంచేతను; నిన్నున్; అవమానింపన్, కాదు= అవమానించరాదు; కావునన్= అందుచేత; మదీయ+ఏక, పర్ణ, శకల, ఛేదంబు= నాదయిన ఒక ఈకయొక్క ముక్కను తుంచటాన్ని; చేయుము; నాయందున్= నామీద; నీ, శక్తి= నీయొక్క (వజ్రాయుధంయొక్క) ప్రభావం; ఇంతి+అ= ఇంతమాత్రమే; అనినన్= అని పలుకగా; సకల, భూత, సంఘంబు+ఎల్లన్= అన్ని ప్రాణులయొక్క సమూహమంతా; అతని, పర్ణంబుల= ఆ గరుత్మంతుని రెక్కలయొక్క; సుస్థిరత్వంబునకున్= గట్టితనానికి; మెచ్చి= పొగడి; సుపర్ణుండు+అని= సుపర్ణుడు అనేపేరుతో; పొగడిరి= మెచ్చుకొన్నారు;

(సుపర్ణుడంటే మంచిబల మైన రెక్కలు కలవాడని వ్యుత్పత్తి); సుర+ఇంద్రుండును= దేవతలకు రాజయిన ఇంద్రుడు కూడా; ఆ, విహగ+ ఇంద్రు, మాహాత్మ్యంబునకున్= ఆ పక్షులకు రాజయిన గరుత్మంతుడి గొప్పతనానికి; మెచ్చి; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం పొంది; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆవజ్రాయుధం ఆకాశంలో నిప్పుకణాలు ఎగురునట్లుగా వచ్చి పక్షులకు రాజయిన గరుత్మంతుడి రెక్కలను తాకటానికి రాగా చూచి గరుడుడు నవ్వి 'నీవు చేసే బాధ నన్ను తాకజాలదు. నీవు గొప్పముని అయిన దధీచి వెన్నెముకచేత చేయబడినదాన వవటంచేత నిన్ను అవమానించటం తగదు. కావున నాయొక్క ఒక యీకముక్కను త్రుంచివేయుము. నాపై నీశక్తి ఇంతమాత్రమే' అని పలుకగా సర్వభూతసమూహం అతనిరెక్కల దృఢత్వానికి మెచ్చుకొని సుపర్ణు డని స్తుతించింది. దేవేంద్రుడుసైతం ఆపక్షిరాజుగొప్పతనానికి మెచ్చి ఆశ్చర్యపడి ఇట్లా పలికాడు.

విశేషం: ఇక్కడ గరుత్మంతుడికి సుపర్ణు డనే పేరు ఎట్లా వచ్చిందో చెప్పబడింది.

ఆ. నిరుపమానశౌర్య! నీతోడఁ జెలిమి సే ।
యంగ నా కభీష్ట మైనయదియు;
నిట్టి విక్రమంబు, నిట్టి సామర్థ్యంబుఁ గలదె!
యొరుల కిజ్జగంబునందు. 107

ప్రతిపదార్థం: నిరుపమాన, శౌర్య=సాటిలేని పరాక్రమం కలవాడా! నీతోడన్, చెలిమి= నీతో(గరుత్మంతుడితో) స్నేహం; చేయంగన్= చేయటానికి; నాకున్+అభీష్టము+ఐన, అదియు= నాకు కోరిక గలిగింది; ఇట్టి విక్రమంబున్= ఇటువంటిపరాక్రమం; ఇట్టి, సామర్థ్యంబున్= ఇటువంటిశక్తి; ఒరులకున్= ఇతరులకు; ఈ+జగంబునందున్= ఈలోకంలో; కలదే+ఎ= కలదా (లేదని భావం).

తాత్పర్యం: ఓసాటిలేనిపరాక్రమం కలవాడా! నీతో స్నేహం చేయా లని నాకు కోరిక కలిగింది. ఇటువంటి విక్రమం, సమర్థత ఈ లోకంలో ఇతరులకు ఉన్నదా? (లేదని భావం).

విశేషం: నీతోడన్+చెలిమి; సమాసాలలో చేత, తోడ, వలన అనే వాటికి ఇత్వం వస్తుంది. నీతోడి చెలిమి- అలుక్సమాసం.

క. అమరుఁడ వజరుఁడ వజితుఁడ ।
వమేయుఁడవు; నీకు నమృత మది యేల ఖగో
త్తమ! దీని నొరుల కిచ్చిన ।
నమరులకును వా రసాధ్యు లగుదురు పోరన్. 108

ప్రతిపదార్థం: అమరుఁడవు= మరణం లేనివాడివి; అజరుఁడవు= ముసలితనం లేనివాడివి; అజితుఁడవు= ఓడింపబడనివాడివి; అమేయుఁడవు= కొలది చెప్పరానివాడివి; నీకున్; అమృతము+అది+ఏల= అమృతం ఎందుకు? ఖగ+ఉత్తమ!= పక్షులలో శ్రేష్ఠుడా! దీనిన్= ఈఅమృతాన్ని; ఒరులకున్= దేవతలకంటె ఇతరులకు; ఇచ్చినన్= ఇస్తే; వారు= ఆ అమృతం త్రాగినవారు; పోరన్= యుద్ధంలో; అమరులకును= దేవతలకుకూడ; అసాధ్యులు+అగుదురు= జయింపరానివా రవుతారు.

తాత్పర్యం: నీవు మరణం, ముసలితనం, పరాజయం లేనివాడివి. ఇట్టివాడి వని కొలది యిడరానివాడివి. నీకు అమృతం ఎందుకు? ఓ పక్షిరాజా! ఈ అమృతాన్ని ఇతరులకు ఇస్తే వారు దేవతలకుకూడ జయింపరానివా రవుతారు.

క. 'నీ వొరులకు నీయమృతం ।
బీ వలవదు; నాకు మగుడ నిచ్చిన నీ కి
ష్టావాప్తి యగు విధం బేఁ ।
గావించెద' ననిన హరికి గరుడం డనియెన్. 109

ప్రతిపదార్థం: నీవు= (గరుత్మంతుడు); ఒరులకున్= ఇతరులకు; ఈ అమృతంబు= ఈఅమృతాన్ని; ఈ, వలవదు= ఇయ్యవద్దు; (ఈన్- ఇచ్చుధాతువుయొక్క తుమున్నర్థకరూపం); నాకున్; మగుడన్, ఇచ్చినన్= తిరిగి ఇస్తే; నీకున్; ఇష్ట+అవాప్తి= ఇష్టమయినదాన్ని పొందటం; అగు, విధంబు= అయ్యేవిధానాన్ని; ఏన్= నేను; కావించెదన్= చేస్తాను; అనినన్= అని చెప్పగా; హరికిన్= ఇంద్రుడికి; గరుడండు= గరుత్మంతుడు; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'నీవు ఇతరులకు ఈఅమృతాన్ని ఇయ్యవద్దు. నాకు దాన్ని తిరిగి తెచ్చి ఇస్తే, నీకిష్టమయింది జరిగేవిధంగా నేను చేస్తా' నని ఇంద్రుడు గరుత్మంతుడితో చెప్పగా, అతడితో గరుత్మంతుడు ఇట్లా అన్నాడు.

వ. 'ఏను మదీయమాతృదాసీత్వనిరాసార్థం బురగుల కమృతంబుఁ దెచ్చియిత్తు నని కాద్రవేయులతో నొడివి వచ్చినవాఁడ; నీ యమృతంబు గొనిపోయి వారల కిచ్చి మదీయజననీదాస్యంబుఁ బాచికొనిన, నురగు లీ యమృతం బుపయోగింపకుండ ముందఱ నీవు గొనిచను' మనిన, నగ్గరుడని మహానుభావంబునకు మెచ్చి 'నీబలపరాక్రమంబులు వినవలతుం జెప్పు' మనిన నయ్యింద్రునకు గరుడం డి ట్లనియె. 110

ప్రతిపదార్థం: ఏను= నేను; మదీయ, మాతృ, దాసీత్వ, నిరాస+అర్థంబు= తల్లియొక్క దాసితనాన్ని పోగొట్టటానికి; ఉరగులకున్= పాములకు; అమృతంబున్, తెచ్చి, ఇత్తున్, అని= తీసుకొని వచ్చి ఇస్తానని; కాద్రవేయులతోన్= కద్రువకుమారు లయిన పాములతో; నొడివి, వచ్చినవాఁడన్= చెప్పి వచ్చినవాడిని; ఈ, అమృతంబు; కొనిపోయి= తీసికొనివెళ్ళి; వారలకున్= ఆపాములకు; ఇచ్చి; మదీయ, జననీ, దాస్యంబున్= నాతల్లియొక్క దాసితనాన్ని; పాచికొనినన్= పోగొట్టుకొన్నతరువాత; ఉరగులు= పాములు; ఈ, అమృతంబున్= నేను తీసికొనివెళ్ళిన అమృతాన్ని; ఉపయోగింపకుండన్= వాడకుండ(భుజింపకుండ); ముందఱన్= ముందుగా; నీవు; కొని=తీసికొని; చనుము= వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; ఆ,

గరుడని, మహత్+అనుభావంబునకున్= ఆగరుత్మంతుడి మహత్త్వానికి; మెచ్చి=మెచ్చుకొని; నీ, బల, పరాక్రమంబులు= నీయొక్క బలాన్ని; పరాక్రమాన్ని; వినన్, వలతున్= వినగోరుతాను; చెప్పుము; అనినన్= అనగా; ఆ+ఇంద్రునకున్= ఆ దేవేంద్రుడికి; గరుడండు; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: 'నేను నాతల్లి అయిన వినతదాస్యం తొలగించే నిమిత్తం, మీకు అమృతం తీసికొని వచ్చి ఇస్తా నని కద్రువకుమారు లైన పాములతో చెప్పి వచ్చాను. ఈ అమృతం తీసికొనిపోయి ఆ పాముల కిచ్చి నా తల్లిదాస్యం పోగొట్టుకొన్న పిమ్మట, పాము లీ అమృతం త్రాగకముందే నీవు దాన్ని గ్రహించి వెళ్ళుము' అని గరుడడు పలుకగా అతని మహత్త్వం మెచ్చుకొని 'నీబలాన్ని, పరాక్రమాన్ని వినగోరుతాను; చెప్పు' మని అడుగగా ఆ ఇంద్రునితో గరుడుడు ఇట్లా పలికాడు.

క. పరనిందయు, నాత్మగుణో।
త్కరపరికీర్తనముఁ జేయఁగా నుచితమె స
త్పురుషుల? కైనను, నీ క।
చ్చెరువుగ నా కలతెఱంగుఁ జెప్పెదఁ బ్రీతిన్. 111

ప్రతిపదార్థం: సత్, పురుషులకున్= సజ్జనులకు; పర, నిందయున్= ఇతరులను నిందించటం; ఆత్మ, గుణ+ఉత్కర, పరికీర్తనమున్= తనయొక్క గుణాల సముదాయాన్ని పొగడుకోవటం; చేయఁగాన్, ఉచితము+ఎ= చేయటం తగునా! ఐనను= అయినప్పటికిని; నీకున్= (ఇంద్రుడికి); అచ్చెరువుగన్= ఆశ్చర్యమయ్యేటట్లుగా; నా, కల, తెఱంగున్= నాసత్య మయిన విధాన్ని; ప్రీతిన్= ఇష్టంతో; చెప్పెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఇతరులను నిందించటం, తమగుణాలసముదాయాన్ని మెచ్చుకోవటం చేయటం సజ్జనులకు తగునా? (తగదు). అయినా నీకు ఆశ్చర్య మయ్యేటట్లుగా నా సత్యమయినవిధాన్ని ప్రీతితో చెప్తాను.

ఉ. స్థావరజంగమప్రవితతం బగు భూవలయంబు నెల్ల నా
లావునఁ బూని తాల్తు, నవిలంఘ్యపయోధిజలంబు లెల్ల ర

త్నావళితోన చల్లుదు బృహన్ని జపక్షసమీరణంబునన్,
దేవగణేశ! యీక్షణమ త్రిమ్మరి వత్తుఁ ద్రివిష్టపంబులన్. 112

ప్రతిపదార్థం: దేవ, గణ+ఈశ= దేవతల సమూహానికి రాజా!; స్థావర, జంగమ, ప్రవితతంబు+అగు= అచరాలు, చరాలు అయిన వస్తువులతో నిండినట్టి; భూవలయంబున్, ఎల్లన్= భూమండలాన్నంతటిని; నాలావునన్= నాబలంతో, పూని= వహించి; తాల్తున్= మోస్తాను; బృహత్, నిజ, పక్ష, సమీరణంబునన్= పెద్ద వయిన నారెక్కలగాలితో; అవిలంఘ్య, పయోధి, జలంబులు+ఎల్లన్= దాటశక్యం కాని సముద్రంయొక్క నీళ్ళ నన్నింటిని; రత్న+ఆవళితోన్+అ= రత్నాలసమూహంతో పాటుగా; చల్లుదున్= వెదజల్లుతాను; త్రి, విష్టపంబులన్= మూడులోకాలను; ఈక్షణము+అ= ఒక్కక్షణంలోనే; త్రిమ్మరి, వత్తున్= చుట్టు తిరిగి వస్తాను.

తాత్పర్యం: ఓదేవగణాలకు రాజా! ఇంద్రుడా! చరాలు; అచరాలు అయిన పదార్థాలతో నిండినట్టి భూమండలాన్నంతటిని నాబలంతో వహించి మోస్తాను. పెద్ద వయిన నారెక్కలగాలితో దాట శక్యం కాని సముద్రపునీళ్ళ నన్నింటిని రత్నాలసమూహంతో పాటుగా వెదజల్లుతాను. మూడులోకాలను క్షణంలో చుట్టి వస్తాను.

విశేషం: గరుత్మంతుడిలో ధీరోదాత్తలక్షణాలు ప్రకటితమైనవి. ఉదారత(బంధము యొక్క అవికటత్వం)అనే శబ్దగుణం ఉదాత్తంగా పోషింపబడింది. ఈ పద్యం పరాక్రమవర్ణనానికి గౌరవం తెచ్చింది. ఇది నన్నయగుణసంవిధానశిల్పం.

వ. అని చెప్పిన గరుడని జవసత్త్వసామర్థ్యంబులకు మెచ్చి సంతసిల్లి 'నీవు నాతో నెప్పుడు బద్ధసఖ్యుండ వై యుండవలయు' నని, వెండియు దేవేంద్రుండు గరుడని కి ట్లనియె. 113

ప్రతిపదార్థం: అని, చెప్పినన్= అని చెప్పగా; గరుడని= గరుత్మంతుడి యొక్క; జవ, సత్త్వసామర్థ్యంబులకున్= వేగానికి, బలానికి, శక్తికి; మెచ్చి; సంతసిల్లి= సంతోషించి; నీవు= (గరుత్మంతుడు); నాతోన్= (దేవేంద్రుడితో);

ఎప్పుడున్= ఎల్లప్పుడు; బద్ధ, సఖ్యుండవు+అయి= కట్టబడిన స్నేహం కలవాడి వై; ఉండన్, వలయున్, అని= ఉండా లని, వెండియున్= మళ్ళీ; దేవ+ఇంద్రుండు= దేవతలకు రాజయిన ఇంద్రుడు; గరుడనికిన్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని గరుడడు చెప్పగా, అతనివేగానికి, బలానికి, శక్తికి మెచ్చుకొని, సంతోషించి, 'నీవు నాతో ఎల్లప్పుడు స్నేహం కలవాడి వయి ఉండాలి' అని పలికి, మళ్ళీ ఇంద్రుడు గరుడనితో ఇ ట్లన్నాడు.

క. 'నా కభిమత మొనరించితి ।
నీ కిష్టము చెప్పికొను' మనిన 'దుర్మదు లై
మా కి ట్లహితముఁ జేసిన ।
యా కద్రువపుత్త్రు లశన మయ్యెడు నాకున్'. 114

ప్రతిపదార్థం: నాకున్+అభిమతము= నాకు(ఇంద్రుడికి) ఇష్టమైనదాన్ని; ఒనరించితి(వి)= చేశావు; నీకున్= (గరుత్మంతుడికి); ఇష్టము= ప్రియ మైనది; చెప్పికొనుము= తెల్పుము; అనినన్= అని చెప్పగా; దుర్మదులు+ఐ= చెడ్డగర్వం కలవా రయి; మాకున్= నాకు, నాతల్లి అయిన వినతకు; అహితమున్= అపకారాన్ని; చేసిన; ఆకద్రువ, పుత్త్రులు= ఆకద్రువ యొక్కకొడుకులు(పాములు); నాకున్= నాకు; అశనము+అయ్యెడున్= ఆహారం అగునుగాక!

తాత్పర్యం: 'నాకు ఇష్ట మైనదాన్ని చేశావు. నీ కిష్ట మయినదాన్ని తెల్పుము' అని ఇంద్రుడు గరుత్మంతుడితో చెప్పగా, 'అతిగర్వం కలవా రయి నాకు, నాతల్లి అయిన వినతకు అపకారం చేసిన కద్రువకొడుకులు నాకు ఆహారం కావాలి'.

క. భవదభిరక్ష్యము లగు నీ ।
భువనంబులయందు సర్పములు ద్రిమ్మరుటన్
దివిజాధిప! నీ కెటిఁగిం ।
పవలసె; నీయాజ్ఞ నాకుఁ బడయఁగ వలసెన్. 115

ప్రతిపదార్థం: దివిజ+అధిప= దేవతలకురాజా! భవత్+అభిరక్ష్యములు+ అగు= నీచే కాపాడదగినట్టి; ఈ, భువనంబుల, అందున్= ఈలోకాలలో; సర్పములు= పాములు; త్రిమ్మరుటన్= తిరుగుచుండటంచేత; నీకున్; ఎఱిగింపన్‌వలసెన్= తెలియజేయ వలసి వచ్చింది; నీ, ఆజ్ఞన్= నీఅనుజ్ఞను; నాకున్; పడయఁగన్‌వలసెన్= పొందవలసి వచ్చింది.

తాత్పర్యం: ఓ దేవరాజా! ఇంద్రుడా! నీచే రక్షింపదగినట్టి ఈలోకాల్లో పాములు తిరుగుతుండటంచేత నీకు తెలియజేయవలసి వచ్చింది. నాకు నీఆజ్ఞ పొందవలసి వచ్చింది.

విశేషం: మహాబలశాలి అయిన గరుడడు తనంత తానే పాములను తినగలడు. ఇతరులఅనుమతి అడుగవలసిన అక్కరలేదు. అయినా, ఇంద్రపాలితా లయిన లోకాల్లో పాములు తిరుగుతుంటాయి కాబట్టి, వినయంతో అతని ఆజ్ఞను అర్థించాడు.

వ. అని గరుడండు దనకు నురగభోజనత్వంబు సురపతిచేతం బడసి, తదనుగమ్యమానుం డై, యురగుల యొద్దకు వచ్చి, మరకతహరితం బైన కుశాస్తరణంబున నమృతకలశంబు నిలిపి, యురగులకుం జూపి యి ట్లనియె. 116

ప్రతిపదార్థం: అని; గరుడండు= గరుత్మంతుడు; తనకున్, ఉరగ, భోజనత్వంబు= పాములు భోజనంగా గలిగిఉండటాన్ని; సురపతిచేతన్= దేవతలకు రా జయిన ఇంద్రునిచేత; పడసి= పొంది; తద్, అనుగమ్యమానుండు+ఐ= ఆ ఇంద్రునిచే అనుసరింపబడుతున్నవాడయి; ఉరగుల+ఒద్దకున్= పాములసమీపానికి; వచ్చి; మరకత, హరితంబు+ఐన= మరకతమణులవలె ఆకుపచ్చనైన; కుశ+ఆస్తరణంబునన్= దర్భలపరుపుమీద; అమృతకలశంబు= అమృతం కలపాత్రను; నిలిపి= ఉంచి; ఉరగులకున్= పాములకు; చూపి; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: అని గరుడడు తనకు పాములు భోజనంగా కలిగిఉండటాన్ని ఇంద్రుడిచేత పొంది, ఆ ఇంద్రుడిచే అనుసరింపబడుతున్నవా డయి పాములదగ్గరకు, వచ్చి, మరకతమణులవలె పచ్చగా ఉన్న దర్భల పరుపుపై (పేర్చినచోట) అమృత ముండేపాత్రను పెట్టి, పాములకు చూపి, ఇట్లా పలికాడు.

విశేషం: అలం: ఉపమ.

క. అనిమిషనాథ సుగుప్త మ ।
యిన యమృతము దెచ్చి మీకు నిచ్చితి; నస్మ
జ్జననీదాస్యము వాసెను ।
దినకరపవనాగ్నితుహినదీప్తుల కరిగాన్. 117

ప్రతిపదార్థం: అనిమిష, నాథ, సు, గుప్తము+అయిన= దేవతలకు రా జయిన ఇంద్రుడిచేత బాగుగా రక్షింపబడిన; అమృతము, తెచ్చి, మీకున్, ఇచ్చితిన్= అమృతాన్ని తెచ్చి మీ కిచ్చాను; అస్మద్+జననీ, దాస్యము= నాతల్లి అయిన వినతయొక్క దాసితనం; దినకర, పవన+అగ్ని, తుహిన, దీప్తులు+అ= సూర్యుడు, గాలి, అగ్ని, చంద్రుడు అనేవారు; కరి, కాన్= సాక్షిగా; పాసెన్= తొలగింది.

తాత్పర్యం: దేవేంద్రుడిచేత బాగుగా రక్షింపబడిన అమృతాన్ని తెచ్చి మీ కిచ్చివేశాను. సూర్యుడు, గాలి, అగ్ని, చంద్రుడు అనేవాళ్ళు సాక్షులుగా నాతల్లి అయిన వినతయొక్క దాసితనం పోయింది.

విశేషం: దాస్యము+పాసెను= దాస్యమువాసెను - పకారానికి వాదేశం. అస్మద్+ జనని= అస్మజ్జనని - శ్చుత్వసంధి. ఈపద్యంలో అర్థవ్యక్తి(అర్థవ్యక్తి హేతుత్వం)అనే శబ్దగుణం రాణిస్తున్నది. 'అనిమిషనాథసుగుప్త' మైన అమృతాన్ని తాను తేవటంలో ఉన్న తెగువను గరుత్మంతుడు చెప్పటంతోపాటు గుప్తంగాఉన్న ఇంద్రుడిబారి నుండి అమృతాన్ని దక్కించుకోవటం మీశక్తియుక్తులమీద ఆధారపడి ఉన్నదని చెపుతున్న అర్థం ఇందులో వ్యంగ్యం. అమృతం తేవటమేకాని దానిని వినియోగించటం తన బాధ్యత కాదని వ్యంగ్యం. వెంటనే తల్లిని తీసికొని వెళ్ళటంలో అది స్పష్ట మౌతున్నది.

వ. 'మీరలు స్నాతాలంకృతుల రై వచ్చి దీని నుపయోగింపుం' డని పంచి, తల్లిం దనవీఁ పెక్కించుకొని విహగేంద్రుం డురగుల కదృశ్యుండైయున్న సురేంద్రు వీడ్కొని చనియె; నిట యురగులును నమృతోపయోగకు తూహలంబున నొండొరులం గడవఁ గృతస్నానాలంకృతు లై చనుదెంచుటకు ముందఱ. 118

ప్రతిపదార్థం: మీరలు= మీరు; స్నాత+అలంకృతులరు+ఐ= స్నానం చేసినవారు, అలంకరించు కొన్న వారు నై (విశేషణోభయపదకర్మధారయం); వచ్చి; దీనిన్= ఈఅమృతాన్ని; ఉపయోగింపుండు+అని= వాడుకొనం డని (భుజించం డని); పంచి= పంపి; తల్లిన్= తల్లి అయిన వినతను; తన, వీఁపు+ఎక్కించుకొని= తనవీపున ఎక్కించుకొని; విహగ+ఇంద్రుండు= పక్షులకు ఇంద్రు డయిన గరుత్మంతుడు; ఉరగులకున్= పాములకు; అదృశ్యుండు+ఐ= కనబడనివా డై; ఉన్నన్; సుర+ఇంద్రు= దేవతలరా జయిన ఇంద్రుడిని; వీడ్కొని= పోయివస్తా నని చెప్పి విడిచి; చనియెన్= వెళ్ళాడు; ఇట= అమృతముండే చోట; ఉరగులునున్= పాములు కూడా; అమృత+ ఉపయోగ, కుతూహలంబునన్= అమృతాన్ని వాడుకొనే (త్రాగే) ఉత్సాహంతో; ఒండు+ ఒరులన్= ఒకరొకరిని; కడవన్= దాటి ముందుకు పోయేటట్లు; కృత, స్నాన+ అలంకృతులు+ఐ= చేయబడినస్నానం కలవారును, అలంకరింపబడినవారును అయి; చనుదెంచుటకున్= రావటానికి; ముందఱన్= ముందుగానే.

తాత్పర్యం: 'మీరు స్నానం చేసిన పిమ్మట అలంకరించుకొని వచ్చి అమృతం త్రాగం' డని పంపి, పక్షిరా జయిన గరుత్మంతుడు తల్లి అయిన వినతను తనవీపుపై ఎక్కించుకొని, పాములకు కనబడకుండ ఉండే దేవేంద్రుడి కడ సెలవుపుచ్చుకొని వెళ్ళిపోయాడు. ఇంక ఇచ్చట- పాములు అమృతం ఉపయోగించటంలోని ఉత్సాహంతో ఒండొంటిని దాటేటట్లుగా(ఆహమహమికతో) స్నానం చేసి, అలంకరించుకొని రావటానికి ముందే.

విశేషం: స్నాతాలంకృతులు+రు. ఇది ప్రథమావిభక్తితో ముగిసే యుష్మద్విశేషణ మవటంచేత, బహువచనాంత మవటంచేత 'రు' ఆగమంగా వచ్చింది. ఈ ఆగమానికి వెనుక ఉండే ఉత్వం అత్వంగా మారింది. స్నాతాలంకృతులరు.

క. అమరాధిపుఁ డమృతముఁ గొని ।
యమరావతి కరిగి, తొంటియట్టుల సుస్థా
నమున నవిచలిత రక్షా ।
క్షముఁ డై రక్షించుకొని సుఖస్థితి నుండెన్. 119

ప్రతిపదార్థం: అమర+అధిపుఁడు= దేవతలకు రాజయిన ఇంద్రుడు; అమృతమున్+ కొని= అమృతాన్ని తీసికొని, అమరావతికిన్= దేవతలపట్టణ మయిన అమరావతికి; అరిగి= వెళ్ళి; తొంటి, అట్టులు+అ= పూర్వం విధంగానే; సు, స్థానమునన్= మంచిచోట; అవిచలిత, రక్షా, క్షముఁడు+ఐ= చెదరని రక్షణలో సమర్థు డయి; రక్షించుకొని= కాపాడు కొని; సుఖ, స్థితిన్= సుఖమయిన ఉనికితో; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడు అమృతాన్ని గ్రహించి, అమరావతీనగరానికి వెళ్ళి పూర్వంవలెనే, ఆ అమృతాన్ని మంచిచోట ఉంచి స్థిరమైన రక్షణంలో సమర్థు డై రక్షించుకొంటూ, సుఖంతో కూడిన స్థితితో ఉండినాడు.

వ. అంత నయ్యురగులు నమృతం బుపయోగింపం గానక దానియున్నస్థానం బని దర్భలు నాకిన నాలుకలు రెండుగా వ్రయ్యుటంజేసి, నాటంగోలె ద్విజిహ్వులు నాఁ బరఁగిరి; యమృతస్థితింజేసి దర్భలు పవిత్రంబు లయ్యె. 120

ప్రతిపదార్థం: అంతన్= తర్వాత; ఆ+ఉరగులు= ఆ పాములు; అమృతంబు= అమృతాన్ని; ఉపయోగింపన్, కానక= ఉపయోగింపలేక (త్రాగాలని ఎంచి దాన్ని కానక); దాని, ఉన్న, స్థానంబు+అని= అది ఉన్నచోటని; (కర్తృపద ప్రథమకు షష్ఠి); దర్భలు; నాకినన్= నాకగా; నాలుకలు; రెండుగా; వ్రయ్యుటన్, చేసి= చీలుటచేత; నాటన్, కోలెన్= నాటనుండి; ద్వి,

జిహ్వలు, నాన్= రెండు నాలుకలు కలవారనేటట్లు; పరఁగిరి= ఒప్పినారు; అమృత, స్థితిన్, చేసి= అమృతంయొక్క ఉనికిచేత; దర్భలు; పవిత్రంబులు+ అయ్యెన్= పవిత్రాలయ్యాయి.

తాత్పర్యం: పిమ్మట ఆపాములు అమృతం త్రాగటానికి వెళ్ళి, అది అచ్చట లేకపోవటంచేత ఉపయోగింప లేక అది ఉన్నస్థల మని దర్భలు నాకగా వాటిఅంచులు పదునుగా ఉంటాయికాబట్టి వాటి నాలుకలు రెండుగా చీలాయి. నాటినుండి పాములు (ద్విజిహ్వలు) రెండునాలుకలు కలవిగా ఒప్పినాయి. అమృతం తమపై ఉంచటం చేత దర్భలు పవిత్రాలయ్యాయి.

క. ఈ సౌపర్ణాఖ్యానము।
భాసురముగ వినిన పుణ్యపరులకు నధిక
శ్రీ సంపద లగు; దురితని।
రాసం బగుఁ; బాయు నురగరక్షోభయముల్. 121

ప్రతిపదార్థం: ఈ, సౌపర్ణ+ఆఖ్యానము= గరుత్మంతుడికి సంబంధించిన ఈ కథను; భాసురముగన్= ప్రకాశమానంగా (ఒప్పుగా); వినిన= వినినట్టి; పుణ్యపరులకున్= పుణ్యంపట్లఆసక్తి కలవారికి; అధికశ్రీ సంపదలు= విస్తారమయిన సిరియు, సంపదయు; అగున్= కలుగుతుంది; దురితనిరాసంబు= పాపాలు తొలగటం; అగున్=అవుతుంది; ఉరగ, రక్షః , భయముల్= పాములవలన, రాక్షసులవలన భయాలు; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: గరుత్మంతుడికి సంబంధించిన ఈ కథను ఒప్పుగా వినిన పుణ్యాత్ములకు అధిక మయిన సిరిసంపదలు కలుగుతాయి. పాపక్షయం అవుతుంది. పాములనుండి, రాక్షసులనుండి భయాలు తొలగిపోతాయి.

విశేషం: ఇది గరుడోపాఖ్యానం వినటంవలన కలిగే ఫలాన్ని తెల్పుతున్నది - ఫలశ్రుతి.

* * *